www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 20-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 306 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.57 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆర్ద్ర మ. 12.14 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 1.16-3.00, దుర్ముహూర్తం: రా. 1.16-3.00, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.44, సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

లెక్కలు తేలక.. అలజడి!

రోజంతా ఐప్యాక్ బృందంతో జగన్ సమీక్ష.. రీసర్వే ఫలితాలపై మంతనాలు

కొందరు సిటింగ్‌లకు టికెట్లపై తర్జనభర్జన.. కొడాలి నాని, వంశీకీ డౌటే!

నానిని గన్నవరానికి పంపుతారని సీఎం సొంత మీడియాలో ప్రచారం

తాజాగా తెరపైకి ముద్దరబోయిన!.. బెజవాడ లోక్‌సభకు మళ్లీ వంశీ?

ఇటీవలే కేశినేని నాని పేరు ప్రకటన.. దీంతో ఇరు వర్గాల్లో అయోమయం

మళ్లీ ఢిల్లీకి జగన్?.. ప్రధాని అపాయింట్‌మెంట్ కోరిన సీఎం!



సీపీఎస్ రద్దు చేయలేకపోయాం

మద్యపానం నిషేధించలేక పోయాం: సజ్జల 11



'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడికి నిరసనగా తిరుపతిలో జర్నలిస్టు, ప్రజా సంఘాలు, రాజకీయ నేతల ఆందోళన

వాళ్లు వైసీపీ గూండాలే..!

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని వీడియోలు, ఫొటోల ఆధారంగా గుర్తిస్తున్న జనం

శ్రీకృష్ణకు హైదరాబాద్ 'అపోలో'లో చికిత్స

మెరుగైన వైద్యం కోసం అనంత నుంచి తరలింపు

దాడి చేసింది మంత్రి ఉష, తోపుదుర్తి, విశ్వ అనుచరులు

మద్యం, బియ్యం అక్రమ రవాణా కేసుల్లో నిందితులు

'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగు చూసిన నిజాలు

ఎవరినీ అదుపులోకి తీసుకోని రాప్తాడు పోలీసులు



హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణ

సిగ్గు.. సిగ్గు!

జర్నలిస్టులపై దాడులకేనా 'సిద్ధం'?

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

రాష్ట్రమంతా రగిలిన జర్నలిస్టులు

ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనల వెల్లువ

పాల్గొన్న టీడీపీ, జనసేన, లెఫ్ట్, ప్రజా సంఘాలు 12

పేదోడి చైతన్య రథం

సైకిల్!

అదెప్పుడూ ప్రజల మధ్యే.. సైకిల్, గ్లాస్ విలువ పెత్తందారుకు అర్థం కాదు: లోకేశ్

రెక్కలు విరిగిన 'ఫ్యాన్'ను చెత్తలో పడేసే రోజులు దగ్గర్లోనే



అనకాపల్లి జిల్లా వడ్డాదిలో జరిగిన శంఖారావం సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న లోకేశ్

మళ్లీ జగన్ వస్తే.. మీ ఇళ్లు, పొలాలూ ఉండవ్!

వైసీపీ నేతలు అన్నీ కబ్జా చేసేస్తారు

వారికి సహకరించలేదనే తహసీల్దార్ హత్య

2 నెలల్లో జగన్ కుర్చీని జనం మడత పెట్టడం తథ్యం

విశాఖకు నెలకు 2 కంపెనీలు తెచ్చా.. ఇప్పుడు వారానికో కిడ్నాప్, కబ్జా, మర్డర్.. ఉత్తరాంధ్ర సభల్లో టీడీపీ యువ నేత ఆగ్రహం

విశాఖపట్నం, అనకాపల్లి-ఆంధ్రజ్యోతి/బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 19: మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఇళ్లు, పొలాలను కూడా వైసీపీ నేతలు కబ్జా చేస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ హెచ్చరించారు. విశాఖలో వారి భూ కబ్జాలకు సహకరించలేదనే ఎమ్మార్వో రమణయ్యను కిరాతకంగా

మిగతా 11వ పేజీలో...



మంచి అవకాశాలను.. అందునా విద్యార్థులకు ఉపయోగపడే అవకాశాలను వీలైనంత ఎక్కువకాలం అందిపుచ్చుకోవాలనుకోవడం ఎవరైనా చేసే పని. కానీ... మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరే వేరు! ఆయనది 'అమ్మ పెట్టదు.. అడుక్కు తిననివ్వదు' అన్న చందం! తెలంగాణలో ఆంధ్రా స్థానికత ఉన్న విద్యార్థులకు ఉన్న అవకాశాలు 'మాకొద్దు పొండి' అని ఏపీ సర్కారు తనంతట తానే కాలదన్నేసింది. దీనిపై అధ్యయనానికి కమిటీ కూడా వేసేసింది. 'మీ విద్యార్థులకు అవకాశాలు ఇచ్చేది లేదు' అని తెలంగాణ సర్కారు చెప్పకముందే జగన్ సర్కారు ఈ నిర్ణయం తీసుకోవడంపై విద్యా నిపుణులు విస్తుపోతున్నారు.

మీ చదువులు మాకొద్దు!

తెలంగాణలో ఏపీ విద్యార్థులకు తలుపులు మూసేస్తున్న జగన్ సర్కారు

15 శాతం ఓపెన్ కోటాకు గుడ్ బై

పదేళ్లు ముగిసిందంటూ ప్రత్యేక సమీక్ష

రాష్ట్రపతి ఉత్తర్వులపై అధ్యయనానికి కమిటీ

ఏపీలో ఇంజనీరింగ్ చదువులకు జగన్ చెదలు

ఇప్పటికీ తెలంగాణ కాలేజీలపైనే క్రేజ్

15% కోటాతో ఏపీ విద్యార్థులకు ఎంతో మేలు

తెలంగాణ నో అనకముందే జగన్ అత్యుత్సాహం

హైదరాబాద్ 'ఉమ్మడి రాజధాని'పై ఆసక్తి

విద్యార్థులకు అవకాశాలపై ఏదీ శ్రద్ధ?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన 'ఆర్టికల్ 371డీ'ని విభజన తర్వాతా పదేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించారు. దీని ప్రకారం రెండు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 15 శాతం 'ఓపెన్ కోటా' అమలవుతోంది. దీనిని రాష్ట్ర విభజన చట్టంలోని 95డీ సెక్షన్‌లో చేర్చారు. 2024 జూన్ 2వ తేదీతో విభజన జరిగి పదేళ్లవుతున్న నేపథ్యంలో... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి దీనిపై సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ, ఉన్నత

మిగతా 2వ పేజీలో...

'వెయ్యి కోట్లు' ఇచ్చేశారు!

టెండర్లు లేకుండా విద్యా కానుక కొనుగోళ్లు

పాత కాంట్రాక్టర్లకు నామినేషన్‌పై అప్పగింత

మొత్తం కాంట్రాక్టు విలువ రూ.1,042 కోట్లు

వేర్వేరు కాంట్రాక్టర్లకు ప్యాకేజీలుగా విభజన

నాణ్యత లేకపోయినా వారికే కొనసాగింపు 3

ఎమ్మెస్పీకి పంచవర్ష ప్రణాళిక!

పప్పులు, మొక్కజొన్న, పత్తి పంటలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొంటాం

కొనుగోళ్లకు ఎలాంటి పరిమితి ఉండదు

రైతులతో 4వ విడత చర్చల్లో కేంద్రం ప్రతిపాదన..

రెండు రోజుల్లో నిర్ణయం: రైతు నేతలు 2



ఎమ్మెస్పీకి పంచవర్ష ప్రణాళిక!

పప్పులు, మొక్కజొన్న, పత్తి పంటలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొంటాం

» రైతులతో చర్చల్లో కేంద్రం ప్రతిపాదన.. తిరస్కరించిన రైతు నేతలు



రైతు నేతలతో చర్చల్లో అర్జున్, గోయల్, నిత్యానంద్. చిత్రంలో భగవంత్‌మాన్

చండీగఢ్, ఫిబ్రవరి 19: 'చలో ఢిల్లీ' పేరిట ఆందోళన చేస్తున్న రైతుల ముందుకు 'పంచవర్ష ప్రణాళిక' ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం వచ్చింది. పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా ఐదేళ్లపాటు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కి కొనుగోలు చేస్తామని ముగ్గురు కేంద్ర మంత్రులతో కూడిన బృందం ప్రతిపాదించింది. అయితే, కేంద్రం చేసిన ఈ ప్రతిపాదనను రైతు నేతలు తిరస్కరించారు. కేంద్ర ప్రతిపాదనతో రైతులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. చలో ఢిల్లీని బుధవారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నిజానికి, ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఆందోళన చేస్తున్న రైతులతో కేంద్రం జరిపిన నాలుగో విడత చర్చలు ముగిశాయి. ఆదివారం రాత్రి 8.15 గంటలకు ప్రారంభమైన ఈ చర్చలు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. కేంద్ర ప్రభుత్వం తరఫున వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, పియూష్ గోయెల్, నిత్యానంద్ రాయ్.. రైతు నేతలతో చర్చించారు. రైతు నేతలతోపాటు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా పాల్గొన్నారు. చర్చల తర్వాత గోయెల్ మాట్లాడుతూ.. రైతు నేతలు లేవనెత్తిన పలు అంశాలపై సానుకూలంగా చర్చించామని చెప్పారు. పప్పుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి పంటలను ఐదేళ్లపాటు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రతిపాదించినట్టు చెప్పారు. నేషనల్ కోపరేటివ్ కన్జుమర్స్ ఫెడరేషన్ (ఎన్‌సీసీఎఫ్), నేషనల్ అగ్రికల్చర్ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఏఎఫ్ఈడీ) వంటి సహకార సంఘాలు.. ఆయా పంటలు వేసే రైతులతో ఐదేళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంటాయని గోయెల్ తెలిపారు. అలాగే కొనుగోలు పరిణామానికి ఎలాంటి పరిమితి ఉండబోదని, దీనికోసం ఓ పోర్టల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అయితే, రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న కేంద్ర ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ సోమవారం రాత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రతిపాదనపై తమ సంఘాలతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేదా చలో ఢిల్లీ బుధవారం శాంతియుతంగా కొనసాగేందుకు ప్రభుత్వం సహకరించాలని రైతు నేత సర్వాన్ సింగ్ పంధేర్ పేర్కొన్నారు. కాగా, రైతులతో మరో సారి చర్చించే అవకాశం ఉందా..? అన్న ప్రశ్నకు కేంద్ర మంత్రి గోయెల్ సమాధానమిస్తూ.. తమ ప్రతిపాదనలపై రైతులు చర్చించి ఆందోళన విరమిస్తే... వారు కోరినట్టుగానే ప్రభుత్వం వారితో చర్చిస్తుందని చెప్పారు.

లోకం తీరు



మీ చదువులు మాకొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ, ఆర్థిక, న్యాయ శాఖ, సాధారణ పరిపాలన శాఖ అధికారులతో భేటీ అయ్యారు. "సెక్షన్ 95డీని కొనసాగించడం వల్ల ఏపీ విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం లేదని గత ఏడాది డిసెంబరు 12వ తేదీనే సూత్రప్రాయంగా తేల్చేశాం. దీనికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడమా... లేక కొత్తగా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడమా అన్నది నిర్ణయించాలి" అంటూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై అధ్యయనం చేసేందుకు సీఎస్ అధ్యక్షతన ఒక కమిటీ వేశారు. ఈ కమిటీలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యదర్శి, ఉన్నతవిద్యాశాఖ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి, ఆయా రంగాల్లో నిపుణులను సభ్యులుగా నియమించారు.

హైదరాబాద్‌పై ఉన్న శ్రద్ధ... విద్యపై లేదా?

'పరిపాలనా రాజధాని ఇంకా పూర్తి కాలేదు. అందువల్ల హైదరాబాద్‌ను మరో రెండేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి' అంటూ కొత్త పల్లవి అందుకున్న సంగతి తెలిసిందే. అమరావతిని రాష్ట్ర రాజధానిగా కేంద్రం నోటిఫై చేసిన వెంటనే... 'ఉమ్మడి' కథ ముగిసింది. అయినా సరే... విభజన జరిగిన పదేళ్ల తర్వాత కూడా హైదరాబాద్‌ను వదులుకోలేం అని వైసీపీ పెద్దలు చెబుతున్నారు. కానీ... తెలంగాణలోని విద్యా సంస్థల్లో మన విద్యార్థులకు దక్కే సీట్లను మాత్రం వదులుకుంటారట! మెడికల్ అడ్మిషన్లకు సంబంధించి ఎవరి రాష్ట్రంలోని సీట్లను వారే నింపుకునేలా ఇదివరకే నిర్ణయం జరిగిపోయింది. కానీ... ఇతర విద్యా సంస్థల విషయంలో తెలంగాణతో పోల్చితే ఏపీ ఇంకా వెనుకబడే ఉంది. మరీ ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీ అడ్మిషన్ల కోసం ఇప్పటికీ ఏపీ విద్యార్థులు తెలంగాణ వైపే చూస్తున్నారు. ఏపీలో పేరున్న ఇంజనీరింగ్ కాలేజీలు ఎక్కువగా లేకపోవడం ఒక ప్రధాన సమస్య. ఉన్న కొద్దిపాటి మంచి కాలేజీలనూ 'ఫీజుల్లో కోతపెట్టడం', ఇతరత్రా ఆంక్షలతో జగన్ సర్కారు రాచిరంపాన పెడుతోంది. విద్యా ప్రమాణాలపై ఇది తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ, ఎన్ఐటీల తర్వాత ఏపీకి చెందిన మెరిట్ విద్యార్థులు తెలంగాణలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. 15శాతం ఓపెన్ కోటాలో అత్యధికంగా ఏపీ విద్యార్థులే సీట్లు సాధిస్తున్నారు. గత ఏడాది ఏకంగా 40వేల మంది ఏపీ స్థానికత ఉన్న విద్యార్థులు తెలంగాణ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ కోసం పోటీపడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు... 15 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లను 'స్వచ్ఛందం'గా వదులుకునేందుకు ఏపీ ప్రభుత్వమే చర్యలు తీసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

ఎవరు అడిగారని?

పదేళ్లు పూర్తయినప్పటికీ... కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా మరికొన్నేళ్లు 15 శాతం ఓపెన్ కోటా కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించవచ్చు. దీనికి తెలంగాణ అంగీకరిస్తే మంచిదే. లేకపోతే... దీనిపై కేంద్రాన్ని ఆశ్రయించవచ్చు. అన్నింటికీ మించి... 'విభజన జరిగి పదేళ్లు పూర్తవుతున్నందున ఎవరి సీట్లు వాళ్లే భర్తీ చేసుకుందాం. మా కాలేజీల్లో మీ విద్యార్థులకు సీట్లు ఇవ్వం' అని తెలంగాణ చెప్పనే లేదు. మన రాష్ట్రానికి సమాచారమూ ఇవ్వలేదు. 'మా కాలేజీల్లో సీట్లు మీకు ఇవ్వం' అని తెలంగాణ చెప్పినట్లు కానీ... ఏపీ విద్యార్థులకు ఇంకొంతకాలం అవకాశాలు కల్పించాలని జగన్ ప్రభుత్వం ప్రతిపాదించినట్లుగానీ సోమవారం ఇచ్చిన గెజిట్‌లో లేనే లేదు. ఇది ఏకపక్షంగా ఏపీ ప్రభుత్వమే తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తనంతట తాను వద్దన్నప్పటికీ... 'మరికొన్నేళ్లు కొనసాగిద్దాం ప్లీజ్' అని అడగాల్సింది పోయి, తనతంతట తానే తలుపులు మూసేస్తుండటం గమనార్హం. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమే.

విద్యార్థులపై ఎందుకీ కక్ష


వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తల్లోనే జీవో నంబర్ 77 తీసుకొచ్చింది. ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటాల్లో సీటు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు అందవనేది దీని సారాంశం. ఉన్నత విద్యలో అత్యధిక సీట్లున్నవి, డిమాండ్ ఎక్కువ ఉన్న కాలేజీలు ఎయిడెడ్, ప్రైవేటు రంగంలోనివే. ఆ కాలేజీల్లో చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్పులు రావని ఈ జీవోద్వారా విద్యార్థుల నెత్తిన పిడుగు పడేశారు. ఉద్యోగాలు కల్పించడంలో ఎలాగూ వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. కనీసం విద్యార్థులను ఉన్నత విద్యా కోర్సులను చదువుకోనివ్వడం లేదు. నాలుగేళ్ల పాటు విదేశీ విద్యను రద్దు చేసి చివరి ఏడాదిలో ప్రవేశపెట్టారు. దీని అమలుపై కూడా అనేక సందేహాలు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అరకొరగానే ఇస్తున్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోని విద్యార్థులకు దేశంలో ఉన్న ఏ కోచింగ్ సెంటర్‌లోనైనా సివిల్స్, రైల్వేస్, ఎస్ఎస్‌సీ, గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలన్నింటికి ఉచితంగా కోచింగ్ తీసుకునే అవకాశం కల్పించారు. జగన్ వచ్చాక ఈ పథకం మాయమైపోయింది. అలాగే, టెన్త్‌లో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు టీడీపీ హయాంలో ప్రభుత్వమే ఫీజులు కట్టి వారిని కార్పొరేట్ ఇంటర్ కాలేజీల్లో చదివించింది. జగన్ హయాంలో ఈ పథకం కూడా రద్దు చేశారు. ఇప్పుడు... ఏపీలోనే కాదు, హైదరాబాద్‌లో కూడా విద్యార్థులకు చదువుకునే అవకాశం లేకుండా చేస్తున్నారు.

కాలచక్రం ఇప్పుడు మనవైపు!

ఎన్నో రంగాల్లో మన దేశం ఫస్టు.. ప్రపంచానికి దిక్సూచిగా మారింది

» 'భారత్' దేవాలయ నిర్మాణ బాధ్యతను దేవుడు నాకు అప్పగించాడు: మోదీ

» యూపీలో కల్కిధామ్ గుడికి శంకుస్థాపన



కల్కిధామ్ గుడికి శంకుస్థాపన చేస్తున్న మోదీ

సంభల్/లఖ్‌నవూ, ఫిబ్రవరి 19: కాలచక్రం ఇప్పుడు భారత్ వైపు తిరిగిందని ప్రధాని మోదీ అన్నారు. మన దేశం ఎన్నో రంగాల్లో మొదటి స్థానంలో నిలిచిందని.. ప్రపంచానికి ఉదాహరణగా, దిక్సూచిగా నిలుస్తోందని తెలిపారు. సోమవారం యూపీలోని సంభల్‌లో శ్రీ కల్కి ధామ్ ఆలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి స్వయంగా మోదీ వద్దకు వెళ్లి ఆహ్వానించినందుకే ఈ ఆలయ నిర్మాణ ట్రస్టు చైర్మన్, కల్కిధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రమోద్ కృష్ణమ్‌ను పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. గత నెల 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కొత్త జీవన చక్రం మొదలైందని తాను చెప్పానని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'అయోధ్యారాముడు వేల సంవత్సరాలు ప్రభావితం చేశాడు. అదే విధంగా అయోధ్యలో బాలక్‌రామ్ ప్రతిష్ఠాపనతో వచ్చే వెయ్యేళ్లకు భారత కొత్త ప్రయాణం ప్రారంభమైంది. భారత్ అనే జాతిస్వరూప ఆలయాన్ని నిర్మించే బాధ్యతను భగవంతుడు నాకు అప్పగించాడు. ఈ కర్తవ్య నిర్వహణలో సాధు సంతులు నాకు ఆశీస్సులు అందించాలి. ఓవైపు తీర్థయాత్రా స్థలాలను అభివృద్ధి చేస్తున్నాం. మరోవైపు నగరాల్లో హైటెక్ మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆలయాలతోపాటు దేశవ్యాప్తంగా కొత్త వైద్య కళాశాలలు కూడా నిర్మిస్తున్నాం. విదేశాల్లో ఉన్న మన ప్రాచీన శిల్పసంపదను తిరిగి స్వదేశానికి తీసుకొస్తున్నాం. ఇదే సమయంలో రికార్డు స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. కాలచక్రం మారుతోందనడానికి.. నవశకం మన తలుపులు తడుతోందనడానికి ఈ మార్పే నిదర్శనం. మనం దానిని నిండుహృదయంతో స్వాగతిద్దాం' అని పేర్కొన్నారు. తొలి సారి భారత్ ఇతర దేశాలను అనుసరించడం లేదని.. తానే ఉదాహరణగా నిలుస్తోందని తెలిపారు. టెక్నాలజీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో అవకాశాల కేంద్రంగా భారత్ ఆవిర్భవించిందన్నారు. మనదేశానికి 'ఇన్నోవేషన్ హబ్'గా గుర్తింపు లభించిందని తెలిపారు. మొదటిసారి మన దేశం ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరామని గుర్తుచేశారు. 'గత నెలలో అయోధ్యలో రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ఠ చేశాం. ఐదు శతాబ్దాల ఎదురుచూపులకు తెరపడింది. ఆ దైవానుభవం, ఆ ఆధ్యాత్మిక భావన ఇప్పటికీ ఉద్వేగభరితం చేస్తోంది. అలాగే అరబ్ గడ్డపై అబూదాబీలో అతి భారీ దేవాలయాన్ని ప్రారంభించాం. విశ్వనాథ్ ధామ్ పురోగతిని, కాశీ పునరుజ్జీవాన్ని, ఉజ్జయిని మహాకాల్ మహాలోక్ వైభవాన్ని తిలకిస్తున్నాం. సోమనాథ్ అభివృద్ధిని, కేదార లోయ పునర్నిర్మాణాన్ని కూడా చూస్తున్నాం. వారసత్వంతో కూడిన అభివృద్ధి అనే మంత్రాన్ని పాటిస్తున్నాం. ఓటమి నుంచి కూడా విజయాన్ని అందుకోగల దేశం ఇండియా. ఎన్నో సార్లు దాడులు, దండయాత్రలకు గురైంది. మరే దేశంపైన గానీ, సంస్కృతిపైన గానీ ఇలాంటి దాడులు కొనసాగి ఉంటే అది పూర్తిగా నాశనమయ్యేది. కానీ వాటిని మనం తట్టుకుని శక్తిమంతంగా ఎదిగాం' అని తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రవచించిన జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగానికి కలిపితే ఏర్పడే రూపమే ప్రధాని మోదీ అని ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూపీ సీఎం యోగి కూడా పాల్గొన్నారు.

వ్యవసాయంలో కొత్త పుంతలకు చేయూత

వ్యవసాయంలో కొత్త పుంతలు తొక్కేలా రైతులకు కేంద్రం చేయూతనిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని భోజన బల్లలపై భారతీయ ఆహార ఉత్పత్తులు ఉండేలా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు మరోసారి భారీ ఉద్యమానికి సమాయత్తమైన తరుణంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. సోమవారమిక్కడ రూ.10 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టే 14 వేల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉత్పాదకత, పునరుత్పాదక ఇంధనం, ఫుడ్‌ప్రాసెసింగ్, గృహనిర్మాణం, ఆతిథ్యం, వినోదం, విద్య, స్థిరాస్తి రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులివి. తర్వాత ఇన్వెస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలు అద్భుత ఆహారమని.. ఈ రంగంలో పెట్టుబడులకు ఇదే అనువైన సమయమని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో గంగానదీతీరాన పెద్దఎత్తున ప్రకృతి సాగు జరుగుతోందని ప్రస్తావించారు. ఇది రైతులకు లాభసాటిగా ఉండడమే గాకుండా పవిత్ర జలాల పవిత్రతను సంరక్షిస్తుందన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ రంగ పారిశ్రామికవేత్తలు రైతులతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భర్త అంత్యక్రియలపై ఇద్దరు భార్యల గొడవ

» వివాదానికి మద్రాస్ హైకోర్టు తెర

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భర్తకు అంత్యక్రియలు తమ మతం ప్రకారమే జరపాలంటూ ఆయన ఇద్దరు భార్యలు పట్టుపట్టగా... సమస్యకు మద్రాస్ హైకోర్టు వినూత్న పరిష్కారం చూపింది. భౌతికకాయానికి హిందూమతం ప్రకారం సంప్రదాయ పూజలు నిర్వహించి, ముస్లిం మతం ప్రకారం ఖననం చేయాలని సూచించింది. కారైక్కుడి బర్మాకాలనీ వళ్లవర్ నగర్‌కు చెందిన బాలసుబ్రమణ్యన్ అలియాస్ అన్వర్ హుస్సేన్(59) రాష్ట్ర రవాణా శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన 36 ఏళ్ల క్రితం శాంతి అనే మహిళను వివాహం చేసుకోగా, వారికి ఒక కుమార్తె ఉంది. శాంతితో ఏర్పడిన విభేదాల కారణంగా ఆమె నుంచి విడివడిన బాలసుబ్రమణ్యన్.. తిరుపాలకుడి ప్రాంతానికి చెందిన సయ్యద్ అలిఫాతిమా అనే మహిళను 28 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. అనంతర కాలంలో అతను ముస్లిం మతం స్వీకరించి అన్వర్ హుస్సేన్‌గా పేరు మార్చుకున్నారు. పది రోజుల క్రితం గుండెపోటుతో మదురైలోని ప్రభుత్వాసుపత్రిలో చేరిన అన్వర్ హుస్సేన్.. రెండు రోజుల క్రితం మరణించారు. దీంతో ముస్లిం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించేందుకు భార్య ఫాతిమా ఏర్పాట్లు చేయగా.. మొదటిభార్య శాంతి వచ్చి తమ స్వగ్రామంలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తామని పట్టుబట్టారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో న్యాయస్థానంలో తేల్చుకోవాలంటూ.. మృతదేహాన్ని కారైక్కుడి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. భార్యలిద్దరూ హైకోర్టు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వామినాథన్.. అన్వర్ హుస్సేన్ భౌతికకాయానికి హిందూ మతం ప్రకారం సంప్రదాయపూజలు నిర్వహించి, ముస్లిం మతం ప్రకారం ఖననం చేయాలని సూచించారు.

ఇప్పటికైతే శరద్ వర్గానికి అదే పేరు

» ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా కొనసాగింపు.. సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) వివాదం విషయంలో సోమవారం సుప్రీంకోర్టు కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుతానికి శరద్ పవార్ వర్గం తమ పార్టీ పేరును ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా కొనసాగించుకోవచ్చని తెలిపింది. ఈ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించే విషయమై వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘానికి సూచించింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆధ్వర్యంలోనిదే నిజమైన ఎన్‌సీపీ అని ఈ నెల ఆరో తేదీన ఎన్నికల సంఘం ప్రకటించింది. శరద్ పవార్ వర్గాన్ని ఎన్‌సీపీ-శరద్‌చంద్ర పవార్‌గా పేర్కొంటూ మరుసటి రోజైన ఏడో తేదీన మరో ఉత్తర్వులు ఇచ్చింది. ఇది తాత్కాలిక ఏర్పాటు అని, రాజ్యసభ ఎన్నికలు జరిగే ఈ నెల 27 వరకే ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వకూడదంటూ ప్రత్యర్థి అజిత్ పవార్ కూడా కెవియట్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరాలు చెప్పేందుకు అజిత్ పవార్ వర్గానికి వారం రోజుల గడువు ఇచ్చింది. దానిపై వివరణ ఇచ్చేందుకు శరద్ పవార్ వర్గానికి మరో రెండు వారాల సమయం ఇచ్చింది. విచారణ సందర్భంగా జస్టిస్ విశ్వనాథన్ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. పాకిస్థాన్ ఎన్నికలతో పోల్చడం సరికాకపోయినా అక్కడ బ్యాట్ గుర్తు కావాలని ఒకరు అడిగారు, దాన్ని ఇవ్వలేదు, తరువాత చాలా జరిగిందని అన్నారు. ఓటరు మాటకు విలువ ఇవ్వాలని వ్యాఖ్యానించారు. కోర్టు ఆదేశాలపై శరద్‌పవార్ హర్షం వ్యక్తం చేశారు.

రిటర్నింగ్ అధికారిపై చర్యలు తప్పవు!

అనిల్ మాసిహ్‌ను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనన్న సుప్రీంకోర్టు

» చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలపై తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఎనిమిదిమంది కౌన్సిలర్ల బ్యాలెట్ పేపర్లపై 'ఎక్స్' అని రాసి, వారి ఓట్లు చెల్లకుండా చేసిన రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఒక రిటర్నింగ్ అధికారి జోక్యం చేసుకోవడం ఘోరమైన విషయమని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లను ఇప్పటికే కొనేస్తున్నందున మరో సారి ఎన్నిక జరపడం కంటే.. ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధం లేని మరో రిటర్నింగ్ అధికారితో అవే ఓట్లను తిరిగి లెక్కించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆధీనంలో ఉన్న బ్యాలెట్ పేపర్లను మంగళవారం తమ ముందు ప్రవేశపెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాటిని మంగళవారం పరిశీలించనున్నట్టు తెలిపింది. దీంతోపాటు కౌంటింగ్ రోజు ఏం జరిగిందో రికార్డయిన వీడియో మొత్తాన్నీ పరిశీలిస్తామని పేర్కొంది. ఆ రికార్డులన్నింటినీ సురక్షితంగా ఢిల్లీకి తీసుకొచ్చేందుకు ఒక జ్యుడీషియల్ అధికారిని నియమించాలని పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అసలు మొత్తం ఎన్నికల క్రమంలోనే అవకతవకలుండడం వల్ల రాజకీయ పార్టీలు కౌన్సిలర్లను కొనేస్తున్నాయని జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన బీజేపీ నేత మనోజ్ సోంకర్ సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అదే సమయంలో ఆప్ కౌన్సిలర్లు పూనం దేవి, నేహా ముసావత్, గురుచరణ్ కాలా బీజేపీలో చేరడం గమనార్హం. ఈ ముగ్గురూ సోమవారం ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్‌తావడే సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

స్వతంత్ర భారతంలో ఇదే తొలిసారి..

ఒక రిటర్నింగ్ అధికారిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నల వర్షం కురిపించడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి. చండీగఢ్ మునిసిపాలిటీలో నామినేటెడ్ సభ్యుడైన బీజేపీ నేత అనిల్ మాసిహ్ మేయర్ ఎన్నిక కోసం జరిగిన ఓటింగ్‌లో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. కాగా, అనిల్ మాసిహ్ రాజకీయ వేదికపై లేరని, న్యాయస్థానం ముందున్నారని గుర్తుంచుకోవాలని సీజేఐ స్పష్టం చేశారు. ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. సీసీటీవీలో రికార్డయిన వీడియోను తాము చూశామని సీజేఐ తెలిపారు. కెమెరా వైపు చూస్తూ బాలట్ పేపర్లపై 'ఎక్స్' అని రాయడం గురించి అనిల్‌ను ప్రశ్నించారు. కొన్ని బ్యాలెట్ పేపర్లపై 'ఎక్స్' అని రాసి ట్రేలో పెట్టిన విషయం తాము గమనించామన్నారు. దీంతో తాను ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై 'ఎక్స్' అని రాసి, పక్కన పెట్టేసిన విషయాన్ని అనిల్ అంగీకరించారు. అసలెందుకు 'ఎక్స్' గుర్తులు వేయాల్సి వచ్చిందని సీజేఐ నిలదీశారు. ఏ చట్టం ప్రకారం అలా చేశారని ప్రశ్నించారు. 'రిటర్నింగ్ అధికారిగా ప్రతి బ్యాలెట్ పేపర్ పై సంతకం మాత్రమే చేయడం మీ పని కాదా!' అని అడిగారు. రిటర్నింగ్ అధికారిగా తన విధులను ఉల్లంఘించినందున అనిల్‌పై ప్రాసిక్యూషన్ తప్పదన్నారు.

రాజ్యసభ ఎన్నికల్లో ఎన్డీయే అడ్డదార్లు

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యసభ ఎన్నికల్లో విజయం కోసం ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు అడ్డదారులు తొక్కుతున్నాయని, తమ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు జేడీఎస్ నేత, మాజీ సీఎం కుమారస్వామి ఫోన్‌చేసి పలు ఆఫర్లు ఇస్తున్నారని అన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమేనని బెదిరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్‌కు 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, మరో ఇద్దరు ఇండిపెండెంట్ల మద్దతు కూడా తమకే ఉందని శివకుమార్ చెప్పారు. ఈ లెక్కన బరిలో నిలబడ్డ ముగ్గురు అభ్యర్థులు తొలిరౌండులోనే గెలవడం ఖాయమన్నారు. శాసనసభలో తగిన బలం లేకపోయినా ప్రతిపక్షాలు రెండో అభ్యర్థిని బరిలోకి దించడం వెనుక బేరసారాల వ్యూహమే ఉందని తెలిపారు.

సిద్దరామయ్యకు సుప్రీంలో ఊరట

బెంగళూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత హోదాలో రాస్తారోకో చేసి, వివాదంలో చిక్కుకున్న కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు సుప్రీం కోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. హైకోర్టు ధర్మాసనం విధించిన జరిమానా, మార్చి 6న ప్రత్యేక కోర్టు ముందు హాజరుకావాలనే తీర్పును సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్యకు నిరసనగా 2022లో నాటి విపక్షం బెంగళూరు నగరంలో రాస్తారోకో చేసింది. ఈ వ్యవహారంలో సిద్దరామయ్య, రణదీప్ సూర్జేవాలా సహా పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది. కేసును విచారించిన కర్ణాటక హైకోర్టు.. సీఎం సిద్దరామయ్యకు, మరికొందరికి రూ.10వేల ప్రకారం జరిమానా విధించింది. హైకోర్టు తీర్పును సీఎం సిద్దరామయ్య సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

అయోధ్యకు పిలవకుండా రాష్ట్రపతిని అవమానించారు

» రామాలయ ప్రారంభోత్సవానికి వారికి అందని ఆహ్వానం

» ప్రధాని మోదీపై రాహుల్ ధ్వజం



ప్రతాప్‌గఢ్, ఫిబ్రవరి 19: రాష్ట్రపతి సహా దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారిని అయోధ్య ఆలయ ప్రతిష్ఠాపన వేడుకకు ఆహ్వానించకుండా అవమానించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. పారిశ్రామికవేత్తలు, అమితాబ్ బచ్చన్ వంటి వారందరినీ ఆహ్వానించారని రాహుల్ పేర్కొన్నారు. దీని ద్వారా దేశంలోని 73 శాతంగా ప్రజలకు ఏ ప్రాముఖ్యతా లేదని మోదీ తేల్చి చెప్పినట్లు అయిందని రాహుల్ విమర్శించారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా రామ్‌పూర్ ఖాస్ అసెంబ్లీ నియోజకవర్గంలోని లాల్‌గంజ్ ఇందిరా చౌక్ వద్ద సోమవారం జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. దేశ జనాభాలో 73 శాతంగా ఉన్న దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజన ప్రజలను బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని రాహుల్ ఆరోపించారు. రైతుల జేబులు కొట్టి ధనవంతుల జేబులు నింపుతున్నారంటూ మోదీపై రాహుల్ ధ్వజమెత్తారు. యువతకు ఉపాధి కల్పించడంలో, మహిళలకు భద్రత ఇవ్వడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను ప్రధాని మోదీ వేధిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. లాల్‌గంజ్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు రాహుల్‌కు స్వాగతం పలికారు.

పతనం అంచున హమాస్

ఇప్పటికే కీలక కమాండర్ల మృతి

» లొంగు'బాట'లో చాలా మంది ఫైటర్లు

» ఇజ్రాయెల్ శపథం నెరవేరుతోందా?

"హమాస్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం..! ప్రతి హమాస్ ఉగ్రవాదిని వేటాడి చంపేస్తాం..!!" గత ఏడాది అక్టోబరు 7న హమాస్ దాడి తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు చేసిన శపథం ఇది..! గాజాపై అక్టోబరు 28 నుంచి భూతల దాడులు ప్రారంభించిన ఇజ్రాయెల్.. మధ్యలో సంధికాలంలో(ఆరు రోజులు) తప్ప.. 115 రోజులుగా నిరాటంకంగా పోరాటం చేస్తూనే ఉంది. ఓ క్రమ పద్ధతిలో హమాస్ అగ్రనేతలను మట్టుబెడుతూ వస్తోంది. ముఖ్యంగా అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేశాక.. ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్' ప్రార్థనలు చేసిన ముఖ్య నాయకులను తొలుత టార్గెట్‌గా చేసుకుంది. ఈ క్రమంలో హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యులు జకారియా అబూ ముమ్మార్, ఎలైట్ ఫోర్స్ కమాండర్ అలీ అల్ ఖాదీ, హమాస్ ఆర్థిక విభాగం నేత జవాద్ అబూ షమ్మలా తదితర కీలక హమాస్ నేతలను ఐడీఎఫ్ తుదముట్టించింది. గత నెల లెబనాన్‌లో ఉన్న హమాస్ నేత సలేహ్ అల్-అరౌరీని హతమార్చడంతో హమాస్ పూర్తిగా బలహీనపడ్డట్లయింది. దీంతో మిగిలిన హమాస్ కమాండర్లు ఐడీఎఫ్‌కు లొంగిపోతున్నారు.

పంటికింద రాయిలా.. ఆ ఐదుగురు!

ఇప్పటి దాకా ఇజ్రాయెల్ కీలక హమాస్ కమాండర్లను తుదముట్టించినా.. పలు బ్రిగేడ్‌ల నాయకులు లొంగిపోయినా.. ఓ ఐదుగురు మాత్రం పంటికింద రాయిలా మిగిలిపోయారు. వారిలో తొలి స్థానంలో ఇస్మాయిల్ హనియే ఉన్నారు. ఈయన 2017 నుంచి హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతిగా కొనసాగుతున్నారు. గతంలో గాజాస్ట్రిప్‌ను హమాస్ స్వాధీనం చేసుకోవడంలో, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడిలో ఇతను కీలక సూత్రధారి. ఆయన తర్వాతి స్థానంలో ఖలీద్ మెషాల్ ఉన్నారు. ఇక హమాస్ సైనిక విభాగం-పొలిటికల్ బ్యూరో మధ్య సంధానకర్తగా పనిచేస్తున్న ఫాతిమా హమాద్ ఇప్పుడు తుర్కియేలో తలదాచుకుంటున్నారు. ఇజ్రాయెల్‌పై దాడిలో కీలకంగా వ్యవహరించిన యాహ్యా సిన్వార్ కూడా ఇజ్రాయెల్‌కు చిక్కడు-దొరకడు అన్నట్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతని వ్యూహాలు అత్యంత క్రూరంగా ఉంటాయి. ఇక ఇజ్రాయెల్‌కు దొరకకుండా ముప్పుతిప్పలు పెడుతున్న మూసా అబూ మర్జౌక్ జోర్డాన్‌లో ఉన్నారు. ప్రవాసం నుంచే ఇతను పొలిటికల్ బ్యూరో సీనియర్ సభ్యుడిగా పనిచేస్తున్నారు. హమాస్ అగ్రనేత అల్-ఖాసం మహమ్మద్ అల్-డైఫ్ కూడా ఇజ్రాయెల్‌కు మింగుడుపడడం లేదు.

\- సెంట్రల్ డెస్క్



లెబనాన్‌లోనూ టన్నెల్స్ నెట్‌వర్క్

గాజాలో హమాస్ సొరంగాల నెట్‌వర్క్ మాదిరిగానే.. దక్షిణ లెబనాన్‌లో హిజ్బుల్లా కిలోమీటర్ల మేర టన్నెల్స్‌తో భూగర్భంలో తలదాచుకునేలా భారీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు కొన్నేళ్ల క్రితమే ఈ సొరంగాలను నిర్మించినట్లు ఫ్రెంచ్ మిలటరీ స్కూల్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ రిసెర్చ్ వెల్లడించింది. గాజాలోని ఇసుక నేలల్లో సొరంగాలుండగా.. హిజ్బుల్లా టన్నెల్స్ మాత్రం కొండలను తొలిచి నిర్మించినట్లు వివరించింది.

ఢిల్లీ లిక్కర్ స్కాం నిందితుడికి వైసీపీ టికెట్!

- నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా శరత్‌చంద్రారెడ్డి
- విజయసాయి రెడ్డికి బంధువు కూడా



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న పెన్నాక శరత్ చంద్రారెడ్డి ఉరఫ్ అరబిందో శరత్ చంద్రారెడ్డికి వైసీపీ వీరతాడు వేసింది. ఆయనకు నెల్లూరు లోక్‌సభ స్థానం టికెట్‌ను కేటాయించినట్లు సమాచారం. ఈయన స్వయానా వైసీపీ కీలక నేత వి. విజయసాయిరెడ్డి బంధువు. తొలుత నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని జగన్ ప్రకటించారు. కానీ, నెల్లూరు లోక్‌సభ పరిధిలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చాలని వేమిరెడ్డి ప్రతిపాదించారు. దీనికి సీఎం జగన్ అంగీకరించలేదు. పైగా, ఈ అసెంబ్లీ స్థానాలో వేమిరెడ్డి వ్యతిరేకించిన వారినే సీఎం జగన్ ప్రోత్సహించారు. అంతేకాదు, నెల్లూరు సిటీ అభ్యర్థి విషయంలోనూ వేమిరెడ్డి మాటను పరిగణనలోకి తీసుకోలేదు. పైగా ప్రస్తుత నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ సన్నిహితుడు ఖలీల్ అహ్మద్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈ నియామకంపై వేమిరెడ్డికి మాట మాత్రంగా కూడా చెప్పలేదని తెలిసింది. మరోవైపు, ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు క్వార్ట్జ్ గనులు అప్పగించడంపైనా వేమిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. అయినప్పటికీ జగన్ ఆయనను పట్టించుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో వేమిరెడ్డి ఆకస్మికంగా పార్టీని వీడారు. ఇటీవల నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి సీఎం జగన్‌తో సమావేశమైనప్పుడు నాలుగురోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో.. విజయసాయిరెడ్డి అల్లుడికి సోదరుడైన అరబిందో డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డిని నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలన్న యోచనలో ఉన్నారని వైసీపీ వర్గాల్లో చర్చసాగుతోంది.

ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నేడు ధర్నాలు

- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీలో ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేలాది కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాలని మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలు 15 యూనిట్లలో ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నారు. ఈ ఆందోళనా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏపీజేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ హృదయ రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని యాజమాన్యాల్లో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, ఆర్టీసీ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తదితర 49 డిమాండ్ల సాధనకై చేపట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సోమవారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఏపీ జేఏసీ అత్యవసర సమావేశం జరిగినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 19, 20వ తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు లేకపోయినా టీచర్లు ఉద్యమంలో పాల్గొనకుండా అటంకం కల్పించాలనే దురుద్దేశంతోనే సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమావేశాలను బాయ్‌కాట్ చేసి సెలవు దరఖాస్తు చేసుకుని జిల్లాల్లో జరిగే ధర్నాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి 24 తేదీ వరకు జిల్లా పర్యటనలు చేస్తామని, 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

ఐఐఎంకు శాశ్వత క్యాంపస్



విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో సిద్ధమైన ఐఐఎం భవనం



ఐఐఎం భవనంలోని తరగతి గది

- విశాఖ క్యాంపస్ భవనాలు పూర్తిస్థాయిలో సిద్ధం
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవి) శాశ్వత క్యాంపస్ సిద్ధమైంది. నగర శివారున ఆనందపురం మండలం గంభీరంలో 241.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోపాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఇతర అధికారులు కూడా వర్చువల్ విధానంలోనే పాల్గొంటారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం విశాఖకు ఐఐఎంను కేటాయించింది. భవనాల నిర్మాణానికి అవసరమైన రూ.472.61 కోట్లను కేంద్రం మంజూరు చేయగా, గత తెలుగుదేశం ప్రభుత్వం ఆనందపురం మండలంలోని గంభీరంలో 241.5 ఎకరాలు కేటాయించింది. శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి 2015 జనవరి 17న అప్పటి కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ భూమి పూజ నిర్వహించారు. ఈ పనులు పూర్తికావడంతో ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించనున్నారు. శాశ్వత క్యాంపస్‌ను 62,350 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. దీనిలో ఫుట్‌బాల్ గ్రౌండ్, క్రికెట్ మైదానం, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌కు అనుగుణమైన సదుపాయాలు, జిమ్, యోగా, మెడిటేషన్ సెంటర్లను ఏర్పాటుచేశారు. 1500 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేశారు. కాగా, గత తొమ్మిదేళ్ల నుంచి ఏయూలోని తాత్కాలిక క్యాంపస్‌లో ఐఐఎం తరగతులు నిర్వహిస్తున్నారు. తొలిబ్యాచ్ 2015లో ప్రారంభమైంది.

'వెయ్యి కోట్లు' ఇచ్చేశారు!

- టెండర్లు లేకుండా విద్యా కానుక కొనుగోళ్లు
- పాత కాంట్రాక్టర్లకు నామినేషన్‌పై అప్పగింత
- మొత్తం కాంట్రాక్టు విలువ రూ.1042 కోట్లు
- వేర్వేరు కాంట్రాక్టర్లకు ప్యాకేజీలుగా విభజన
- నాణ్యత లేకపోయినా వారికే కొనసాగింపు
- ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చాక భారీ కాంట్రాక్టులను టెండర్లు లేకుండా ఎవరికీ కట్టబెట్టలేదు. అంతేకాదు.. రివర్స్ టెండరింగ్ అనే కొత్తకాన్సెప్టును అమలు చేశారు. అయితే.. తాజాగా విద్యాశాఖలో జరిగిన వ్యవహారం వివాదానికి దారితీసింది. రూ.1000 కోట్ల విలువైన కాంట్రాక్టును ఎలాంటి టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిపై నచ్చిన వారికి అప్పగించేశారని తెలిసింది. ఇది కేవలం ప్రభుత్వ పెద్దలు, కొందరు అధికారుల కోసమే చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రూపాయికీ పారదర్శకత అని చెబుతున్న ప్రభుత్వమే ఇప్పుడు అడ్డదారిలో కాంట్రాక్టర్లకు మేలు చేస్తోంది. ఎన్నికలకు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక కమీషన్ల వ్యవహారం ఉండి ఉంటుందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

టెండర్లకు స్వస్తి

జగన్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'విద్యా కానుక' పథకం తీసుకొచ్చారు. ఒక్కొక్క విద్యార్థికీ ఒక బ్యాగు, మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, సాక్సులు, బెల్టు, పుస్తకాలు ఇస్తున్నారు. వీటి సరఫరాకు గత నాలుగేళ్లుగా ఏటా టెండర్లు పిలిచి కొనుగోలు చేస్తున్నారు. ప్రతి వస్తువును ప్రాంతాలవారీగా నలుగురు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో ఏటా సుమారు 20 ప్యాకేజీలకు వేర్వేరుగా టెండర్లు వస్తున్నాయి. దీంతో దాదాపు రూ.వెయ్యి కోట్ల టెండరు అయినా ఒక్కక్కటీ రూ.100 కోట్లు దాటలేదనే కారణంగా న్యాయ సమీక్షకు పంపడం లేదు. దీనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. కేవలం న్యాయ సమీక్షను తప్పించుకునేందుకే ఎక్కువ ప్యాకేజీలుగా విడగొడుతున్నారన్న వాదన ఉంది. అయితే, ఇంతకాలం కేవలం న్యాయ సమీక్షకే డుమ్మా కొట్టిన పాఠశాల విద్యాశాఖ ఇప్పుడు ఏకంగా టెండర్లకు స్వస్తి చెప్పింది. ఎలాంటి కారణాలు లేకుండా టెండర్లు ఎత్తేసింది.

> **అంతా మా ఇష్టం!**
>
> పాఠశాల విద్యాశాఖ మరో అడ్డగోలు నిర్ణయం తీసుకుంది. పారదర్శకతకు పాతరవేస్తూ విద్యాకానుక కిట్ల కొనుగోలు విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకుంది. ప్రతిదానికీ టెండర్లు, న్యాయ సమీక్ష అని ఇప్పటి వరకు ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల టెండర్లను నామినేషన్ పద్ధతిపై అప్పగించేసింది. ఎందుకు? ఏమిటి? అనే వివరణ కూడా లేకుండా 'అంతా మాఇష్టం' అన్నట్టుగా కాంట్రాక్టును నచ్చిన వారి చేతిలో పెట్టింది.

అదే ధరకు కొంటారట!

ప్రస్తుత విద్యా సంవత్సరంలో పంపిణీ చేసిన విద్యా కానుకకు గతేడాది టెండర్లు పిలిచారు. అప్పట్లో ఒక్కొక్క విద్యా కానుక కిట్ రూ.2400 అయ్యింది. 39.95 లక్షల కిట్లను రూ.1042 కోట్లతో కొనుగోలు చేశారు. ఇప్పుడు టెండర్లు లేకపోవడంతో పాత ధరకే ఇచ్చేలా కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నారు. మిగిలిన నిబంధనలన్నీ అలానే ఉంటాయని పాఠశాల విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అయితే, మార్కెట్‌లో వచ్చే హెచ్చుతగ్గు ధరలను సమీక్షించకుండా పాత ధరనే ఎలా నిర్ణయిస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. అసలు ఆయా కిట్ల ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో ఎలా ఉన్నాయనేది అధ్యయనం చేయకుండా పాత ధరను నిర్ణయించేశారు. పైగా గతేడాది 39.95 లక్షల కిట్లు కొనుగోలు చేయగా, ఇప్పుడు మళ్లీ 39.5లక్షల కిట్లు కొనుగోలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. కానీ గతేడాది 39.5లక్షల కిట్లు కొనుగోలు చేసినా బడుల్లో 39 లక్షల మంది విద్యార్థులు కూడా చేరలేదు. ఇక అంతకముందు సంవత్సరాల్లోనూ లక్షల్లో కిట్లు మిగిలిపోయాయి. వాటిని తిరిగి వినియోగించడంలో అధికారులు విఫలమయ్యారు. ఓవైపు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా మళ్లీ మళ్లీ అదనంగా కిట్లు కొనడం వెనుక నిధులు దుబారా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నాణ్యత లేని కిట్లే

విద్యా కానుక కిట్లను.. గతేడాది నుంచి కేంద్ర సంస్థతో నాణ్యత పరిశీలన చేయిస్తున్నామని పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. అయినా, ఈ విద్యా సంవత్సరంలోనూ నాసిరకం కిట్లే పంపిణీ చేశారు. విద్యా కానుకలో ఇచ్చిన బ్యాగుల్లో చాలా వరకు చిరిగిపోయాయి. చిరిగిపోయిన బ్యాగులు వెనక్కి తెప్పించాలనే ఆదేశాలు కూడా అధికారులే ఇచ్చారు. బూట్లు మరీ నాసిరకంగా ఉంటున్నాయని, అందుకే వేసుకోవడం లేదని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యటనల్లోనే బయటపడింది. దీంతో రూ.వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేయడం వల్ల ఉపయోగం ఏంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్రశిక్ష కార్యాలయంలో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్ల ఎంపిక విషయంలో చక్రం తిప్పుతున్నారనే విమర్శ తొలి నుంచీ ఉంది. అందుకే, 'అంతా మాఇష్టం' అన్నట్టుగా ఆ అధికారులు వ్యవహరిస్తూ, టెండర్లు లేకుండా చేశారనే ప్రచారం జరుగుతోంది.

పోటీ ఎక్కడో ఇప్పుడే చెప్పలేను సీఎంవో నుంచి పిలుపు రాలేదు

- ఎక్కడ చేయమంటే అక్కడ చేస్తా: నటుడు ఆలీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19: 'వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తా అనేది ఇప్పుడే చెప్పలేను. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు ఇంకా రాలేదు. వారంలో రావచ్చని అనుకుంటున్నా' అని ప్రముఖ హాస్య నటుడు, వైసీపీ నుంచి అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న ఆలీ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. గుంటూరు లేదా రాజమహేంద్రవరం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది కదా..? అన్న మీడియా ప్రశ్నకు ఆయన స్పందిస్తూ... అధిష్ఠానం ఎక్కడి నుంచి పోటీచేయమంటే అక్కడి నుంచి పోటీ చేస్తానన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా సాయి శ్రీనివాస్



అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి

భీమవరం, ఫిబ్రవరి 19 : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీ యూ) 77వ వార్షిక కౌన్సిల్ సమావేశాలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్నందున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని, పాత పెన్షన్ అమలుకు ఇచ్చిన హామీని నిల బెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్ తీర్మానించింది. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకులు ప్రతాప్ రాజు సోమవారం ప్రకటించారు. అధ్యక్షునిగా ఎల్.సాయిశ్రీనివాస్ (ప.గో.జిల్లా), ప్రధాన కార్యదర్శిగా మల్లు రఘునాథ రెడ్డి(కడప జిల్లా), ఆర్థిక కార్యదర్శిగా కె.కోటేశ్వరరావు(పల్నాడు), ఉపాధ్యాయ వాణి సంపాదకులుగా గాజుల నాగేశ్వరరావు (తిరుపతి) ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఆరుగురు, ఉపాధ్యక్షులుగా 13మంది, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఏడుగురు, కార్యదర్శులుగా 13మంది, ఆర్థిక కమి టీ సభ్యులుగా ఐదుగురు ఎన్ని కయ్యారు.

దేవాలయాల పునర్నిర్మాణ శంకుస్థాపన

- పాల్గొన్న హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణ మోహన్



బొప్పూడిలో దేవాలయాల పునర్నిర్మాణ కార్యక్రమంలో జస్టిస్ బి. కృష్ణమోహన్ దంపతులు

చిల క లూ రి పేట, ఫిబ్రవరి 19 : పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో సోమవారం శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయాల పునర్నిర్మాణ శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ బి. కృష్ణ మోహన్ దంపతులు పాల్గొన్నారు. సుమారు రూ 1.50 లక్షల వ్యయంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్, జిల్లా ఫారెస్టు అధికారి రామచంద్రరరావు, డిప్యూటీ కలెక్టర్ బి. నారదముని కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు విగ్రహాలు అవసరమా?

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

విజయవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు విగ్రహాలు అవసరమా అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ స్మృతివనంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.500 కోట్లు వెచ్చించిందని, ఈ నిధులతో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కారమయ్యేవని అభిప్రాయపడ్డారు. జెండాలు, దండలు, విగ్రహాలు వద్దని, రాజ్యాధికారం కావాలని అంబేడ్కర్ ఘోషించారని చెప్పారు. కేసీఆర్ దళిత ఓట్ల కోసం రూ.120 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇలా చేస్తే దళితులు, బీసీలు మోసపోతారా అని ప్రశ్నించారు. తాను ఇచ్చిన పిలుపుతోనే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఓడించారన్నారు. చంద్రబాబు, జగన్, పవన్... మోదీకి తొత్తులని విమర్శించారు. ఈ తొత్తులతో ఉన్న ప్రజలు మూర్ఖులు, తెలివి లేని వారని వ్యాఖ్యానించారు. జగన్‌కు బుర్ర పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. ఆయనకు బుర్ర ఉంటే కేజ్రీవాల్, స్టాలిన్, రేవంత్‌రెడ్డిలా పాలించేవాడని చెప్పారు. జగన్ ఓడిపోవడానికి సిద్ధం గానీ, అభివృద్ధికి సిద్ధం కాదంటున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ఒక్కో కుటుంబంపై రూ.5కోట్ల భారం మోపాడని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు చేసిన దాడిని పాల్ తీవ్రంగా ఖండించారు. సభల్లో జగన్ చొక్కాలు మడతపెట్టండని పిలుపును ఇవ్వడం దీనికే సంకేతమా అని ప్రశ్నించారు. ఆయన పిలుపు ఇవ్వగానే వైసీపీ కార్యకర్తలు రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారని మండిపడ్డారు.

టీటీడీ ఈవోపై విచారణ జరిపించాలి: భానుప్రకాశ్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుపతి తిరుమల దేవస్థానాన్ని టీటీడీ ఈవో, జగన్ పార్టీకి ధారదత్తం చేస్తున్నారని బీజేపీ ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. తిరుమలకు వచ్చే ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి వాటిని అధికార పార్టీకి బదలాయిస్తున్నారని ఆరోపించారు. సోమవారం ఏపీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... న్యాయవ్యవస్థను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని టీటీడీ ఈవోపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టీటీడీ టికెట్ల జారీకి సంబంధించి భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. వైసీపీ ఇన్‌చార్జ్‌లకు బ్రేక్ దర్శన టికెట్లలో కోటా కేటాయించారని ఆరోపించారు. గత 15 రోజుల నుంచి టీటీడీ ఎవరెవరికి ఎన్ని టికెట్లు కేటాయించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భక్తులను ఓటర్లుగా మారుస్తూ తిరుమలను వైసీపీ కార్యాలయంగా మార్చివేస్తున్నారని ఆరోపించారు.

41ఏ నిబంధనలు పాటించలేదు

- సుప్రీం మార్గదర్శకాలను అనుసరించలేదు
- హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలు.. నోటీసులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారనే ఆరోపణలతో నమోదైన కేసులో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటించని పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న గుంటూరు జిల్లా అప్పటి ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ, మంగళగిరి అర్బన్ పోలీస్ స్టేషన్ అప్పటి ఇన్‌స్పెక్టర్ శీలం శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ ఇ.నారాయణలకు వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు సోమవారం ఆదేశాలిచ్చారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న ఆరోపణలతో నమోదుచేసిన కేసులో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటించలేదని, అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించకుండా నేరుగా అరెస్ట్ చేశారని, దీనికి బాధ్యులైన పోలీసు అధికారులను శిక్షించాలని కోరుతూ కె.వేణు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. షేక్ నయబ్ రసూల్ దాఖలు చేసిన మరో కోర్టు ధిక్కరణ కేసులో అప్పటి ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ, అప్పటి మంగళగిరి గ్రామీణ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

గతేడాది 3,026 కేసులను పరిష్కరించిన లోకాయుక్త

- వార్షిక నివేదికలో వెల్లడి



2023 వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పించిన రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 19: ప్రభుత్వ అధికారుల అవినీతి, ఆరోపణలపై విచారించి పాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెంపొందించేందుకు విశేషంగా కృషి చేసినట్లు రాష్ట్ర లోకాయుక్త తన 2023 వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో లోకాయుక్త రిజిస్ట్రార్ టి.వెంకటేశ్వరరెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ సీహెచ్ పోలయ్య విజయవాడలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు తమ నివేదికను సమర్పించారు. రాష్ట్ర లోకాయుక్తలో 2022లో మొత్తం 2,405 కేసులు దాఖలు కాగా, 2023 సంవత్సరంలో 2,813 కేసులు దాఖలైనట్లు నివేదికలో పొందుపరిచారు. 2022లో 2,863 కేసులు పరిష్కారం కాగా, 2023లో 3,026 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే... కర్నూలు జిల్లాకు సంబంధించి 488 కేసులు దాఖలై మొదటి స్థానంలో ఉండగా.. పార్వతీపురమన్యం జిల్లాకు సంబంధించి 14 కేసులు దాఖలై చివరి స్థానంలో ఉంది. కేసుల పరిష్కారంలోనే గాక ఆర్థికంగా కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.41.13 కోట్లు ఆదాయం రాబట్టేందుకు కృషి చేసినట్లు లోకాయుక్త తన నివేదికలో పేర్కొంది. లోకాయుక్త ఆధునికీకరణలో మాదిరిగా 2023లో కొత్తగా ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసి ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా దాఖలు చేసుకునేలా ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర లోకాయుక్త వార్షిక నివేదికలో పేర్కొంది.

అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వాలి

హడావుడిగా టెట్, టీఆర్‌టీ నిర్వహణపై హైకోర్టులో పిటిషన్

- నోటిఫికేషన్లు రద్దు చేసి.. తాజా షెడ్యూల్ జారీకి విజ్ఞప్తి
- వివరాల సమర్పణకు సమయం కోరిన ఏజీపీ
- విచారణ రేపటికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏపీ టెట్, ఏపీ టీఆర్‌టీ నోటిఫికేషన్లను రద్దు చేసి.. అభ్యర్థులకు తగినంత సమయం ఉండేలా తాజా షెడ్యూల్ ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణ రావు వాదనలు వినిపిస్తూ... ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ)ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి షెడ్యూల్ ప్రకటించిందన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే టీఆర్‌టీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. టెట్ ఫలితాలను మార్చి 14న ప్రకటిస్తుండగా, ఆ తర్వాతి రోజే టీఆర్‌టీ నిర్వహిస్తున్నారని, అభ్యర్థులు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం ఇవ్వడం లేదని వివరించారు. టెట్‌కు సైతం ఈనెల 8న నోటిఫికేషన్ ఇచ్చారని, ఈ నెల 27న పరీక్ష నిర్వహించనున్నారని, పరీక్షకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు 19 రోజుల సమయం మాత్రమే ఉందని తెలిపారు. హడావుడిగా ప్రక్రియను ముగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు మరింత సమయం ఇవ్వాలని కోరారు. కాగా, గతంలో ఇచ్చిన షెడ్యూల్‌తో పోల్చితే ప్రస్తుతం హడావుడిగా పరీక్ష నిర్వహణకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోందని ధర్మాసనం పేర్కొంది. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరఫున ఏజీపీ అభ్యర్థించగా..న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ అంగీకరించారు. వివరాలను రాతపూర్వకంగా సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. విచారణను బుధవారానికి వాయిదా వేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు, మరో నలుగురు ఈ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ఇదే తరహా వ్యాజ్యాలు సీజే ధర్మాసనం ముందు లిస్ట్ అయ్యాయని, సీజే సెలవు కావడంతో మంగళవారానికి వాయిదా పడ్డాయని ఏజీపీ వివరించారు. దీనిపై సీనియర్ న్యాయవాది స్పందిస్తూ... ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రూల్స్‌ను సవాల్ చేస్తూ సీజే వద్ద పిటిషన్లు దాఖలయ్యాయన్నారు. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని తెలిపారు. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ రూల్స్‌ను సవాల్ చేస్తూ పిటిషన్లు వేశారన్నారు. ప్రస్తుత పిటిషన్, సీజే ముందున్న వ్యాజ్యాలు భిన్నమైనవని పేర్కొన్నారు. మరోవైపు సెకండ్ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులను అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రూల్స్‌ను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు సోమవారం సీజే ధర్మాసనం ముందు లిస్ట్ అయ్యాయి. సీజే సెలవులో ఉండడంతో వ్యాజ్యాలను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు జస్టిస్ ఏవీ శేషసాయి ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ వినతిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వ్యాజ్యాలను సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతుందని స్పష్టం చేస్తూ విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

స్పీకర్ ఎదుటకు రాని రెబెల్స్

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపు ఆరోపణలకు సంబంధించి సోమవారం తన ముందు హాజరు కావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం నుంచి నోటీసులు అందుకున్న వైసీపీ, టీడీపీ రెబెల్స్ హాజరు కాలేదు. ఈ నెల 8న ఆయన ముందుకు వచ్చిన మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి (వెంకటగిరి) తాను పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని.. మోపిన అభియోగాలకు సాక్ష్యాలను చూపాలని కోరిన సంగతి తెలిసిందే. పైగా తాను ప్రకటనలు ఇచ్చానని చెబుతున్న పత్రికల యాజమాన్యాల నుంచి ధ్రువీకరణ పత్రాలు కూడా చూపాలని విజ్ఞప్తి చేశారు. తమకూ ఇదే తరహాలో సాక్ష్యాలను అందజేయాలని మిగిలిన ముగ్గురు వైసీపీ రెబెల్స్ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి (నెల్లూరు రూరల్), మేకపాటి చంద్రశేఖరరెడ్డి (ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి(తాడికొండ) కూడా స్పీకర్‌కు లేఖ రాశారు. ఇంకోవైపు.. ఇప్పటిదాకా టీడీపీ రెబెల్ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ (గన్నవరం), కరణం బలరాం (చీరాల), మద్దాలి గిరి (గుంటూరు పశ్చిమ), వాసుపల్లి గణేశ్ (విశాఖ దక్షిణ).. స్పీకర్ నోటీసులకు స్పందించలేదు. ఇలాంటి తరుణంలో సోమవారం తుది నిర్ణయం తీసుకుంటానని 8 మంది ఎమ్మెల్యేలకూ తమ్మినేని షోకాజ్ పంపారు.

సీఎంతో స్పీకర్ తమ్మినేని భేటీ

- ఆమదాలవలస టికెట్ కోసమే?

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. సోమవారమిక్కడ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను సీఎం సమీక్షిస్తున్నారు. ఆమదాలవలస సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తమ్మినేనికి ఈసారి చాన్స్ దక్కే అవకాశం లేదని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం జగన్‌ను తమ్మినేని కలిశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రైవేట్ బ్యాంకులు రుణతోడ్పాటు అందించాలి



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

- ఎస్ఎల్‌బీసీలో ఆర్థిక మంత్రి బుగ్గన విజ్ఞప్తి

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో వివిధ ప్రైవేట్ బ్యాంకులు కూడా తమ వంతు రుణ తోడ్పాటు అందించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన 226వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'కౌలు రైతులకు పెద్ద ఎత్తున రుణాలిచ్చి ఆదుకోవాలి. పాడి పరిశ్రమ అభివృద్ధికి కూడా తగినన్ని రుణాలివ్వాలి. డెయిరీ రంగం, కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమలకూ రుణ సహాయం అందించి ప్రోత్సహించాలి' అని కోరారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రుణాలతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో ప్రైవేట్ బ్యాంకులు తమ వంతు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. 2023-24 వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రాధాన్యత రంగాలకు రూ.4,77,234 కోట్లు రుణాలు అందించి, 108 శాతం రుణ లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. యూబీఐ సీజీఎం రాజీవ్ మిశ్రా, నాబార్డు సీజీఎం గోపాల్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ రావత్, ఆర్బీఐ స్టేట్ ఇన్‌చార్జి రాజేశ్ పాల్గొన్నారు.

రబీలో సాధించని రుణ లక్ష్యం

రాష్ట్రంలో 2023-24 రబీ వ్యవసాయ రుణాల్లో బ్యాంకులు లక్ష్యాన్ని సాధించలేకపోయినట్లు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదికలు స్పష్టం చేశాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 8.80లక్షల పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) జారీచేసినా, కౌలురైతుల్లో లక్షన్నర మందికి కూడా రుణాలిచ్చిన దాఖలా లేదు. వార్షిక రుణ లక్ష్యం ప్రకారం రూ.2,31,000 కోట్ల వ్యవసాయ రుణాలివ్వాల్సి ఉండగా, 2023 ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.2,08,136 కోట్లే పంపిణీ చేశా రు. ఖరీఫ్‌లో 4.44 శాతం అదనంగా రుణాలిచ్చినా.. రబీలో బ్యాంకులు 69.96 శాతమే రుణా లిచ్చాయి. రబీలో పంట రుణాల లక్ష్యం రూ. 60,680 కోట్లు. పంపిణీ రూ. 39,496కోట్లు. దీర్ఘకాల వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.27,880 కోట్లు. పంపిణీ రూ.22,722 కోట్లు. వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.88,560కోట్లు. పంపిణీ రూ.62,218 కోట్లు. వ్యవసాయ మౌలిక, అనుబంధ రంగాల రుణ లక్ష్యం రూ.7,500 కోట్లుకు రూ.4,986 కోట్లు మాత్రమే పంపిణీ చేశాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాప్తాడులో రాక్షసత్వం!

అనంతపురం జిల్లా రాప్తాడు సమీపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణమీద జరిగినదాడి పాలకుల నిరంకుశత్వానికి మరో రుజువు. వృత్తినిర్వహణలో భాగంగా సభను చిత్రీకరించిన ఈ ప్రతినిధి, ముఖ్యమంత్రి ప్రసంగం ఆరంభమైన కొద్దినిముషాల్లోనే ప్రజలు సభాప్రాంగణంనుంచి వెళ్ళిపోతున్న దృశ్యాలను కూడా కెమెరాలో బంధించాడు. దీనితో వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన మీద విరుచుకుపడ్డారు. జేబులోనుంచి ఐడీకార్డులాగి, ఆంధ్రజ్యోతి పేరు చూడగానే వీరావేశమెత్తిపోయారు. తమ చేతుల్లో ఉన్న వైసీపీ జెండా కర్రలతో అతడిని చావగొట్టారు. కర్రలతో కొడుతూ, కాళ్ళతో కుమ్ముతూ చాలాదూరం వరకూ వెంటాడి వేటాడారు. తీవ్రంగా గాయపడిన ఆ ఫోటోగ్రాఫర్ చివరకు సొమ్మసిల్లిపోవడంతో, ఒక పోలీసు అధికారి ఎత్తుకొని తన జీపులోకి చేర్చారు. ఆ ఫోటోగ్రాఫర్ కెమెరా, పర్సు, సెల్‌ఫోన్ ఇత్యాదివన్నీ లాక్కున్న వైసీపీ కార్యకర్తలు జీపుకు అడ్డుపడుతూ, ఆ పోలీసు అధికారిమీద కూడా దాడి యత్నం చేశారు. ఆఖరునిముషంలో, పోలీసువాహనంలో తరలించకపోయివుంటే ఈ ఫోటోగ్రాఫర్ ఆ ఉన్మాదుల చేతిలో ప్రాణాలుకోల్పోయేవాడేమో! మొదట అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో, పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఇప్పుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అతను చికిత్సపొందుతున్నాడు.

ఉత్తరాది రాష్ట్రాల్లో 'మాబ్ లించింగ్' ను ఈ ఉదంతం గుర్తుకు తెస్తున్నది. ముఖ్యమంత్రి సమక్షంలో, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్న సభలో జరిగిన ఈ మూకదాడి వీడియోను చూసి దేశం విస్తుపోయింది. పాత్రికేయ సంఘాలు తీవ్ర నిరసనను, ఆగ్రహాన్ని వ్యక్తంచేశాయి. జర్నలిస్టు ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురిచేసిన ఈ ఘటనకు నిరసనగా ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టు సంఘాలు ప్రదర్శనలు నిర్వహించాయి. ఇదేమీ యాదృచ్ఛికంగా జరిగిన దాడికాదు. పార్టీ సభల్లోనే కాదు, ప్రభుత్వ కార్యక్రమాల్లో సైతం సీఎం జగన్ ఆంధ్రజ్యోతి సహా కొన్ని మీడియా సంస్థలమీద అక్కసు వెళ్ళగక్కుతూ, వాటిపై తాను యుద్ధం చేస్తున్నానని చెబుతూ కార్యకర్తలను రెచ్చగొడుతున్న పర్యవసానం ఇది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ అరెస్టునుంచి తప్పించుకోవడానికి గత ఏడాది మే నెలలో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి విశ్వభారతి ఆస్పత్రిలో తలదాచుకున్న విషయం తెలిసిందే. సీబీఐ అధికారులు అక్కడకు వచ్చారన్న ప్రచారం జరగడంతో, ఆ వార్తను నివేదించడానికి వెళ్ళిన ఆంధ్రజ్యోతి ప్రతినిధిని కడపజిల్లా వైసీపీ కార్యకర్తలు ఒక గదిలో నిర్బంధించి రాత్రంతా తీవ్రంగా కొట్టారు. అలాగే, కర్నూలులో పార్టీలోని రెండువర్గాల మధ్య పోరులో ఫ్లెక్సీలు చింపుకుంటున్న ఘటనను చిత్రీకరించినందుకు వైసీపీ కార్యకర్తలు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ మీద మూకుమ్మడి దాడిచేసి కర్రలతో కొట్టారు. ప్రజలకు సమాచారాన్ని అందించడం పాత్రికేయుల విధి. కానీ, తమకు వ్యతిరేకంగా రాస్తున్నారంటూ కొన్ని మీడియా సంస్థల పేర్లు చెబుతూ, నిండు సభల్లో పేపర్లు ప్రదర్శిస్తూ సాక్షాత్తూ ముఖ్యమంత్రే రెచ్చగొడుతున్నందున అధినేత మనసెరిగిన కార్యకర్తలు ఇలా మీడియా మీద తెగబడుతున్నారు.

ముఖ్యమంత్రి సభలో ఒక పాత్రికేయుడిమీద దాడిజరగడం ఎన్నడూ లేదు. అంగళ్ళు ఘటనలో చంద్రబాబు ప్రమేయం లేకపోయినా పాలకులు కేసు పెట్టారు. ఇప్పుడు ఓ దుర్మార్గమైన దాడి తన సమక్షంలోనే చోటుచేసుకుంటే సీఎం మాట్లాడటం లేదు, పాలకపక్షం ఖండించడం లేదు, బాధితుడు ఫిర్యాదు చేస్తేనే కేసు పెడతామని పోలీసులు సైతం అంటున్నారు. తన మనోభిప్రాయానికి అనుగుణంగా కార్యకర్తలు వ్యవహరించినందుకు సీఎం సంతోషిస్తున్నట్టు ఉంది. ఇదేమీ ముఖ్యమంత్రి కుటుంబ కార్యక్రమం కాదు. ఒక బహిరంగ సభలో మీడియా ప్రతినిధి ఫోటోలు తీయడం ఎలా తప్పవుతుందో పాలకులే చెప్పాలి. పార్టీ కార్యకర్తలు బరితెగించి ఒక జర్నలిస్టుమీద చేసిన ఈ దాడి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారపక్షం మరింత దుర్మార్గంగా వ్యవహరించబోతున్నదనడానికి సూచన. తమకు నచ్చనిదానిని రాసినా, చిత్రీకరించినా తీవ్ర శిక్షతప్పదన్న హెచ్చరిక, పాత్రికేయులను తమకు వ్యతిరేకంగా నోరువిప్పకుండా చేసే లక్ష్యం ఇందులో ఉంది. మీడియా మీదకు కార్యకర్తలను ఉసిగొల్పుతున్న సీఎం మీద రాజ్యాంగ సంస్థలు చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానాలు సుమోటోగా విచారణ చేపట్టాలి. ప్రజాస్వామ్యం మీద, భావస్వేచ్ఛమీద, సమాచారాన్ని తెలుసుకొనే ప్రజల మౌలిక హక్కుమీద జరిగిన దాడి ఇది.

శతాధిక కోట్ల స్వప్నాల సాధకుడు

నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యలను పట్టించుకుంటూ, ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, దేశ సంక్షేమం గురించి మాత్రమే ఆలోచించే ఒక రాజకీయ పార్టీని ప్రజలు వ్యతిరేకించే అవకాశాలు ఎంత మాత్రమూ లేవు. అధికారంలో ఉన్న పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత ఉండడం సహజమని, అందువల్ల ఆ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం కష్టమని చాలామంది మేధావులు భావిస్తుంటారు. అయితే, బీజేపీ విషయంలో మాత్రం ప్రజా వ్యతిరేకత అనేది ఉండదని చాలా సందర్భాల్లో రుజువైంది. గత పదేళ్లలో బీజేపీ విషయంలో ప్రజా వ్యతిరేకత బదులు ప్రజా అనుకూలత అనే పదం ఎక్కువగా వినపడుతోంది. ఇందుకు ప్రధాన కారణం బీజేపీకి నాయకత్వం వహిస్తున్న నరేంద్ర మోదీ అనడంలో సందేహం లేదు. బీజేపీ పాలించిన మెజారిటీ రాష్ట్రాల్లో ఆ పార్టీని ప్రజలు మళ్లీ మళ్లీ ఎన్నుకుంటే కాంగ్రెస్ తదితర పార్టీలు పాలించిన రాష్ట్రాల్లో ప్రజలు విసిగిపోయి గద్దె దింపుతున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలున్నాయి. నరేంద్రమోదీ దాదాపు 23 సంవత్సరాలుగా అధికార పీఠానికి సారథ్యం వహిస్తున్నారు. తొలుత 13 సంవత్సరాల పాటు ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రధాన మంత్రి పదవిలో ఉన్నారు. మోదీ చేసిన మంచి పనుల మూలంగానే గుజరాత్‌లోనూ, కేంద్రంలోనూ భారతీయ జనతా పార్టీయే అధికారంలో కొనసాగుతున్నది. పార్లమెంట్ ఎన్నికల్లోనే కాదు. అసెంబ్లీ ఎన్నికల్లో, స్థానిక ఎన్నికల్లో కూడా బీజేపీ గతంలో కంటే ఎక్కువగా ప్రజా బలం సంపాదించుకోవడానికి కారణం మోదీ కలిగించిన విశ్వాసమే అని ఎవరైనా చెప్పగలరు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, ఛత్తీస్‌గఢ్, బిహార్, అస్సాం, త్రిపుర, మహారాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో ప్రజలు మోదీ పట్ల విశ్వాసాన్ని ప్రకటించి ప్రజాసేవ చేసే అవకాశాన్ని బీజేపీకి కల్పించారు. గుజరాత్‌లో అయితే ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మొత్తం సీట్లలో పది శాతం కూడా రాలేదు. ఇప్పటి వరకూ అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా తన పనితీరుతో బీజేపీ అందరినీ ఆశ్చర్యపరిచింది. పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో బీజేపీ సంఖ్యాబలం 3 సీట్ల నుంచి 77 సీట్లకు పెరిగి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రభవించింది. తెలంగాణలో బీజేపీ గతంలో ఒక సీటు గెలిస్తే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకుంది. పుదుచ్చేరిలో కూడా బీజేపీ సర్కార్ ఏర్పడింది. తమిళనాడు, కేరళ స్థానిక ఎన్నికల్లో కూడా బీజేపీ ఓటుశాతం పెరిగింది.



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

ఇందుకు కారణమేమిటి? విధానాలు సరైనవైతే, నాయకత్వం సమర్థమైనదైతే, ప్రజలకోసం నిజాయితీగా పనిచేయాలనే ఉద్దేశం ఉంటే, ప్రజా వ్యతిరేకత అనేది అర్థరహితమని బీజేపీ పదే పదే రుజువు చేస్తోంది. మోదీ నాయకత్వంలో భారత దేశం బలమైన, సమర్థమైన దేశంగా మారిందనడంలో సందేహం లేదు. 2047 కల్లా బీజేపీ నాయకత్వంలో దేశం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) అవతరించడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు. మోదీ నాయకత్వంలో భారత ప్రజలు బానిస భావజాలం నుంచి, వలస వాద సంస్కృతి నుంచి బయటపడ్డారు. మన సార్వభౌమికత్వం, సమగ్రత, సాంస్కృతిక వారసత్వం పట్ల ప్రజల విశ్వాసం పెరిగింది.. గత పదేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరిగాయో వారికి తెలుసు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, త్రిపుల్ తలాఖ్ రద్దు, జీఎస్టీ, పౌరసత్వ సవరణ చట్టం అమలు, కొత్త పార్లమెంట్ ప్రారంభం, భారతీయ న్యాయసంహిత ద్వారా మొత్తం నేరసంహితను మార్చివేయడం వంటి లెక్కలేనన్ని విజయాలు మోదీ హయాంలో సాధించిన విషయం ప్రజల అనుభవంలో ఉన్నది.



భారత ప్రజల స్వప్నాలను సాకారం చేయగల ఏకైక నేత నరేంద్రమోదీ ఒక్కరే అనడంలో సందేహం లేదు. ఆయనకు సాటి రాగల ప్రతిపక్ష నేత ఒక్కరూ దరిదాపుల్లో కనపడడం లేదు. ఇండియా కూటమి నేతలు కకావికలమవుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్రలను ప్రజలు విస్మరిస్తున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మూడోసారి 370 సీట్లకు పైగా గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు భారతీయ జనతా పార్టీ సర్వసన్నద్ధమయింది.

మోదీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి విధానాలు, ప్రభుత్వ పథకాల పేరుతో మోదీ ఇచ్చిన గ్యారంటీల ప్రభావం ఎంత బలంగా ఉన్నదో ప్రజలు స్వయంగా గమనిస్తున్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్, బేటీ బచావో -బేటీ పడావో, నమామిగంగే, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక పథకాలు దిగ్విజయంగా సాగుతున్నాయి. ఇవాళ నూటికి నూరు శాతం పారిశుధ్య పథకాలు అమలు అవుతున్నాయి. 11 కోట్లకు పైగా శౌచాలయాలను నిర్మించారు. 13.91 కోట్ల కుటుంబాలకు ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు లభిస్తోంది. 55 కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ కార్డులు పొందారు. 80 కోట్ల మందికి ఆహార ధాన్యాలు సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయంగా కూడా గత పదేళ్లలో భారతదేశ స్థాయి ఏ విధంగా పెరిగిందో కూడా సర్వవిదితమే. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం, ఉగ్రవాదం తోకముడవడం, అత్యంత బలమైన, సురక్షితమైన దేశంగా మారడాన్ని ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి. ఇవాళ మోదీ మాట్లాడితే మొత్తం ప్రపంచం ఆలకిస్తోంది. జీ–20, షాంఘై కార్పొరేషన్ సమావేశాలకు అగ్రరాజ్యాధినేతలందరూ హాజరై భారత్ రూపొందించిన సంయుక్త ప్రకటనను వివాదరహితంగా ఆమోదించడం మోదీ నాయకత్వ ప్రతిభకు సంకేతం. మోదీ చొరవతో ఆఫ్రికన్ యూనియన్‌ను కూడా జీ–20లో భాగం చేశారు. ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణతో అరెస్టయిన ఇండియన్ నేవీ మాజీ ఉద్యోగులు నిర్దోషులని మోదీ చెప్పడంతో ఆ దేశం వారిని వదిలిపెట్టింది. ఉరికంబం దాకా వచ్చిన వారు మోదీ పుణ్యమా అని జన్మభూమిపై అడుగుపెట్టి ఊపిరి పీల్చుకున్నారు.

సరే, మన ప్రతిపక్షాలు సైన్యం ధైర్యసాహసాలనూ ప్రశ్నించారు! ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడులు జరిపి ధ్వంసం చేసిన ఘనత మన సైన్యానికి దక్కింది. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వన్ ర్యాంక్ – వన్ పింఛన్‌ను అమలు చేసింది కూడా మోదీ ప్రభుత్వమే. మోదీ హయాంలో బలహీన వర్గాలకు, దళితులకు, ఆదివాసీలకు, మహిళలకు జరిగిన సామాజిక న్యాయం విస్తృతమైనది. మోదీ సర్కార్ అధికారంలోకి రాగానే ఓబీసీ కమిషన్కు రాజ్యాంగ హోదా కల్పించారు. ముస్లిం మహిళలను త్రిపుల్ తలాఖ్ కోరలనుంచి తప్పించారు. భారతీయ సైన్యంలో మహిళలకు శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేశారు. వర్గీకరణ కోసం కమిటీ ఏర్పాటు చేశారు.

దేశ రాజధాని ఢిల్లీలో 17, 18 తేదీల్లో భారత మండపంలో జరిగిన జాతీయ సదస్సులో ఈ విషయాలన్నీ చర్చకు వచ్చాయి. దేశ వ్యాప్తంగా నలుమూలల నుంచి హాజరైన పదివేలమందికి పైగా నేతల్లో తిరుగులేని సమధికోత్సాహం కనపడుతోంది. వికసిత్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్న వేలాది నేతలు దేశంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీని మరోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా బీజేపీ పట్ల ప్రజా వ్యతిరేకత కనపడడం లేదు. మోదీ నాయకత్వంలో 2004 జనవరి 22న అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రారంభం కావడంతో కోట్లాది ప్రజల కలలు నెరవేరడం వల్ల ఇవాళ దేశంలో ఒక పండుగ వాతావరణం కనపడుతోందని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ఈ దేశ ప్రజల కలలు సాకారం చేయగల ఏకైక నేత నరేంద్రమోదీ ఒక్కరే అనడంలో సందేహం లేదు. ఆయనకు దరిదాపుల్లో పేర్కొనదగ్గ ఏ ఒక్క ప్రతిపక్ష నేతా కనపడడం లేదు. ఇండియా కూటమి నేతలు కకావికలమవుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యాత్రలను ప్రజలు విస్మరిస్తున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మూడోసారి 370 సీట్లకు పైగా గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు భారతీయ జనతా పార్టీ ఇప్పటికే సర్వసన్నద్ధమయింది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

అప్పటి హామీల అమలు కోసమే రైతు ఉద్యమం

రైతు ఉద్యమాన్ని అడ్డుకునే పేరుతో మోదీ ప్రభుత్వం నేరుగా కురిపిస్తున్న పెల్లెట్లతో, దేశ ప్రజల కడుపు నింపడానికి శ్రమిస్తున్న భారతదేశ రైతులు తీవ్రంగా గాయపడుతున్నారు. విచక్షణారహిత ప్రభుత్వ నిర్బంధంతో, తమ కంటి చూపును కోల్పోతున్నా, దేశ భవిష్యత్తును వెలుతురు వైపు నడిపించడానికి ప్రయత్నిస్తున్నారు. డ్రోన్‌లతో వదులుతున్న బాష్పవాయు గోళాలను ఎదుర్కొంటూ కూడా సంక్షోభంలో ఉన్న గ్రామీణ ప్రజల కన్నీళ్లను తుడవడానికి ఉద్యమిస్తున్నారు.

2020లో కేంద్రం తెచ్చిన కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక మూడు చట్టాలకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు ఢిల్లీని చుట్టుముట్టి, పోరాడి ప్రభుత్వాన్ని వెనక్కు నెట్టి, విజయం సాధించారు. ఇప్పుడు మళ్ళీ పార్లమెంటు ఎన్నికల ముంగిట రోడ్లు ఎక్కారు. కేంద్ర ప్రభుత్వం ఆనాడు హామీ ఇచ్చినట్లుగా రైతులు పండించే పంటలకు ప్రకటించే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఋణ మాఫీ చేసి రైతులను ఋణ విముక్తులను చేయాలనే కీలకమైన డిమాండ్లను రైతులు మళ్ళీ ప్రభుత్వం ముందు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా రైతులపై పెట్టిన అన్ని అక్రమ కేసులను ఎత్తేయాలని, రైతు ఉద్యమంలో అమరులైన 700 మందికి పైగా రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ఆయా కుటుంబాలలో అర్హులైన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, లఖింపూర్ ఖేరీలో నిర్లక్ష్యంగా రైతుల పైకి జీపును నడిపి, అనేక మంది మరణానికి కారణమైన కేంద్ర మంత్రి కొడుకును శిక్షించాలని, విద్యుత్ బిల్లు – 2020ను ఉపసంహరించుకోవాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో రైతులు, కూలీలు, ఆదివాసీ ప్రాంతాల ప్రజలు, పశు పోషకులు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న మిగిలిన ముఖ్యమైన డిమాండ్ల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇంతకాలం వీటిపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా, హామీలను కూడా అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేసింది. కానీ పంజాబ్ కేంద్రంగా మళ్ళీ ఉద్యమాన్ని ప్రారంభించిన రైతులను మాత్రం తాను అధికారంలో ఉన్న హర్యానా రాష్ట్ర బోర్డర్‌లోనే ఆపి, దేశ రాజధానికి రాకుండా అడ్డుకోవడానికి బారికేడ్లు పెడుతున్నది, రోడ్లను తవ్వేస్తున్నది, రోడ్లపై మేకులు నాటుతున్నది, రోడ్లకు అడ్డంగా గోడలు కడుతున్నది. రైతుల ట్రాక్టర్లను శత్రు దేశాల ట్యాంకులుగా ప్రచారం చేస్తున్నది. రైతుల ప్రదర్శనలలో పాల్గొంటే ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుంటామని, భారీ జరిమానాలు విధిస్తామని బెదిరిస్తున్నది. నయా రామావతార్‌గా, 'విశ్వగురు'గా చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సాధారణ రైతులు అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పకుండా తప్పించుకుంటున్నాడు.

దేశంలో రైతు కుటుంబాల వాస్తవిక పరిస్థితిని అర్థం చేసుకున్నప్పుడే రైతుల ఉద్యమం, డిమాండ్లు అర్థమవుతాయి. దేశంలో కోట్లాది వ్యవసాయ కుటుంబాల సభ్యులకు ఇప్పటికీ ఆత్మగౌరవం ఉన్న మనుషులుగా గుర్తింపు లేదు. భారత పౌరులుగా వారికి హక్కులు లేవు. వ్యవసాయ కుటుంబాల కనీస ఆదాయాలకు గ్యారంటీ లేదు. సాగు చేసుకోవడానికి అవసరమైన స్వంత భూమి లేదు. సాగును జీవనోపాధిగా ఎంచుకున్న కౌలు రైతులకు ఏ రాష్ట్రంలోనూ సరైన గుర్తింపు లేదు. ప్రతి సంవత్సరం వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్నాయి. కోట్లాది మంది రైతులకు వడ్డీలేని పంట రుణాలు, పెట్టుబడి రుణాలు అందడం లేదు. పంటల బీమా పథకాలు అమలుకావడం లేదు. పంట నష్ట పరిహారం అందడం లేదు. రైతులు పండించిన పంటలకు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులకు న్యాయమైన ధరలు దక్కడం లేదు.



2014లో మోదీ ప్రధాన మంత్రి అయ్యాక తన 2012 సిఫారసుకు, 2014లో బీజేపీ ఇచ్చిన హామీకి భిన్నంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయలేమని, ఆ సిఫారసు అమలు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు మళ్ళీ మొదలైన ఈ రైతు ఉద్యమాన్ని బలపరచడం, మద్దతునీయడం, భాగస్వాములు కావడం మనందరి బాధ్యత.

2006లో డాక్టర్ స్వామినాథన్ నేతృత్వంలోని వ్యవసాయ రంగ జాతీయ కమిషన్ అన్ని సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, పరిష్కారానికి అనేక సూచనలు చేసింది. కనీస మద్దతు ధరలకు సంబంధించి, సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు 50శాతం కలిపి (C2 + 50 శాతం) కనీస మద్దతు ధరను నిర్ణయించాలనేది ఈ కమిషన్ సిఫారసులలో ముఖ్యమైనది. నిజానికి ఆయన చేసిన సిఫారసులను పూర్తిగా అమలు చేస్తే మాత్రమే వ్యవసాయ కుటుంబాల సంక్షోభానికి సంపూర్ణ పరిష్కారాలు దొరుకుతాయి.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేయలేదని, 2014 ఎన్నికల సందర్భంగా వందకు పైగా సభల్లో విమర్శించి, స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కూడా గత పదేళ్లుగా ఈ సిఫారసును అమలు చేయలేదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2012లోనే ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన ఒక కమిటీ ఛైర్మన్‌గా ఉన్న మోదీ, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని తన కమిటీ తరపున స్పష్టంగా సిఫారసు చేశారు. కానీ 2014లో ప్రధానమంత్రి అయ్యాక తన 2012 సిఫారసుకు, 2014లో బీజేపీ ఇచ్చిన హామీకి భిన్నంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయలేమని, ఆ సిఫారసు అమలు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తుందని కేంద్ర ప్రభుత్వంగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. పైగా స్వామినాథన్ కమిషన్ సిఫారసును వక్రీకరిస్తూ, సమగ్ర ఉత్పత్తి ఖర్చులను (C2) కాకుండా, కేవలం పంట సాగు ఖర్చులకు (A2) కుటుంబ సభ్యుల శ్రమకు కొంత విలువను జోడించి, దానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధరలను (MSP) ప్రకటిస్తున్నది.

నిజానికి వ్యవసాయంలో రైతులు పెట్టే అన్ని పెట్టుబడులనూ పంట ఖర్చుల ధరల నిర్ణాయక కమిషన్ (CACP) పరిగణనలోకి తీసుకోవడం లేదు. ముఖ్యంగా రైతు సాగు భూమికి ఏ విలువా వేయడం లేదు. రైతు పెట్టే ఇతర పెట్టుబడులకు (ట్రాక్టర్ కొనుగోలు, డ్రిప్ లాంటి సూక్ష్మ సాగు నీటి వ్యవస్థ ఏర్పాటు, సాగునీటి కోసం బోర్ వేయడం, బావి తవ్వడం, విద్యుత్ ట్రాన్స్‌ఫాం ఏర్పాటు, పొలంలో షెడ్డు వేయడం, నీటి కోసం దూర ప్రాంతాల నుంచి పైప్‌లైన్ వేసుకోవడం, పంట కోత, ఎండబెట్టడం, గ్రేడింగ్ చేయడం, క్లీనింగ్ చేయడం లాంటి వాటికి) అసలు విలువ ఇవ్వడం లేదు. వ్యవసాయ సీజన్‌లో రైతుకయ్యే రవాణా ఖర్చులను పట్టించుకోవడం లేదు. పంటల బీమా పథకం ప్రీమియం కూడా లెక్కింపులోకి తీసుకోవడం లేదు. కూలీలను దూరం నుంచి రప్పించుకుని పని చేయించుకోవడం కోసం పెట్టే రవాణా, భోజనం, మద్యం సరఫరా లాంటి వాటికి అయ్యే అదనపు ఖర్చులను కూడా ఉత్పత్తి ఖర్చులలో పరిగణనలోకి తీసుకోవడం లేదు.

దేశంలో కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం సహా 100కు పైగా పంటలు, ఇతర గ్రామీణ ఉత్పత్తులు వస్తుంటే, ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి కేవలం 23 పంటలకు మాత్రమే కేంద్రం కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నది. పత్తికి కూడా కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI), ప్రస్తుతం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరలు పలుకుతున్నాయనే పేరున, పత్తిని గత మూడేళ్లుగా సేకరించడం మానేసింది.

కేంద్రం ప్రకటించే ఈ ధరలకు ఇప్పటి వరకూ ఎటువంటి చట్టబద్ధత లేదు. అవి కేవలం సలహా ధరలుగా మాత్రమే ఉంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి నేరుగా, పంటలను కొనుగోలు చేసే సమయంలో మాత్రమే ఈ ధరలు రైతులకు అందుతున్నాయి. పంట నాణ్యత లేదనే పేరుతో, తేమ ఎక్కువ ఉందనే పేరుతో, ప్రభుత్వ రంగ కొనుగోలు సంస్థలు కూడా ధరలో కోతలు పెడుతూనే ఉన్నాయి.

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత లేకపోవడం వల్ల, దళారీ వ్యాపారులు, కంపెనీలు రైతులకు వాటిని చెల్లించకపోయినా వారిపై ఎటువంటి చర్యలను ప్రభుత్వాలు తీసుకోలేవు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులలో కానీ, ఈ–నామ్ లాంటి ఆన్‌లైన్ పోర్టల్‌పై కానీ రైతులకు కనీస మద్దతు ధరలు తప్పకుండా చెల్లించాలనే నియమం ఏమీ లేదు. దేశవ్యాప్తంగా అన్ని చోట్లా వ్యాపారులు, కంపెనీలు కుమ్మక్కై కార్టెల్‌గా ఏర్పడి, పంటలకు అతి తక్కువ ధరలనే చెల్లిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో నిజమైన రైతుల సమస్యలను, డిమాండ్లను మళ్ళీ మరోసారి ముందుకు తేవడం ద్వారా ప్రజలను సమీకరించి, తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఈ ఎన్నికల సమయం సరైందని భావించిన కొన్ని రైతు, కూలీ సంఘాలు ఉమ్మడిగా ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపు ఇచ్చాయి. ఫలితంగా గత వారం రోజులుగా రైతుల ఎజెండా అనివార్యంగా ప్రజలలో చర్చకు వచ్చింది.

మన దేశంలో జాతీయ నమూనా సర్వే సంస్థ (NSSO) నివేదిక 2019 ప్రకారం వ్యవసాయ కుటుంబాల సగటు నెలసరి ఆదాయం కేవలం రూ.10,218 మాత్రమే. ఈ నివేదిక ప్రకారం దేశంలో 50శాతం రైతు కుటుంబాలు అప్పులో కూరుకుపోయి ఉన్నాయి.


రైతులు కొనసాగిస్తున్నది న్యాయమైన ఉద్యమం. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు మళ్ళీ మొదలైన ఉద్యమం. ఈ ఉద్యమాన్ని బలపరచడం, మద్దతునీయడం, భాగస్వాములు కావడం మనందరి బాధ్యత.

• కన్నెగంటి రవి
రైతు స్వరాజ్య వేదిక

గ్రంథాలయ డిజిటలీకరణ వైతాళికుడు

'విజ్ఞాన సమాజ నిర్మాణానికి కావలసింది సమాచారం అందరికీ అందుబాటులోకి రావడం' అన్నది ప్రొఫెసర్ ఇనుకొండ రామారెడ్డి లక్ష్యం. 'విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల్లో ఉన్న జ్ఞానసంపద డిజిటల్ గ్రంథాలయాల ద్వారా ప్రజలకు చేరాలి' అన్నది ఆయన ధ్యేయం. జనవరి 30న మరణించిన రామారెడ్డి భారత విశ్వవిద్యాలయాల గ్రంథాలయాలలో మొట్టమొదటిసారిగా ఆటోమేషన్, డిజిటలీకరణలకు శ్రీకారం చుట్టారు.

ప్రొఫెసర్ ఇనుకొండ రామారెడ్డి 1943 మే 5న కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1966లో ప్రారంభించిన గ్రంథాలయ శాస్త్ర డిప్లొమా కోర్సు మొదటి బ్యాచ్‌లో చేరిన నలుగురు విద్యార్థుల్లో రామారెడ్డి ఒకరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ పట్టా పొందిన తరువాత ధార్వాడ్‌లోని కర్నాటక విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎల్.ఎస్సీ, పిహెచ్.డి పూర్తి చేశారు. గ్రంథాలయ శాస్త్ర నిపుణుడిగా రామారెడ్డి వృత్తి ప్రస్థానం 1966లో ప్రారంభమైంది. 1966 జనవరి నుంచి 1970 దాకా ఉస్మానియా మెడికల్ కళాశాలలో గ్రంథ పాలకుడిగా పని చేశారు. 1970–1978 మధ్య కాలంలో తొమ్మిదేళ్లపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. 1978 జనవరి మాసంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ సర్వీస్‌లో చేరిన ప్రొఫెసర్ రామారెడ్డి అధికారికంగా 2005లో పదవీ విరమణ పొందారు. అయితే అప్పటి ఉపకులపతి ప్రొఫెసర్ హరినారాయణ కోరిక మేరకు 2006 జనవరి 7వ తేదీ వరకు విధి నిర్వహణలో కొనసాగారు.



భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని గ్రంథాలయాల ఆటోమేషన్, డిజిటలీకరణలకు అంకితమై నిర్విరామ కృషిచేశారు రామారెడ్డి. గ్రంథాలయాల విధులు, సేవల పట్ల ఉన్న దృష్టి కోణాన్ని ఆయన పూర్తిగా మార్చివేశారు. అంతర్జాలానంతర యుగంలో గ్రంథాలయ పాలకుల మారిన పాత్రను గుర్తించడంలో, నిర్వచించడంలో, పరిచయం చేయడంలో వైతాళిక పాత్రను నిర్వహించారు.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయంలోని కార్యకలాపాలన్నింటిని అక్కడ అందుబాటులో ఉన్న సిబ్బంది సమన్వయంతో 1995 నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేయించారు. 1989లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మొదటి కంప్యూటర్‌ను రామారెడ్డి కొన్నారు. అక్కడి కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ప్రొఫెసర్ నాగరాజారావు రూపొందించిన ప్రోగ్రాం ఆధారంగా గ్రంథాలయాన్ని ఆటోమేషన్ చేయించడం మొదలుపెట్టారు.

1995 సంవత్సరాంతానికి LIBSYS సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి 1.5 లక్షల పుస్తకాల డాటాబేస్‌ను సిద్ధం చేశారు. 1996 నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయంలోని గ్రంథాలన్నీ పూర్తిగా ఆటోమేటెడ్ అయి, ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. OCLC, USA వారి జనరల్ కౌన్సిల్‌కి భారతదేశ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికైన మొట్టమొదటి సభ్యుడు రామారెడ్డి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హిందీ, తెలుగు మరియు ఉర్దూ ప్రచురణలను Worldcatలో MARC21 ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేశారు. ఒక్కొక్క అప్‌లోడెడ్ రికార్డుకి మూడు డాలర్ల చొప్పున వసూలు చేయడం ద్వారా విశ్వవిద్యాలయానికి ఆర్థిక పరిపుష్టిని కల్పించారు. బయటివారి నిధులతో ఒక నమూనా డిజిటల్ గ్రంథాలయాన్ని వృద్ధి చేశారు.

గ్రంథాలయాల సిబ్బందికి ఆటోమేషన్ మరియు నెట్‌వర్కింగ్‌లో శిక్షణ అవసరాన్ని గుర్తించిన రామారెడ్డి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అధికారులను ఒప్పించి 1998 నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్స్ ఇన్ లైబ్రరీ ఆటోమేషన్, నెట్‌వర్కింగ్ ఏడాది కోర్సును ప్రారంభింపజేశారు. గ్రంథాలయ సిబ్బందితో ప్రతి నెలా సమావేశాలు నిర్వహించడం, మధ్యస్థాయి సిబ్బందితో కార్యాచరణపై చర్చించడం, కిందిస్థాయి ఉద్యోగులను ప్రేరేపించడం, పని వికేంద్రీకరణ రామారెడ్డి విజయ రహస్యాలు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆటోమేటెడ్, డిజిటల్ గ్రంథాలయంలో 28 ఏళ్ళ సుదీర్ఘ కాలంపాటు బాధ్యతలు నిర్వహించిన రామారెడ్డి 2007 ఏప్రిల్‌లో థాయ్‌లాండ్‌లోని మహాసరఖమ్ విశ్వవిద్యాలయంలోని ఇన్ఫర్మాటిక్స్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా అధ్యాపక బాధ్యతలు చేపట్టారు.

'గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడికి ప్రాయోగిక పరిజ్ఞానం, బోధనాంశంపై సాధికారత, విద్యార్థులు యథార్థాన్ని అవగాహన చేసుకునే విధంగా ఉదహరణలు చెప్పడం, గ్రంథాలయ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అవసరం' అని ప్రొఫెసర్ రామారెడ్డి భావన. 2012 నుంచి టీసీఎస్, ముంబైకి విజిటింగ్ అధ్యాపకుడిగా పనిచేశారు. 2015 నుండి కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయానికి గ్రంథాలయ సలహాదారుడిగా ఉన్నారు.

ముంబైలోని ఎస్ఎన్‌డిటి మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ హిల్ యూనివర్సిటీ, కర్ణాటక విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయాల గ్రంథాలయ శాస్త్ర విభాగాల పాఠ్యప్రణాళికా మండలుల సభ్యుడిగా కొనసాగారు. డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి డిజిటల్ గ్రంథాలయాల పాఠ్యగ్రంథాలకు సంపాదకుడిగా వ్యవహరించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయశాఖ పూర్వవిద్యార్థిగా రామారెడ్డి విశ్వవిద్యాలయం పట్ల, మరీ ముఖ్యంగా గ్రంథాలయశాఖ పట్ల ఎంతో ఆత్మీయంగా ఉండేవారు. మహాసరఖమ్ విశ్వవిద్యాలయం (థాయ్‌లాండ్) ఇన్ఫర్మాటిక్ శాఖతో, ఉస్మానియా గ్రంథాలయ శాఖ (2012–2017 నడుమ) అవగాహనా పత్రాలపై సంతకాలు చేయడంలో ఆయన కీలక భూమిక నిర్వహించారు.

తను సాధిస్తున్న విజయాల వెనుక సతీమణి ఊర్మిళారెడ్డి కృషి ఉందని చెప్పేవారు. ఆమె కూడా గ్రంథాలయ రంగంలో ఉన్నతమైన పదవుల్లో పనిచేస్తూనే కుటుంబ బాధ్యతలన్నీ చూసుకోవడం వలన రామారెడ్డి వృత్తిపరమైన పురోగతి సాధించారు. ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్వఉపకులపతులు ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి, ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా, ప్రొఫెసర్ హరినారాయణల సహకారాన్ని ఆయన గుర్తుచేసుకునేవారు.

భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని గ్రంథాలయాల ఆటోమేషన్, డిజిటలీకరణలకు అంకితమై నిర్విరామ కృషిచేశారు రామారెడ్డి. గ్రంథాలయాల విధులు, సేవల పట్ల ఉన్న దృష్టి కోణాన్ని ఆయన పూర్తిగా మార్చివేశారు. అంతర్జాలానంతర యుగంలో గ్రంథాలయ పాలకుల మారిన పాత్రను గుర్తించడంలో, నిర్వచించడంలో, పరిచయం చేయడంలో వైతాళిక పాత్రను నిర్వహించారు.

■ డా. కందిమళ్ళ భారతి

విశ్వగురు దిగిరాడా ఏమి!



ఇండియా గేట్ ముందు మోహరించిన రైతుల ట్రాక్టర్ల దర్పా
ఢిల్లీ నడిబొడ్డున కిసాన్ గేట్ నిలబెట్టినట్టుగా ఉంది.
నిజమే ఆధ్యాత్మిక రాజధాని సమ్మోహన కోలాహల వేళ
దేశ రాజధానిలో కార్పొరేట్ హాలాహలాన్ని మింగలేమని
కర్ణభీకర సూపర్సోనిక్ ఆయుధ ప్రయోగం మధ్య
రైతన్న రణ నినాదం....
ఇప్పుడు మీడియా మత్తులో తూగుతూ సోయి మరిచిన
జనాన్ని పట్టి లాగి కిసాన్ గేట్లో కూర్చోబెడుతుంది.
రండి! అన్నదాత పరబ్రహ్మ స్వరూపుడు
రాముని మించిన నిర విరామ కృషీవలుడు.
గజేంద్రమోక్షం ఆలకించిన శ్రీమహావిష్ణువు తీరు
అధికార తేరుపై సేద తీరు విశ్వగురు దిగిరాడా ఏమి!
నాగలి పట్టిన రైతు భూమి మీద బలరాముడు కదా!
సీత అంటే భూమాత కదా! ఎందుకు ఇంకా శీతకన్ను?
సీతారామ! బలరామ.. బాల రామా..
నీ నామమేదైతే ఏమి! పొక్కిలైన రైతు గుండెపై వాలు
రెక్కలు తెగిన క్షతగాత్ర జటాయువుకు
లేపనం పూయని అమానవీయం చాలు

– చెరుకు సుధాకర్

నా పేరు రైతు.. నా పైరు కవాతు..!

మహమ్మారి గళానికి అమరిన అరదండమై
ఉరితాడును హత్తుకునే మొండెమై
కాలం కొయ్యకు వేళ్లాడుతూ
చిరుగుతున్న వస్త్రమై
మిన్నంటి రెపరెప లాడుతున్న
వ్యవసాయ కార్మికులం

కళ్లనీ ఒళ్ళనీ భగ భగ మండించే
పంటనై మంటనై మండిన నేను
ఆరుగాలం స్వేదాన్ని ముద్దాడినా
ఆర్చి పేర్చిన పంటకు
గిట్టుబాటు లేక బ్రతుకుల్ని
కాటేసిన దృశ్యం

ఏపుగా పెంచి సున్నితంగా తుంచి
ఎండబెట్టి గల గలా గంపకెత్తి
బస్తాల్లో బానెడు ఆశల్తో కుక్కి
మార్కెట్ యార్డుల్లోకెళ్తే
తల వేళ్లాడదీసిన పంట ధర
నా భరోసాను ముక్కలు చేసింది

నెత్తిన సూరీడు సూదిమొనతో గుచ్చినట్టు
సురుక్కు సురుక్కున పొడుస్తున్నా
నా మదిలో తొలుస్తున్న దొక్కటే
పంటంతా నా చెమట తూకానికైనా అమ్మాలి
చిల్లుపడ్డ కుండలో నీళ్లాగ నట్టే
మా బతుకెప్పుడూ నీరుగారుతూనే వుంది

విపణి శక్తులూ ప్రకృతి విపత్తులూ
మాయదారి కలుపు చట్టాలు
తల తాకట్టు పెట్టుకొమ్మన్నై
అన్నీ మమ్మల్ని అమ్ముడు పొమ్మన్నై
అన్నీ మమ్మల్ని అవమానించినై
పంటను మా గుండె మంటనూ
నిలువునా తగలబెట్టుకొమ్మన్నై

వ్యవసాయానికి వెన్నుముకనై
అన్నపూర్ణ దేశంలో రాజునై రారాజునై
అక్షర పుటల్లో వర్ణిలిన నేను
ఇప్పుడు చేతుల్ని నెత్తి మీద
చరుచుకుంటూ ఏకరువు పెడుతున్నా
మిరప పండ్లను కస పిస
రోట్లో నూరిన కారం లెక్క
నిఖార్సుగా భగ భగ మండుతున్నా

కమ్ముకొచ్చిన కసాయి రక్కసిపై
ఉద్యమ మందును పూట పూటకూ
పిచికారీ చేస్తున్నా
బ్రతుకు పంట ఎందుకు
పచ్చగా పండదో వేచి చూస్తున్నా
ఇప్పటివరకూ
బలిపీఠంపై మోకరిల్లిన తల నాదే కావచ్చు
కానీ... ఇప్పుడిక సమస్యలను
ఉరితీసే తలారీని నేనే.!
నా పేరు రైతు.. నా పైరు కవాతు..!

– కటుకోఝ్వల రమేష్
(రైతు ఉద్యమానికి సంఘీభావంగా)





గండాలు తీర్చమ్మా..

- ఘనంగా వీరమ్మ తిరునాళ్ల ప్రారంభం
- మెట్టినిల్లు కదిలిన వీరమ్మ
- ఎదురుగండాలతో ఎదురెళ్లిన భక్తులు
- కిక్కిరిసిన ఉయ్యూరు వీధులు



మెట్టినింటి నుంచి కదిలిన వీరమ్మ

గండ దీపాలతో వీరమ్మను స్వాగతిస్తున్న భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 : ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్ల సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఏటా భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమై 15 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజు సోమవారం అమ్మవారికి గండదీపాలు ఇచ్చేందుకు భక్తులు పోటెత్తారు. ఆచారం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసులు పసుపు కుంకుమ, చీరసారెలు సమర్పించారు. మెట్టినింటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, దీపాలంకరణతో బయల్దేరిన అమ్మవారు వేలాది మంది భక్తుల గండ దీపాలు అందుకున్నారు. తిరుగు గండదీపాలు వెంటరాగా, పురవీధులు అమ్మవారు ఊరేగారు. భక్తులతో పట్టణ రహదారులు కిక్కిరిసిపోయాయి. మంత్రి జోగి రమేశ్ అమ్మవారికి పూజలు చేశారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావుతో కలిసి పల్లకీని ఎత్తుకుని ఊరేగింపుగా బయల్దేరారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ అమ్మవారిని దర్శించారు. ఆలయం లోపల జోగి రమేశ్ ఉన్నారని.. బోడె ప్రసాద్‌ను పోలీసులు కొద్దిసేపు బయటే నిలిపివేశారు.

వీరవిధేయులకూ మొండిచేయేనా





కొడాలి నాని, వల్లభనేని వంశీకి సీట్లు డౌటే..!

గన్నవరం సిటింగ్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, గుడివాడ సిటింగ్ ఎమ్మెల్యే కొడాలి నాని.. సీఎం జగన్‌కు వీరవిధేయత చూపడంలో తిరుగులేనివారు. అంతటి వీరవిధేయులకు వచ్చే ఎన్నికల్లో జగన్ హ్యాండ్ ఇస్తారా..? ఎన్నికల వేళ మారుతున్న రాజకీయాలు ఈ ప్రశ్నకు అవుననే సమాధానాన్నే ఇస్తున్నాయి. వైసీపీ అభ్యర్థి మండల హనుమంతరావు అంటూ సోమవారం గుడివాడలో ఫ్లెక్సీలు ప్రత్యక్షం కాగా, ఇక టీడీపీ నుంచి వైసీపీ తీర్థం పుచ్చుకోనున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు గన్నవరం సీటు ఇస్తారంటూ ప్రచారం జోరందుకోవడంతో కొడాలి నాని, వల్లభనేని వంశీ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

- గుడివాడలో తెరపైకి మండల హనుమంతరావు పేరు
- వైసీపీ అభ్యర్థి అంటూ ఫ్లెక్సీల ఏర్పాటు
- సీఎంను కలిసిన టీడీపీ నేత ముద్దరబోయిన
- గన్నవరం నుంచి బరిలోకి దించే యోచన
- కాపు, బీసీ ఓటుబ్యాంకు కోసం వైసీపీ కీలక మార్పులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో పామర్రు, గుడివాడ, గన్నవరం మినహా మిగిలిన అన్ని సీట్లకు అభ్యర్థులను వైసీపీ ఖరారు చేసింది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము, అవనిగడ్డ నుంచి సింహాద్రి చంద్రశేఖర్ తనయుడు రాంచరణ్, పెనమలూరు నుంచి జోగి రమేశ్ పేర్లను ప్రకటించారు. వీరిలో పేర్ని కిట్టు, సింహాద్రి రాంచరణ్ కాపు సామాజికవర్గానికి చెందినవారు. ఉప్పాల రాము, జోగి రమేశ్ గౌడ సామాజికవర్గానికి చెందినవారు. గుడివాడ, గన్నవరం నుంచి కొడాలి నాని, వల్లభనేని వంశీకి టికెట్లు ఇస్తే కమ్మ సామాజికవర్గానికి రెండు స్థానాలు ఇచ్చినట్లవుతుంది. కానీ, ఈసారి బీసీలకు పెద్దపీట వేస్తామంటున్న వైసీపీ అధిష్ఠానం



వైసీపీ అభ్యర్థి అంటూ గుడివాడలో మండల హనుమంతరావు పేరిట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

వారికి ఎక్కువ సీట్లు కేటాయించే అంశంపై దృష్టిపెట్టింది. కమ్మ సామాజికవర్గానికి ఇచ్చినా వారు ఓట్లు ఎటూ వైసీపీకి పడవన్న ఉద్దేశంతో ఈ రెండు స్థానాల్లో ఒకటి యాదవ సామాజిక వర్గానికి, ఒకటి కాపు సామాజికవర్గానికి కేటాయించే దిశగా ఆలోచన చేస్తోంది. ఇదే జరిగితే ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాన్ని మినహాయిస్తే కృష్ణాజిల్లాలో కాపులకు 3 స్థానాలు, బీసీలకు 3 స్థానాలు ఇచ్చినట్లవుతుంది. వైసీపీపై అసంతృప్తితో ఉన్న కాపులను ఆకర్షించడానికి, జిల్లాలో పవన్ కల్యాణ్ ప్రభావాన్ని తగ్గించడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని వైసీపీ పెద్దలు ఆలోచన చేస్తున్నారు. బీసీలకు మూడు స్థానాలు ఇవ్వడం ద్వారా వారికి పెద్దపీట వేశామని ప్రచారం చేసుకోవచ్చన్న ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉన్నారు.

వంశీ పోటీలో ఉంటారా? నానికి సీటు ఇస్తారా?

వల్లభనేని వంశీకి గన్నవరం టికెట్ ఇవ్వని పక్షంలో ఆయన్ను ఎక్కడి నుంచి బరిలోకి దింపుతారన్న చర్చ వైసీపీ శ్రేణుల్లో జోరుగా సాగుతోంది. ఈనెల 12న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి వంశీ సీఎం జగన్‌ను కలిశారు. వంశీ సీటు విషయంపై చర్చించేందుకే ఈ భేటీ జరిగినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ భేటీలో వంశీని పెనమలూరు నుంచి కానీ, మైలవరం నుంచి కానీ పోటీ చేయించాలని వైసీపీ పెద్దలు నిర్ణయించి సిద్ధమవ్వాల్సిందిగా చెప్పినట్లు సమాచారం. మరి ఈ రెండు స్థానాల్లో ఒక దాని నుంచి వంశీ బరిలో ఉంటారా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఇక కొడాలి నానిని ఎక్కడి నుంచి పోటీ చేయిస్తారన్నది ఉత్కంఠగా ఉంది. గుడివాడ నుంచి కాపులకు అవకాశం ఇచ్చే పక్షంలో నానిని ఈసారికి ఎన్నికలకు దూరం పెడతారా? లేక వేరే స్థానం కేటాయిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

సామాజిక సమీకరణాలపైనే వైసీపీ దృష్టి

గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చడం ద్వారా తాము విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నామని ప్రచారం చేసుకునేందుకు వైసీపీ పెద్దలు సిద్ధమవుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో బీసీల ఓట్లు సుమారు లక్ష ఉంటాయి. వీటిలో యాదవ సామాజికవర్గానికి సుమారు 40 వేల ఓటుబ్యాంకు ఉంటుంది. దీన్ని లక్ష్యంగా చేసుకుని గన్నవరంలో బీసీ కార్డుతో బరిలోకి దిగాలన్నది వైసీపీ ఆలోచన. గుడివాడలో బీసీలకు దీటుగా కాపు ఓటు బ్యాంకు ఉంది. బీసీ ఓటు బ్యాంకు 80 వేలు ఉంటే, కాపులు 40 వేల పైచిలుకు ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ కాపు కార్డు ప్రయోగించాలని భావిస్తోంది. ముద్దరబోయిన 2004లో గన్నవరంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1999, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక గుడివాడలో తెరపైకి వచ్చిన మండల హనుమంతరావు ఆడిటర్‌గా సుపరిచితులు.



ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో నిరసన ర్యాలీ చేపట్టిన జర్నలిస్టులు

భగ్గుమన్న జర్నలిస్టులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడికి నిరసన

- రెండు జిల్లాల్లో భారీ ర్యాలీలు, ఆందోళనలు
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ
- ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం
- కృష్ణా కలెక్టర్‌ను కలిసిన మచిలీపట్నం విలేకరులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అల్లరిమూకలు చేసిన దాడిని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. పాత్రికేయులపై వైసీపీ రౌడీలు సాగిస్తున్న దాడులు, దౌర్జన్యాలను ఆపలేరా.. అంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు భగ్గుమన్నారు. రెండు జిల్లాల్లో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ఐజేయూ, ఫొటో జర్నలిస్టుల సంఘం, విజయవాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ నుంచి అలంకార్ సెంటర్ వరకు, తిరిగి ప్రెస్‌క్లబ్ వరకు ఈ ర్యాలీ సాగింది. సీఎం సభల్లో పాల్గొనే జర్నలిస్టులకే రక్షణ కరువైందన్నారు. గతంలో అనేక మంది జర్నలిస్టులపై దాడులు జరిగినా చర్యలు లేవని, పోలీసులు రౌడీమూకలను అరెస్టు చేయటం లేదని, కేసులు పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు. సీనియర్ పాత్రికేయుడు ఎస్‌కే బాబు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం తెచ్చినట్టుగా జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజు, దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నేతలు విజయభాస్కర్, ఎస్.సాంబశివరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, సామ్నా నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారావు, ఎస్.గంగరాజు, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ వి.మురళి, బ్యూరో ఇన్‌చార్జి పి.మృత్యుంజయకుమార్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ బి.రామారావుతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెచ్చుమీరుతున్నాయని, వారికి రక్షణ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్‌తో ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు, జర్నలిస్టులు భేటీ అయ్యారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ చేసిన తప్పేమీ లేదని, నువ్వు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌వేనా అని ప్రశ్నిస్తూ ఒక్కసారిగా దాడికి తెగబడ్డారని చెప్పారు. ఈ ప్రభుత్వంలో ఇలాంటి దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

కె.కలిమిశ్రీ, ఎంబీ నాథన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పి.రాము, జి.వీర్లంకయ్య, కిరణ్, లక్ష్మణ్, రాజు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, మచిలీపట్నంలోని విలేకరులు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశహాల్లో ఉన్న కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందించారు.

పాపం.. పసికందు

వన్‌టౌన్ కొండప్రాంతంలో చెత్తకుండీలో మగశిశువు



- పుట్టిన గంటల్లోనే విడిచి వెళ్లిన తల్లి
- ఏడుపు వినిపించి అక్కున చేర్చుకున్న స్థానికులు
- పోలీసుల సహకారంతో చైల్డ్ వెల్ఫేర్ చెంతకు..

చిట్టినగర్, ఫిబ్రవరి 19 : పాల పెదవుల ఆర్తి తీరలేదు.. కళ్లు కూడా ఇంకా తెరుచుకోనే లేదు.. పేగు తాడు తడి కూడా ఆరలేదు.. ఈ చిట్టిబాబు అనాథగా చెత్తకుండీలో కనిపించాడు. ఏ తల్లి కన్నబిడ్డో పుట్టుకతోనే తనకంటూ ఎవరూ లేక అల్లాడిపోయాడు. గుక్కపెట్టి ఏడ్చాడు. చెత్తకుండీ దుర్వాసనలో తల్లి చనుబాలు కోసం వెంపర్లాడాడు. కొత్తపేట శ్రీనివాస్ మహల్ కొండప్రాంతంలో సోమవారం జరిగిన ఈ ఘటన అందరికీ కన్నీరు తెప్పించింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ మహల్ వద్ద పడాలవారి వీధి కొండ ప్రాంతంలో చెత్త డబ్బాలో సోమవారం శిశువు ఏడుపు వినిపించింది. దీంతో చుట్టుపక్కల మహిళలు అక్కడికి వెళ్లి చూడగా చెత్త డబ్బాలో అప్పుడే పుట్టిన ఓ మగశిశువు కనిపించింది. వెంటనే స్థానికులు అంగన్వాడీ టీచర్‌తో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై దేవసుధ అక్కడి చేరుకున్నారు. స్థానిక మహిళలు, అంగన్వాడీ టీచర్ సహకారంతో శిశువును బయటకు తీసి వైద్య సేవలు అందించేందుకు సమీపంలోని రాజా సాహెబ్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం శిశువుకు సంబంధించి ఎస్సై చుట్టుపక్కల ఆరా తీశారు. ఎటువంటి సమాచారం లభించలేదు. అంగన్వాడీ టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శిశువును చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు.

పటమట సబ్ రిజిస్ట్రార్‌కు ఊరట

రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదేశాలను సస్పెండ్ చేసిన హైకోర్టు

- వారంలో యథాస్థానంలో పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పటమట సబ్ రిజిస్ట్రార్ చైతన్యకు హైకోర్టులో ఊరట లభించింది. చైతన్యపై రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారులు విధించిన సస్పెన్షన్ ఆర్డర్‌ను హైకోర్టు కొట్టేసింది. వారంలో తిరిగి చైతన్యను యథాస్థానంలో నియమించాలని ఆదేశించింది. రెండేళ్ల కిందట గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సర్‌ప్రైజ్ తనిఖీల్లో భాగంగా ప్రైవేట్ వ్యక్తుల వద్ద డబ్బు ఉన్న విషయాన్ని గుర్తించిన కేసుకు సంబంధించి అప్పట్లో జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న చైతన్యను బాధ్యుడిని చేసిన విషయం తెలిసిందే. దీనిపై సబ్ రిజిస్ట్రార్ చైతన్య హైకోర్టును ఆశ్రయించారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద డబ్బులున్నాయని తనను బాధ్యుడిని చేయటం అన్యాయమని కోర్టుకు నివేదించారు. తన దగ్గర డబ్బు కానీ, డాక్యుమెంట్లు కానీ ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు ఏసీబీకి లభించలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ అధికారులు సర్‌ప్రైజ్ తనిఖీలు చేసిన సందర్భంలో ఎక్కడా ఏ సబ్ రిజిస్ట్రార్‌ను బాధ్యుడిని చేయకుండా, తననే ఈ కేసులో ఇరికించటం వెనుక కుట్ర దాగి ఉందని కోర్టుకు తెలిపారు. నాలుగేళ్ల కిందట జరిగిన ఈ ఘటనలో తనను అన్యాయంగా బలి చేశారని, మూడేళ్లుగా నాన్ ఫోకల్ స్థానంలో పనిచేశానని తెలిపారు. చేయని తప్పునకు తాను నాన్ ఫోకల్ పోస్టు ద్వారా శిక్షను అనుభవించానన్నారు. వీటన్నింటినీ పరిశీలించిన మీదట న్యాయస్థానం.. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్ణయాన్ని తప్పుబడుతూ ఆర్డర్‌ను కొట్టేసింది.

బంగారం కాజేసి అజ్ఞాతంలోకి..

గంగూరు యూబీఐ మేనేజర్‌కు బిగుస్తున్న ఉచ్చు

- ఇంకా పరారీలోనే ప్రభావతి
- గాలిస్తున్న ప్రత్యేక బృందాలు
- సస్పెండ్ చేసిన జోనల్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దావులూరి ప్రభావతి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చని భావించిన ప్రభావతి పరారీలో ఉన్నారు. కవులూరి యోగేశ్వరరావు అనే ఖాతాదారుడు రుణం పూర్తిగా చెల్లించినా ఆయన తాకట్టు పెట్టిన 380 గ్రాముల బంగారం తిరిగి ఇవ్వలేదు. దీనిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

గతంలోనూ ఇంతే..

ప్రభావతి లోగడ చేసిన వ్యవహారాలు ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నాయి. యోగేశ్వరరావు పోలీసులను ఆశ్రయించడానికి ముందు బ్యాంకు జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జోనల్ కార్యాలయం నుంచి మూడు ప్రత్యేక బృందాలు గంగూరులోని బ్రాంచ్‌లో మూడు రోజుల పాటు సోదాలు నిర్వహించాయి. అన్ని ఫైళ్లను పరిశీలించగా, యోగేశ్వరరావు చేసిన ఫిర్యాదులో వాస్తవముందని నిర్ధారించారు. జోనల్ అధికారులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖాతాదారుడికి సంబంధించిన బంగారాన్ని మాయం చేయడంలో ప్రభావతి పాత్ర ఉందని తేలడంతో ఆమెను సస్పెండ్ చేశారు. కాగా, బ్యాంకు సిబ్బంది గానీ, అధికారులు గానీ ప్రభావతికి అనుకూలంగా వ్యవహరించకపోతే వారిపై వేధింపులకు దిగేవారన్న విమర్శలు వస్తున్నాయి. జుజ్జూరులో ఉన్న బ్రాంచ్‌లో కొన్నాళ్ల క్రితం ప్రభావతి క్లర్క్ హోదాలో పనిచేశారు. అప్పటి వరకు పనిచేసిన మేనేజర్ ఆమెకు అనుకూలంగా వ్యవహరించేవారని సమాచారం. తర్వాత ఆయన్ను బదిలీ చేయడంతో కొత్త మేనేజర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభావతి ఆడే ఆటలకు ఆయన చెక్ పెట్టడంతో ఆ బ్రాంచ్ మేనేజర్‌పై తిరుగుబాటు చేశారు. లేనిపోని ఫిర్యాదులు చేసి ఆయనను నానా తంటాలు పెట్టినట్టు యూబీఐ వర్గాలు చెప్పుకొంటున్నాయి.

- మిగతా 6లో

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ ఢిల్లీరావు

- 6లో..

తిరుపతమ్మ భక్తులపై పోలీసు జులుం

- భీమవరం గ్రామంలో ఉద్రిక్తత

- 6లో..



బావిశెట్టి భాను కుమారులకు చదువు నిమిత్తం నగదు అందజేస్తున్న బుద్దా భూలక్ష్మి

భాను కుటుంబానికి అండగా ఉంటా

రూ. 25 లక్షలతో ఇల్లు కొనిస్తా.. దాతృత్వం చాటిన బుద్దా వెంకన్న

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : ఇటీవల హఠాన్మరణం చెందిన తన అనుచరుడు బావిశెట్టి భాను కుటుంబానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న భూరి విరాళాన్ని ప్రకటించారు. గత 30 సంవత్సరాలుగా తన అనుచరుడిగా కుటుంబసభ్యుల్లో ఒకడిగా ఉన్న భాను ఇటీవల ఆకస్మిక మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. అతడి కుటుంబానికి అండగా ఉంటానని, సుమారు రూ.25 లక్షలు వ్యయం చేసే ఇల్లు కొనిస్తానని దాతృత్వాన్ని చాటుకున్నారు. తనతో పాటు ఉండే అనుచరుల విషయంలో ఎప్పుడూ ఇదే తీరున స్పందిస్తానన్నారు. ఇంజనీరింగ్ చదువుతున్న భాను పిల్లలకు మూడో సంవత్సరం ఫీజు, జీవనం కోసం రూ. 4 లక్షల నగదును బుద్దా వెంకన్న సతీమణి భూలక్ష్మి సోమవారం అందజేశారు.

వైసీపీ నుంచి గెలిచేది ఐదుగురే..

నలుగురు పాడె మోసేందుకు, ఒకరు కుండ పట్టేందుకు : నెట్టెం



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురే గెలుస్తారని, నలుగురు వైసీపీ పాడె మోసేందుకు, ఒకరు కుండ పట్టేందుకు అంటూ మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఘాటుగా స్పందించారు. 'ఫ్యాన్‌గాలి ప్రజలను తప్పుడోవ పట్టిస్తాది.. సైకిల్ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటాది.. గ్లాసు చల్లని నీటిని ప్రజలకు అందిస్తు చల్లగా చూసుకుంటాది..' అంటూ నెట్టెం చమత్కరించారు. రాప్తాడు సభలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన సోమవారం తన నివాసంలో ఘాటుగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి మూలన పడేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా అని ఎదురుచూస్తున్నారన్నారు. లిక్కర్, మైన్స్, శ్యాండ్‌తో అందినకాడికి దోచుకుని తాడేపల్లి బొక్కసాన్ని వేలకోట్లతో నింపుకోవటమే పనిగా పెట్టుకుని పేదలు, పెత్తందార్లు అంటూ మాట్లాడటానికి జగన్‌కు సిగ్గులేదా అని నెట్టెం ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నేత ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

విజయవాడ రూరల్ : తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి అనేక మంది ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పి. నైనవరం గ్రామాలకు చెందిన వైసీపీ పార్టీ నేతలు టీడీపీలో చేరారు. అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య, వార్డ్ మెంబరు మద్దపల్లి వసంత్ కుమార్, దొండపాటి హరీష్, నైనవరం గ్రామ నాయకులు ధూళిపాళ దేవేంద్ర, నిమ్మగడ్డ చిన్నా, చాపిరి శ్రీనివాసరావు, పందూరి నూకరాజు, పెయ్యల రవి, సతులూరి సురేష్, కోటేశ్వరరావు, ఆలూరి సతీష్, ధూళిపాళ నాని, చీదీరాల శివలకు యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రూరల్ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, ప్రధాన కార్యదర్శి కోనేరు సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావు, తెలుగు రైతు కార్యదర్శి గరిమెళ్ల నరేంద్ర చౌదరి, తెలుగు యువత అధ్యక్షుడు పరుచూరి నరేష్, అడుసుమిల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తాతయ్య సమక్షంలో 20 కుటుంబాలు చేరిక

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట -షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్డులో నివాసం ఉంటున్న 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సమక్షంలో చేరారు. షేక్ హజరత్, గుదే వెంకటేశ్వర్లు, ఏపూరి శ్రీను, రంగిశెట్టి కృష్ణ, బి. శ్రీరాములునాయక్, గింజుపల్లి మణికంఠ, షేక్ నాగుల్‌మీరా, కందుకూరి వెంకటేశ్వరరావు, కాశీమళ్ల ప్రసాద్, వనమా షారోన్ తదితరు లు రాష్ట్రంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం అరాచకంగా ఉందని, తాతయ్య నాయకత్వం, చంద్రబాబు సీఎం కావాలనే టీడీపీలో చేరినట్టు చెప్పారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచి వేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో, ఎవరిపాలనలో విధ్వంసం జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనంతపురం సభలో బూటకపు ప్రసంగాలు చేశారని, తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరి పాలన స్వర్ణయుగమో.. ఎవరి పాలన రాతియుగమో తేల్చేద్దామన్నారు. ఓటమి భయంతో ఎమ్మెల్యేల స్థానాలను మారుస్తున్నారన్నారు. ఐదేళ్ల విధ్వంసపాలనలో అధికార దుర్వినియోగంతో ప్రజలను మోసం చేశారన్నారు. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లో ఆర్టీసీ బస్సులతో పాటు స్కూలు బస్సులు కూడా బలవంతంగా తీసుకెళ్లి జనాలను తరలించారన్నారు.

పాడిరైతుల సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యం

కృష్ణామిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



చిట్టినగర్, ఫిబ్రవరి 19 : పాడి రైతుల సంక్షేమం, ఆరోగ్యానికి కృష్ణామిల్క్ యూనియన్ ప్రాధాన్యతనిస్తుందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. అమెరికన్ గ్యాస్ట్రో కేర్ ఆసుపత్రి సహకారంతో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రిలో పాడి రైతులకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లివర్ సంబంధిత వ్యాధుల గురించి తెలుసుకునేందుకు అత్యాధునిక ఫైబ్రో స్కాన్‌ను రైతులకు ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చిన ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అట్లూరి శ్రీదేవికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పాడిరైతుల కుటుంబాలలో మహిళలకు కూడా ఉచితంగా స్కానింగ్ చేసేందుకు ఆమె సమ్మతించారన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పాడి రైతులు, యూనియన్ అధికారులు పాల్గొన్నారు.

బంగారం కాజేసి అజ్ఞాతంలోకి..

(5వ పేజీ తరువాయి)

అసలేం జరిగింది?

నూజివీడు మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన కపులూరి యోగేశ్వరరావుతో ప్రభావతికి పరిచయం ఉంది. ఖాతాలు తెరవడంలో బ్రాంచ్ మేనేజర్లకు ప్రతినెలా టార్గెట్లు విధిస్తారు. దీనిని పూర్తి చేసుకునే క్రమంలో బ్యాంకులో ఖాతా తెరవమని కోరారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన ఖాతాను యోగేశ్వరరావు గంగూరు శాఖకు బదిలీ చేయించుకున్నారు. ఆయన వద్ద ఉన్న 380 గ్రాముల బంగారాన్ని భద్రపరుచుకోవడానికి లాకర్ కావాలని అడిగారు. దానికి ఆమె ఒక కథ అల్లారు. లాకరులో బంగారం దాచుకోవడం కంటే దానిపై రుణం తీసుకోవచ్చు కదా.. అని సలహా ఇచ్చారు. దీంతో ఆయన బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకున్నారు. గడిచిన ఏడాది నవంబరులో రుణం చెల్లించినా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను ఆయనకు ఇవ్వలేదు. దీనిపై పలుమార్లు ఆయన ప్రభావతిని అడిగినా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫొటో జర్నలిస్టుపై దాడి

అమానుషం



ప్రభుత్వ తీరును ఖండించిన పలు పార్టీల నేతలు

'రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా.. వైసీపీ రౌడీ మూకల దాడిపై పోలీసులు తక్షణం స్పందించాలి. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టుల పైనా దాడులు పెరిగాయి. రాప్తాడు ఘటనపై డీజీపీ తక్షణం స్పందించి నిందితుల అరెస్టుకు చర్యలు తీసుకోవాలి..' అంటూ పలు పార్టీల ప్రతినిధులు, ప్రముఖులు స్పందించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిని వారు తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

- కొనకళ్ల నారాయణ (మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు)



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సభా కార్యక్రమాల కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి ప్రజాస్వామ్యానికే పెనుముప్పు. పత్రికా రంగంలో పనిచేస్తున్న ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లపై అధికారం ఉంది కదా అని వైసీపీ నాయకులు ఇలా దాడులు జరిపించడం సిగ్గుచేటు.

సూర్య కాంతిని అరచేతితో ఆపలేరు

- కొల్లు రవీంద్ర (మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు)



నిజాలు నిర్భయంగా రాస్తున్న ఆంధ్రజ్యోతి విలేఖరులు, ఫొటోగ్రాఫర్లపై వైసీపీ గూండాలు దాడులు జరపడం సిగ్గుచేటు. పాత్రికేయులపై దాడులు జరిపితే తగిన చర్యలు తీసుకోవచ్చని ఇటీవల సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ సభకు జనాలు రాలేదని చిత్రీకరిస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడులు జరపడం అమానుష చర్య. ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. దాడులకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

మీడియాపై దాడి హేయమైన చర్య

- దేవినేని ఉమా (మాజీమంత్రి)



ఇబ్రహీంపట్నం : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి హేయమైన చర్య. దుర్మార్గుడు, ఫ్యాక్షన్ మనస్తత్వం ఉన్న వ్యక్తికి అధికారం ఇస్తే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడు. జర్నలిస్టులపై గుండాలు దాడి చేస్తున్నాంటే ఒకప్పటి బీహార్ గురించి ఇప్పుడు ఏపీ గురించి జనం చెప్పుకుంటున్నారు. విలేకర్లపై దాడి చేసే హీనస్థితికి జగన్మోహన్ రెడ్డి దిగజారిపోయాడు. బాధిత కుటుంబాలు స్టార్ క్యాంపెనర్లుగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ రెడ్డిని బంగాళాఖాతంలో కలిపేందుకు 160 అడుగుల లోతు గొయ్యిలో పాతిపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

వైసీపీ అరాచకానికి పరాకాష్ట

- మండలి బుద్ధప్రసాద్ (మాజీ ఉపసభాపతి)



అవనిగడ్డ : రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో వైసీపీ మూకలు చేసిన దాడి ఆ పార్టీ అరాచకానికి పరాకాష్ట. రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న నైరాశ్యం నుంచి పుట్టిన అసహనంతో వైసీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడి అయినా తమ దారిలోకి తెచ్చుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. నచ్చని వార్తలు ఇస్తున్నారన్న ఆక్రోశంతో దాడులకు పాల్పడటం ప్రభుత్వానికి తగదు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే కఠిన చట్టాలు పెట్టి కేసు నమోదు చేయాలి.

దాడి దుర్మార్గం

- అడ్డాడ ప్రసాద్‌బాబు (సీపీఐ జిల్లా నేత)



చల్లపల్లి : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడటం దుర్మార్గం. వైసీపీ ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయి. నిందితులను కఠినంగా శిక్షించాలి. వైసీపీ అరాచక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

హేయమైన చర్య..

- కొండవీటి సునీత (ఉమ్మడి కృష్ణా జనసేన కార్యదర్శి)



కోడూరు : జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య. రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఫోటో కవరేజ్‌కు వెళ్లిన సీనియర్ జర్నలిస్టుపై దాడి చేయటం దారుణం. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ఆళ్ల గోపాలకృష్ణ (సాగు నీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు)



హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంతో సమానం. వీధి రౌడీల్లా మీడియాపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి.

అరాచక పాలనకు తార్కాణం

- మూల్పూరి సాయికళ్యాణి (తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి)



నిజాల్ని నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై రాప్తాడు సభలో ముఖ్యమంత్రి సమక్షంలో దాడి చేయడం అరాచకపాలనకు నిదర్శనం. జగన్ అధికారంలోకి వచ్చాక మీడియాపై దాడులు పెరిగిపోయాయి. జగన్ సభలకు ఆయన కూలి మీడియా తప్ప మిగిలిన వారు వెళితే నిజాలు బయటపడతాయని భయం. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

ప్రజాస్వామ్యానికే మచ్చ..

- బండి రామకృష్ణ (జనసేన నేత)

మచిలీపట్నం టౌన్ : ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాల్లో ఒకటైన పత్రికారంగం పట్ల గౌరవించేవారెవరు విలేఖరులు, ఫోటోగ్రాఫర్లపై దాడులకు పాల్పడరు. ఫోటోలు తీస్తున్న విలేఖరులపై దాడులు జరపడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయింది. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి సిగ్గుమాలిన చర్య.



వినాశకాలే విపరీత బుద్ధి

- బండ్రెడ్డి రామకృష్ణ (జనసేన నేత)



వైసీపీ నాయకులకు వినాశకాలం వచ్చింది. విపరీత బుద్ధితో రాప్తాడు వద్ద ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి జరిపారు. ఈ దాడికి బాధ్యులైన కార్యకర్తలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి దాడులు పునరావృతమైతే జనసేన పక్షాన ఉద్యమిస్తాం.

ఏనాడూ ఇలాంటి సంఘటనలు చూడలేదు

- బూరగడ్డ వేదవ్యాస్ (మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా.. ఇలా విలేఖరులు, ఫోటోగ్రాఫర్లపై దాడులు ఏనాడూ చూడలేదు. రాజకీయ పార్టీలు ఏవైనా చెప్పవలసి వస్తే ఖండిస్తూ ప్రకటనలు ఇవ్వవచ్చు.. దాడులు జరపడం అమానుషం. ఈ దాడులను ముక్తకంఠంతో ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి. ఈ దాడుల వెనుక ఉన్న వారిని కూడా అరెస్టు చేయాలి. సీఎం జగన్ ఒక మీడియా సంస్థకు అధినేతగా ఉంటూ వైసీపీ కార్యకర్తలు దాడులు జరుపుతుంటే ఏమి మాట్లాడటం లేదు. పాత్రికేయుల సంక్షేమం కోసం పదవుల్లో ఉన్న వారెవరు పెదవి విప్పడం లేదు.

అరాచకాన్ని ప్రోత్సహిస్తున్న సీఎం జగన్

- వీరంకి వెంకట గురుమూర్తి (టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి)



తోట్లవల్లూరు : సిద్ధం అని.. సీఎం జగన్ చొక్కాలు మడతేయండంటూ అరాచకశక్తులను తయారు చేస్తున్నారు. ఆయన పాల్గొన్న సభలోనే ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు అమానుషదాడి చేయటం ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చ. రాష్ట్ర చరిత్రలో ఏ సీఎం ఇలా ప్రవర్తించలేదు. జగన్ పత్రికలో నిత్యం టీడీపీ నేతలపై ఎన్నో అసత్యవార్తలు రాస్తున్నా ఎక్కడైనా టీడీపీ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడలేదు. దాడికి గురైన ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణ బీసీ వర్గానికి చెందిన వాడు.. తక్షణమే సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి.

అరాచకాలు బయటపెడతారనే..

- కాగిత కృష్ణప్రసాద్ (పెడన టీడీపీ ఇన్‌చార్జి)

బంటుమిల్లి : వైసిపి దోపిడీలు, అరచకాలు, బయటపెడతారనే ఉద్దేశంతో ప్రతికా విలేఖరులపై దాడి చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై దాడి చేయడం అవమానకరం. శ్రీకృష్ణ కుటుంబాన్ని ఆదుకుని.. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి దోషులను వెంటనే శిక్షించాలి.

ఆటవిక చర్య..

- కొలికపూడి శ్రీనివాసరావు (అమరావతి ఉద్యమనేత)



విస్సన్నపేట: రప్తాడు సభలో సీఎం జగన్ రెడ్డి మాట్లాడుతుండగా వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అమానుషంగా దాడి చేయడం ఆటవిక చర్య. వైసీపీ ములకు వీధి రౌడీల్లా వ్యవహించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందనేందుకు మీడియాపై దాడే నిదర్శనం.

జగన్‌కు పోయేకాలం దగ్గర పడే..

- నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట : జగన్‌కు పోయేకాలం దగ్గర పడే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై తన రౌడీ మూకలను ఉసిగొల్పి తన అక్కసును వెళ్లగక్కడాని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన తప్పొప్పులను ఎత్తి చూపే పత్రికల అంటే అక్కసు వెళ్లగక్కుతున్నాడని, ఆంధ్రజ్యోతిని అణిచి వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు

పత్రికల నోరు నొక్కితే ప్రజలు నీ పీక నొక్కుతారు : శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట : పత్రికలను, పాత్రికేయులను నిజాలు బయటకు రాకుండాబెదిరించటం, దాడులకు తెగబడితే ప్రజలు జగన్ పీక నొక్కుతారు. గతం నుంచి వేధిస్తు ఇబ్బందులు పెట్టినా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ దమ్ముగా నిలబడి ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది.

జగ్గయ్యపేటరూరల్ : ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి అరెస్టు చేసి కఠిన చర్యలు తీసు కోవాలని రాష్ట్ర పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ నేత ముల్లంగి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

రాప్తాడు ఘటనపై చర్యలు తీసుకోండి

కలెక్టర్ రాజాబాబుకు విలేకరుల వినతి

మచిలీపట్నం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులను శిక్షించాలని కోరుతూ మచిలీపట్నం విలేకరులు సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో కలెక్టర్ పి రాజాబాబుకు వినతిపత్రం అందించారు. పత్రికావిలేకరులు. ఫొటోగ్రాఫర్లపై అధికారపక్ష నాయకులు, కార్యకర్తలు ఇటీవల కాలంలో తరచూ దాడులు చేస్తున్నారని విలేకరులు అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.



భీమవరంలో ఉద్రిక్త పరిస్థితి

తిరుపతమ్మ భక్తులపై పోలీసు జులుం

భీమవరం గ్రామంలో ఉద్రిక్తత

వత్సవాయి, ఫిబ్రవరి 19 : రంగుల మహోత్సవం పూర్తిచేసుకుని జగ్గయ్య పేట నుంచి పెనుగంచిప్రోలు బయల్దేరిన అమ్మవారి మండలంలో భీమవరం గ్రామానికి సోమవారం ఉదయం చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు అనంతరం అంకమ్మ గుడి దగ్గర భక్తులు సందర్శనార్థం కొద్ది సేపు ఉంచారు. ప్రతిసారి 3-4 గంటలు ఉంచి గ్రామస్థులు అంతా దర్శనం, పూజలు అయ్యాక లింగగూడెంకు తీసుకువెళ్లేవారు. ఈ సారి కొద్ది సేపు ఉంచి తీసుకెళ్లేందుకు అధికారులు సిద్ధం కావటంతో గ్రామస్తులు పల్లకీలకు అడ్డం తిరిగారు. ఈ సందర్భంగా పోలీసులు భక్తులపై చేయి చేసుకుని బలవంతంగా లాగి పారేయ్యటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భక్తులపై పోలీసులు దాష్టికాన్ని గ్రామస్తులు తీవ్రంగా నిరసించారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పటంతో అమ్మవారి యాత్ర సాగింది.

కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు రేపు

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు జరుగుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ బీవీఎస్ఆర్ మూర్తి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. స్వయం ఉపాధి ప్రతిపాదికన కు టుంబ ఆధారిత వ్యాపారాల్లో నిమగ్నమైన చేతివృతిదారుల కోసం ఈ అవగాహన సదస్సు జరుగుతోందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో లబ్ధి పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు తెలిపారు.

ప్రణాళికా బద్ధంగా ఎన్నికల నిర్వహణ

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



జాతీయ ఎన్నికల నిర్వహణ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 19 : రానున్న ఎన్నికలు విజయవంతం కావడానికి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సూచించారు. విజయవాడ మేరీస్టెల్లా కాలేజీలో సోమవారం తూర్పు గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జాతీయ స్థాయి మాస్టర్ ట్రెయినర్లు కుముద్‌కుమార్ ఝా, జీఆర్ హరిశిల్పలు, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, ఆర్‌డీవో బీహెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్న సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ఆర్‌వో, పీవోల పాత్ర చాలా ముఖ్యమైనదని చెప్పారు. మాస్టర్ ట్రెయినర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మందికి శిక్షణ ఇచ్చారని, ప్రస్తుతం ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో 124 మంది ఏఆర్‌వోలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై ఆయన పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, నిబద్ధత అవగాహన ముఖ్యమని చెప్పారు. సంబంధిత అంశాలపై ఆయన పలు సూచనలు చేశారు. డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సమన్వయం ముఖ్యమని, ఒత్తిడిని దూరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రెయినర్లను కలెక్టర్ సత్కరించారు.

మార్చి 3న పల్స్ పోలియో విజయవంతం చేయండి

వన్‌టౌన్ : మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేసేందుకు సమన్వయంతో సంబంధిత అధికారులు పనిచేయాలని కలెక్టర్ దిల్లీరావు ఆదేశించారు. సోమవారం వర్చువల్ విధానంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆర్యోగ శాఖాధికారులు, ఐసీడీఎస్ కార్మిక శాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, మెప్మా, ఆర్టీసీ, రైల్వే తదితర విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయిలో పెద్దఎత్తున మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో 2,48,868 మంది ఐదేళ్ల లోపు వయస్సు గల పిల్లలున్నారని చెప్పారు. మొత్తం 1008 బూత్‌లతో పాటు 34 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకొని పోలియో చుక్కలను వేయాలన్నారు. పోలియో చుక్కల కార్యక్రమంపై వివిధ మార్గాల ద్వారా తల్లిదండ్రులకు అవగాహనా కల్పించాలన్నారు. రైల్వే స్టేషన్, బస్సుస్టేషన్ తదితర చోట్ల కూడా పాయింట్లు ఏర్పాటు చేయాలని హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. సుహాసిని, జిల్లా ఇమ్యూనిజైషన్ అధికారిణి డాక్టర్ అమృత, జిల్లా ఎయిడ్స్ లెప్రసీ, టీబీ అధికారిణి డాక్టర్ జే. ఉషారాణి, డీపీఎంవో డాక్టర్ పినవీన్, జిల్లా పాఠశాల విద్యాధికారి యు.వి సుబ్బారావు, స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి జి. ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యులకు బుక్ కీపర్ వేధింపులు!

లంచం ఇస్తేనే లోన్ మంజూరు చేయిస్తానని హుకుం

అవనిగడ్డలో డ్వాక్రా మహిళల ధర్నా



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా గ్రూపు సభ్యులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 19 : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన షాలేమ్ డ్వాక్రా గ్రూపు సభ్యులకు లోన్లు మంజూరు కానివ్వకుండా గ్రూప్‌కి చెందిన బుక్ కీపర్ రత్నకుమారి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని గ్రూపు సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అవనిగడ్డ స్టేట్ బ్యాంక్‌లో షాలేమ్ డ్వాక్రా గ్రూపు గత కొన్నేళ్లుగా లోన్లు తీసుకుంటూ, డబ్బులు కడుతూ వస్తున్నామని, ప్రస్తుతం తమ గ్రూప్‌కి 3 లక్షలు మాత్రమే అప్పు ఉందని, కొత్తగా అప్పు కోసం బ్యాంక్ వారిని సంప్రదిస్తే లోన్ మంజూరు చేయటానికి అంగీకారం తెలిపిన తర్వాత బుక్ కీపర్ రత్నకుమారి తమకు లోను ఇవ్వకుండా అడ్డుపడుతోందని, లంచం ఇస్తేనే తమకు లోన్ మంజూరు చేయనిస్తానని ఖరాకండిగా చెప్పిందని గ్రూపు సభ్యులు ఆరోపించారు. బుక్‌కీపర్‌పై ఫిర్యాదు చేసేందుకు వెలుగు సీసీ, ఏసీల వద్దకు వెళితే సీసీ సువర్ణ స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ చేయిస్తేనే లోను మంజూరు చేస్తామని అన్నారన్నారు. ఏసీ రవికుమార్ మహిళలు అని కూడా చూడకుండా అసభ్యపదజాలం ఉపయోగిస్తూ మాట్లాడుతున్నారన్నారు. తమ గ్రూప్ కంటే ఎక్కువ రుణాలు చెల్లించాల్సిన గ్రూపులకు సైతం డబ్బులు ఇస్తే కొత్త లోన్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే వెలుగు ఏసీ, సీసీ, బుక్ కీపర్‌లను విధుల నుంచి సస్పెండ్ చేసి షాలేమ్ గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. షాలేమ్ గ్రూపు సభ్యులకు స్థానిక తెలుగదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. అయితే దీనిపై వెలుగు సిబ్బంది వాదన వేరుగా ఉంది. షాలేమ్ గ్రూపునకు నాలుగున్నర లక్షలకు పైగా లోన్ అవుట్ స్టాండింగ్ ఉందని, లోన్ అవుట్ స్టాండింగ్ ఉన్న వారికి కొత్త లోను ఇవ్వటం సాధ్యపడదని చెబితే బుక్ కీపర్‌పైన, సిబ్బందిపైన గ్రూపు సభ్యులు దుర్భాలాడుతూ అసత్య ప్రచారానికి దిగారని ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్, సీసీ సువర్ణకుమారిలు తెలిపారు. రాజకీయ కారణాలతోనే తమపై షాలేమ్ గ్రూపు సభ్యులు ఆరోపణలు చేస్తున్నారని, లోన్ మంజూరు కోసం తాము ఎవరి వద్ద లంచం తీసుకోలేదని బుక్ కీపర్ చింతా రత్నకుమారి సోమవారం వెలుగు కార్యాలయంలో వివరణ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	298
చికెన్ స్కిన్‌లెస్	306



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి

టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 19: సిద్ధం పేరిట సభలు నిర్వహించి జగన్‌రెడ్డి అశుద్ధం మాటలేల మాట్లాడుతున్నాడని పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాప్తాడు సభలో చంద్రబాబుపై జగన్‌రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొట్టారు. సిద్ధం వేదిక నుంచి జగన్‌రెడ్డి అశుద్ధం మాటలే చెప్పారని, ఇది చేశాను, ఇది చేశాను అంటున్న జగన్మోహనరెడ్డి దమ్ముంటే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు జగన్‌పాలన, చంద్రబాబు పాలనలో స్వర్ణయుగం ఎవరిదో, రాతి యుగమెవరిదో తేల్చేందుకు వైసీపీ నాయకులు చర్చకు రావాలన్నారు. చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని స్పష్టం చేశారు. జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

వన్ ట్రాఫిక్ ఏసీపీ జనార్ధనరావు

విజయవాడ క్రైమ్, ఫిబ్రవరి 19: రోడ్డు ప్రమాదాలు ఎక్కువశాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని వన్‌ట్రాఫిక్ ఏసీపీ జనార్ధనరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలన పురస్కరించుకుని సోమవారం భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అట్కిన్‌సన్ స్కూల్లో విద్యార్థినీ, విద్యార్థులకు రహదారి భద్రతా నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ జనార్ధనరావు మాట్లాడుతూ హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరిగినట్లుగా ప్రాథమిక దర్యాప్తుల్లో వెల్లడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ప్రయాణాలు చేసే సమయంలో నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని చెప్పారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా నేరమని చెప్పారు. ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ టే కింగ్, పక్కవారితో మాట్లాడుతూ అలసత్వంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. మోటారు వాహన చట్టానికి లోబడి డ్రైవింగ్ చేయాలని చెప్పారు. వన్‌ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఒకటో ట్రాఫిక్ ఏసీపీ జనార్ధనరావు, సీఐ వెంకటేశ్వరరావు

ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం కరువు

బాడీబిల్డర్ శ్రీనివాస్‌కు గద్దె ఆర్థికసాయం అందజేత

పటమట, ఫిబ్రవరి 19 : నిజమైన ప్రతిభ గల క్రీడాకారులకు వైసీపీ ప్రభుత్వం సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాడీ బిల్డర్ కొమ్మా శ్రీనివాస్‌కు రూ.25వేలు గద్దె తన సొంత నిధుల నుంచి అందజేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ రామలింగేశ్వరనగర్‌లో ఉంటున్న కొమ్మా శ్రీనివాస్ 2013, 2015లో జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించాడని, ఈ నెల 23, 24, 25 తేదీల్లో చెన్నైలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు హాజరవటానికి ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. టీడీపీ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలను విరిచేయడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

వైసీపీ నాయకులకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని, ఎవరి పాలన స్వర్ణ యుగమో, ఎవరి పాలన రాతియుగమో తేల్చేద్దామని అన్నారు. వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ జగన్ అధికారం దుర్వినియోగంతో సిద్ధం పేరుతో సభలు నిర్వహిస్తున్నాడని చెప్పారు. సిద్ధం సభను కవర్ చేయడానికి వచ్చిన మీడియా సిబ్బందిపై వైసీపీ శ్రేణులు ఎందుకు దాడి చేశాయని ప్రశ్నించారు. జగన్ పేరు వినగానే ప్రజలకు అధిక ధరలు, పన్నులు, చార్జీల పెంపు, అప్పులు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయని గద్దె విమర్శించారు.



కొమ్మా శ్రీనివాస్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న గద్దె రామ్మోహన్

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

చిట్టినగర్, ఫిబ్రవరి 19: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 19 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ అఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని కోల్డ్ స్టోరేజీలపై చర్యలు తీసుకోండి

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 34వ డివిజన్‌లోని పండ్ల మార్కెట్‌లో లైసెన్స్ లేని కోల్డ్ స్టోరేజీలపై చర్యలు తీసుకోవాలని ఏపీఐడీసీ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన స్పందనలో కమిషనర్‌కు పుణ్యశీల వినతిపత్రం అందజేశారు. ప్రభాస్ కాలేజీ రోడ్డులోకి పండ్ల మార్కెట్‌కు సంబంధించిన భారీ వాహనాల రాకపోకల వలన, డివిజన్‌లోని కేదారేశ్వరపేట అన్ని లైన్లలో అనధికార పార్కింగ్‌ల వలన స్థానికులు, వాహనదారులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పండ్ల మార్కెట్‌లో లైసెన్సులు లేకుండా కోల్డ్ స్టోరేజీలు నడుపుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పుణ్యశీల కమిషనర్‌ను కోరారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారని పుణ్యశీల తెలిపారు.

కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ



పాయకాపురం, ఫిబ్రవరి 19 : అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 1870 మందికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. గత నెల కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాంబే కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించిన సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు జరిగాయి. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఫౌండేషన్ ట్రస్టీ కేశినేని శివనాథ్ కళ్ల జోళ్లు పంపారు. స్థానిక టీడీపీ కార్పొరేటర్ కంచి దుర్గ ఆధ్వర్యంలో కాలనీలో 1870 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నేతలు కంచి ధనశేఖర్, నవనీతం సాంబశివరావు, దాసరి కనకారావు, మైనంపాటి సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

200 మంది టీడీపీలో చేరిక



పాయకాపురం, ఫిబ్రవరి 19 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 61వ డివిజన్‌లో పలు పార్టీలకు చెందిన 200 మంది సోమవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దాసరి కనకారావు, దాసరి ఉదయశ్రీ, పెప్సీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు ఎక్కడకు రమ్మన్నా వస్తా..

వీరంకి వెంకట గురుమూర్తి సవాల్

విద్యాధరపురం, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చించేందుకు పులివెందుల, తాడేపల్లి ప్యాలెస్‌లలో ఎక్కడికి రమ్మన్నా వస్తానని సీఎం జగన్మోహనరెడ్డికి టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి సవాల్ విసిరారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాత్రూంలో గొడ్డలి వేటు, ఎయిర్‌పోర్ట్‌లో కోడికత్తి గీటు తప్ప జగన్‌రెడ్డికి బ్రాండ్‌గా చెప్పుకునేందుకు మరేమీ లేదని ఎద్దేవా చేశారు. రాప్తాడులో జరిగిన సభలో జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల సొమ్ముతో సభలు పెట్టి ప్రతిపక్షాలను తిట్టేందుకు సిగ్గుండాలన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలను జగన్‌రెడ్డి నాశనం చేశారని, చంద్రబాబు పాలనపై నిందలు వేయడమంటే ఆకాశానికి ఉమ్మి వేయడమేనని ఆయన స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్: 33/11 కేవీ పాతపవర్ స్టేషన్‌లోని సబ్ స్టేషన్‌లో 11 కేవీ కేసీ కెనాల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బ్రాహ్మణ వీధి, కన్యకాపరమేశ్వరి అన్నసత్రం, అయ్యప్ప టవర్, జమ్మిదొడ్డి, శేషయ్య వీధి, ఆకుల వారి వీధి, ఆవులవారివీధి, ఉప్పరవాగు, పూజారివారివీధి, నలమంద వీధి, శివాలయం వీధుల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్‌ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



విద్వేషాలు రెచ్చగొట్టే వెలంపల్లిపై చర్యలు తీసుకోవాలి

● **టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నెలిబండ్ల బాలస్వామి**

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 19: పదేపదే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నెల్లిబండ్ల బాలస్వామి పోలీసు కమిషనర్‌ను కోరారు. బాలస్వామి ఆధ్వర్యంలో టీడీపీ లీగల్ సెల్ నేతలు సోమవారం పోలీసు కమిషనర్ రాణా టాటాను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. నియోజవర్గం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి టీ డీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావుపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రచారం నిర్వహించడం తదితర అంశాలపై విచారణ జరిపించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు కమిషనర్‌ను కలిసిన వారిలో లీగల్ సెల్ సభ్యులు పరశురాం సింగ్, కాకు మల్లిఖార్జునరావు, వెంకటేశ్వరరావు, శ్రీధర్, శ్రీనివాస్, శాంతి, శ్రీదేవి, అనిత, సత్యవతి, శోభన్, ప్రసాద్, కిషోర్ తదితరులు ఉన్నారు.



పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ లీగల్ సెల్ నేతలు

అంబేడ్కర్ స్మృతివనం పరిశీలన

లబ్బీపేట, ఫిబ్రవరి 19: అంబేడ్కర్ స్మృతివనాన్ని సందర్శించడానికి వచ్చే సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీతో కలిసి స్మృతివనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మృతివనంలో మిగిలి ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. వారధి వద్ద జరుగుతున్న రిటైనింగ్ వాల్ సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈఈ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్, ఎస్‌ఈ రాంమోహన్, డీఈ పురుషోత్తం, ఏడీహెచ్ పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 19 : భార్య కనిపించడం లేదని ఓ వ్యక్తి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన మహిళ (30) ఈనెల 15న పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికి ఆచూకీ తెలీకపోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



వన్‌టౌన్, ఫిబ్రవరి 19: కేబీఎన్ కళాశాలలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పునః ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులను పూర్ణాహుతితో ముగించారు. 50 అడుగుల ధ్వజస్తంభాన్ని అన్ని జాగ్రత్తలు తీసుకుని ప్రతిష్ఠించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. రుత్విక్కులు శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయకార్యదర్శి జీవీ రామారావు, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి బాబా విజయకుమార్, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ కార్యదర్శి పి. లక్ష్మణ స్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా కాపునాడు సంఘం 22వ డివిజన్ నూతన కార్యవర్గం

కృష్ణలంక, ఫిబ్రవరి 19 : ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 22వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కర్రి సాంబయ్య, జూపూడి శ్రీనివాసరావులను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నియమించారు. 22వ డివిజన్‌లోని మలేరియా ఆస్పత్రి వద్ద సంఘ కార్యాలయంలో నూతన కార్యవర్గసభ్యులను ఆయన నియమించారు. ఉపాధ్యక్షులుగా బాలబొమ్మ రంగారావు, కార్యదర్శులుగా గోపిశెట్టి రాంబాబు, పలిశెట్టి రాజేష్, సమతం రవిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను నియామక పత్రాలను అందచేశారు.

మాతృభాషను ఆదరించాలి

సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి

లబ్బీపేట, ఫిబ్రవరి 19: మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించి ఆదరించాలని సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి. విజయలక్ష్మి అన్నారు. ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ మహిళా కళాశాలలో సోమవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తింపబడిన మధురాతి మధురమైన భాష మన మాతృభాష అని అన్నారు. తెలుగు భాష అచిర కాలంలో అంతరించిపోతున్న భాషగా యునెస్కో పేర్కొందని, ఇది తెలుగు వారందరిని ఎంతో బాధించే అంశమని, మన మాతృ భాష ప్రపంచ వేదికపై అక్షరాల చెరగని భాషగా నిలుపుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్.కల్పన, విద్యార్థినులు పాల్గొన్నారు.

కామదేవరాజ్‌కు సత్కారం

వన్‌టౌన్, ఫిబ్రవరి 19: డబుల్ డాక్టరేట్ పొందిన కామదేవరాజ్ సోమవారం పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాయంలో ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌చార్జి వెంకన్న సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కోసమే పాటు పడే వ్యక్తులలో ఈయన ఒకరని తెలిపారు. 52 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, సాదరబోయిన ఏడుకొండలు, తుపాకుల వెంకటేశ్వరరావు, నందకుమారి, పితాని పద్మ, కర్రి సునీత తదితరులు పాల్గొన్నారు.

బాలికను మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

పాయకాపురం, ఫిబ్రవరి 19 : ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై సోమవారం నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పాయకాపురం ప్రాంతానికి చెందిన బాలిక(15)కు ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతానికి చెందిన యువకుడు(17)తో పరిచయం ఏర్పడింది. యువకుడు బాలికను ప్రేమ పేరుతో పలుమార్లు మోసగించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 19: మద్యం తాగొద్దని భార్య మందలించిందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాణిగారితోట నాంచారయ్యగారి చర్చి వద్ద కే.రాంబాబు (35)దంపతులు ఉంటున్నారు. వారిద్దరు కూలిపనులు చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. తాగుడుకు బానిసైన రాంబాబు ఆదివారం పూటుగా తాగి భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి అతను ఇంటికి రాలేదు. సోమవారం అతని కోసం వెతుకుతుండగా కృష్ణానది ఒడ్డున రిటైనింగ్ వాల్‌కు ఉరివేసుకుని కనిపించాడు.. భార్య స్వరూపిణి ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 19: చికిత్స పొందుతూ సోమవారం యువకుడు మృతి చెందాడు. భవానీపురం అవుట్ ఏజన్సీ ప్రాంతానికి చెందిన కొప్పుల ప్రభు కల్యాణ్ ఎనిమిది నెలల నుంచి ఓ యువతిని ప్రేమించి వివాహం చేసుకోవాలనుకున్నాడు. యువతి తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు. దీంతో ప్రభుకల్యాణ్ ఈ నెల 14న పున్నమిఘాట్ వద్ద గడ్డిమందు తాగి ఇంటికి వచ్చాడు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తల్లి అరుణవాణి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

● **జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్**

వన్‌టౌన్, ఫిబ్రవరి 19: రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. సోమవారం 42 వ డివిజన్‌లో ఇంటింటికీ రాబోయే మన జనసేన - టీడీపీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఫ్యాన్ రెక్కలు విరగగొట్టి చెత్తబుట్టలో వేస్తామని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. తిరుపతి అనూష, సురేష్ తదితరులతో కలిసి ఆయన పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగు దేశం ఖాళీ అవుతుందని, జనసేనకు చిరునామా ఉండదని అంటున్న వారి మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు, వైసీసీలో మేయర్‌ను మార్చేస్తారని, కేశినేని కుమార్తె కోసం ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతున్నదన్నారు.


ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

మంగళవారం • 20 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

ధనుష్ @ 50 రాయన్



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ ధనుష్ నటిస్తున్న 50వ చిత్రానికి 'రాయన్' అనే పేరు నిర్ణయించారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నారు. దర్శకుడిగా ఆయనకు ఇది రెండో సినిమా. యువ కథానాయకుడు సందీప్ కిషన్ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. కాళిదాస్ జయరామ్ కీలక పాత్ర లో నటిస్తున్నారు. ఈ ముగురూ ఉన్న 'రాయన్' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ధనుష్ ఫుడ్ ట్రక్ ముందు నిలబడి ఉంటే, సందీప్ కిషన్ వాహనం లోపల, కాళిదాస్ దానిపైన కనిపించారు. ధనుష్ ఆప్రాన్ మీద రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతోంది. ఎస్ జె సూర్య, సెల్వరాఘవన్, అపర్ణా బాలమురళి, దుషార విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఓం ప్రకాశ్ డీవోపీ. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పీటర్ హెయిన్ వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాదే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ప్రకటించింది.



ప్రముఖ నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ తనయుడు, హీరో ఆశిష్ రెడ్డి, అద్వితా రెడ్డిల వివాహం ఇటీవల జైపూర్‌లోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ వివాహ వేడుకకు బంధువులు, సన్నిహితులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ జంట తమ మొదటి చిత్రాన్ని సోషల్ మీడియా లో షేర్ చేసింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు దిల్ రాజు, శిరీష్. 'రౌడీ బాయ్స్' చిత్రంతో హీరోగా పరిచయమైన ఆశిష్ ప్రస్తుతం సెల్ఫిష్ చిత్రంలో నటిస్తున్నారు.

ఇద్దరు మిత్రుల కథ

ఆశిష్ గాంధీ, అశోక్, వర్ష, ప్రాతిక హీరోహీరోయిన్లుగా రూపుదిద్దుకున్న చిత్రం 'హద్దు లేదురా'. రాజశేఖర్ రావి దర్శకుడు. వీరేశ్ గాజుల నిర్మాత. సోమవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో చిత్రం టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ 'నేను నటించిన 'నాటకం' టీజర్ ఇక్కడే లాంచ్ అయింది. ఆ సినిమా పెద్ద హిట్ అయింది. అలాగే 'హద్దు లేదురా' కూడా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను. సినిమా బాగా వచ్చింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'భారతంలో శ్రీకృష్ణార్జునులు స్నేహంగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించుకున్నారు. అలాగే ఇద్దరు స్నేహితులు కూడా వారికి వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారో అనే కథాంశంతో ఈ సినిమా తీశాం. ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా వచ్చింది. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ వారికి మా సినిమా నచ్చడం ఆనందంగా ఉంది. గీత రచయిత కమల్ కుమార్ అద్భుతమైన ఐదు పాటలు ఇచ్చారు. వారు మనమధ్య లేకపోయినా ఆయన రాసిన పాటలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. త్వరలో పాటలను విడుదల చేస్తాం' అన్నారు. 'స్నేహం నేపథ్యంలో వచ్చిన సినిమాలన్నీ హిట్ అయ్యాయనీ, 'హద్దు లేదురా' కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని మరో హీరో రోహిత్ చెప్పారు.



ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు విశ్వనాథ్ అవార్డ్



మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుకు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు మధ్య ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకం. అక్కినేని నటించిన ఎన్నో చిత్రాలకు విశ్వనాథ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశారు. అంతేకాదు ఏయన్నార్ నటించిన 'ఆత్మగౌరవం' సినిమాతోనే ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. వీరిద్దరి అనుబంధాన్ని స్మరించుకుంటూ అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియాలో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు ప్రతి ఏడాది రెండు నగదు అవార్డులను ఇవ్వాలని విశ్వనాథ్ కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలోని అక్కినేని విగ్రహం దగ్గర నాగార్జున, అమలతో విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర తన భార్య లక్ష్మి, కుమారుడు ప్రణవ్ కలసి సమావేశమై ఈ నిర్ణయం ప్రకటించారు. విశ్వనాథ్ సౌండ్ రికార్డిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, తర్వాత దర్శకుడు అయ్యారు కనుక ఆయన పేరిట సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఇద్దరు విద్యార్థులకు ఇకపై ప్రతి ఏడాది చెరో పాతిక వేల రూపాయలు అవార్డ్ రూపంలో అందజేస్తారు.

జాన్వీతో జంటగా...





ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంట తెలుగు తెరపై ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. చిరంజీవి, శ్రీదేవిలానే రామ్‌చరణ్, జాన్వీకపూర్ కలసి నటిస్తే చూడాలనేది మెగా అభిమానుల కోరిక. గతంలో ఒకట్రెండు సందర్భాల్లో ఈ కాంబినేషన్ సెట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ఇన్నాళ్లకు ఈ క్రేజీ కాంబినేషన్ సెట్టయింది.

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం (ఆర్‌సీ 16-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారు. ఈ విషయాన్ని జాన్వీ తండ్రి బోనీకపూర్ సోమవారం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'త్వరలోనే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాన్వీ పాల్గొంటుంది. రామ్‌చరణ్ లాంటి హీరోతో నటించడం జాన్వీకి మంచి అవకాశం. నా భార్య శ్రీదేవి లానే నా కూతురు కూడా విభిన్న భాషల్లో నటించి పేరు తెచ్చుకోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. అలాగే తమిళ హీరో సూర్యతోనూ జాన్వీ ఓ చిత్రంలో నటిస్తున్నట్లు బోనీకపూర్ చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంతోనే ఆమె హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న గేమ్‌ఛేంజర్ చిత్రం షూటింగ్‌లో రామ్‌చరణ్ పాల్గొంటున్నారు. ఏప్రిల్ నుంచి 'ఆర్ సీ 16' షూటింగ్ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

ఊహించని క్లైమాక్స్‌తో కమర్షియల్ కథ



వినూత్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'ఇంద్రాణి'. యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టీఫెన్‌పల్లం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వెరోనికా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై స్టాన్లీ సుమన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నా సోదరుడు చెప్పిన కథతో ఈ సినిమాను తెరకెక్కించాం. షూటింగ్ పూర్తయ్యాక వీఎఫ్ఎక్స్ కోసమే ఏడాది పాటు కష్టపడ్డాం. ఈ సినిమా క్లైమాక్స్ ఎవరూ ఊహించలేని విధంగా ఉంటుంది' అన్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ ఇదని నిర్మాత చెప్పారు. సినిమా ఓ దృశ్యకావ్యంలా ఉంటుంది, టైమ్ మెషీన్, రోబో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తాయి అని కబీర్ దుహాన్ సింగ్ తెలిపారు. గరీమా కౌశల్, ప్రతాప్ సింగ్, అజయ్, సప్తగిరి ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సాయికార్తీక్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: చరణ్ మాధవనేని.

ఒక పథకం ప్రకారం విడుదలకు సిద్ధం



సాయిరామ్ శంకర్, అసీమా నర్వాల్, శ్రుతీ సోధీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ విజయన్ దర్శకత్వం వహిస్తూ, గార్లపాటి రమేశ్‌తో కలసి నిర్మిస్తున్నారు. సాయిరామ్ శంకర్ పవర్‌ఫుల్ అడ్వకేట్ పాత్ర పోషించారు. సముద్రఖని పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మార్చిలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా వినోద్ విజయన్ మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన థ్రిల్లర్. గోపీసుందర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణ. సిద్ శ్రీరాం పాడిన పాటలకు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది' అన్నారు. భానుశ్రీ, పల్లవి గౌడ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి.



కాలం సూపుల గాలంరా

చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమార స్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'కాలం సూపుల గాలంరా' అంటూ సాగే గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "షరతులు వర్తిస్తాయి' సినిమాను ప్రేక్షకులు ఎలాంటి షరతులు పెట్టకుండా చూసి విజయవంతం చేయాలి' అని కోరారు. ఈ గీతానికి గోరేటి వెంకన్న సాహిత్యాన్ని అందించగా, రామ్ మిర్యాల ఆలపించారు. అరుణ్ చిలువేరు సంగీతం అందించారు. మానవ సంబంధాల్లోని మార్పులను ప్రతిబింబించే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి.

సమాజానికి ఉపయోగపడే 'మైరా'



కన్నడంలో గుర్తింపు పొందిన స్మైల్ శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రం 'మైరా'. చిన్న జీయర్ స్వామిని కలసి చిత్రం స్క్రిప్ట్‌కు పూజ చేయించి వారి ఆశీస్సులు తీసుకున్నారు శ్రీను. ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్రస్తుత సమాజానికి మైరా లాంటి చిత్రాలు ఎంతో అవసరం అని చిన్న జీయర్ స్వామి చెప్పారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ 'తెలుగులో ఈ సినిమా తీసి కన్నడంలోకి డబ్ చేస్తాం. ఓ స్టార్ హీరోయిన్ ఇందులో నటిస్తారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చెప్పారు. స్వామిజీ ఆశీస్సులు లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



మలయాళంలో హిట్.. ఇప్పుడు తెలుగులో

మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'భ్రమయుగం' ఇటీవల మలయాళంలో విడుదలై విజయం సాధించింది. చాలా కాలం తర్వాత పూర్తి బ్లాక్ అండ్ వైట్‌లో తయారైన ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ అధినేత సూర్యదేవర నాగవంశీ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 23న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఉన్న వైవిధ్యమైన కథాంశం, మమ్ముట్టి అద్భుత నటన మలయాళ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. విమర్శకుల ప్రశంసలు పొందాయి. అందుకే అక్కడ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన వచ్చింది. తెలుగు ప్రేక్షకులను కూడా ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత చెబుతున్నారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకుడు.

ఘనంగా బాఫ్టా అవార్డుల వేడుక

ప్రతిష్ఠాత్మక 77వ బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ అవార్డ్స్ (బాఫ్టా) ప్రధానోత్సవం లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్‌లో ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. 'ఓపెన్ హైమర్' చిత్రం మెజారిటీ పురస్కారాలను కొల్లగొట్టింది. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు (సిలియన్ మర్ఫీ), ఉత్తమ చిత్రం సహా మరో ఏడు విభాగాల్లో పురస్కారాలను గెలుచుకుంది. ఆ తర్వాతి స్థానంలో 'పూర్ థింగ్స్' చిత్రం ఐదు బాఫ్టా పురస్కారాలను గెలుపొందింది. ఉత్తమ నటిగా ఎమ్మా స్టోన్ నిలిచారు. బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొనే ఈ కార్యక్రమానికి ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె సహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీపిక చీరకట్టులో కనిపించి వేదికపై సందడి చేశారు. 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' చిత్రం ఉత్తమ ఆంగ్లేతర చిత్రాల కేటగిరీలో విజేతగా నిలవగా, దర్శకుడు జొనాథన్ గ్లేజర్‌కు దీపికా పదుకొనే పురస్కారాన్ని అందజేశారు.





సరికొత్త కథాంశంతో...



విశ్వ కార్తిక్, ఆయూషి పటేల్ జంటగా నటించిన 'కలియుగం పట్టణం' చిత్రం షూటింగ్ పూర్తయింది. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'టాలీవుడ్‌లో ఇలాంటి కాన్సెప్ట్‌తో ఏ సినిమా రాలేదు. సరికొత్త పాయింట్‌తో సందేశాన్ని మిళితం చేసి కుటుంబ సమేతంగా చూసే విధంగా చిత్రాన్ని రూపొందించాం.. గ్యారీ బీ హెచ్ వంటి టాప్ టెక్నీషియన్ మా సినిమాకు ఎడిటర్‌గా పని చేశారు' అని చెప్పారు. కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ 'కడప జిల్లాలో 45 రోజుల పాటు షూటింగ్ జరగడంతో చిత్రం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 22న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సాహిత్యం: చంద్రబోస్, భాస్కరభట్ల, ఫొటోగ్రఫీ: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాడ, నిర్మాతలు: డాక్టర్ కె. చంద్ర ఓబుల్‌రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్.

పదమూడో నంబర్ ఇంట్లో...



'కాలింగ్ బెల్', 'రాక్షసి' వంటి హారర్ థ్రిల్లర్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకొన్న దర్శకుడు పన్నా రాయల్ తాజా చిత్రం 'ఇంటినంబర్ 13'. డిఫరెంట్ మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. నవీన్‌బాబు, శివాంగి మెహ్రా, ఇర్ఫాన్, నికిషా, ఆనందరాజ్, తనికెళ్ల భరణి తదితరులు నటించిన ఈ చిత్రాన్ని హేసన్ పాషా నిర్మించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ వచ్చిన హారర్ సినిమాలకు ఇది పూర్తి విభిన్నం. సినిమాలో ప్రతి పది నిముషాలకూ ఓ ట్విస్ట్ ఉంటుంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉండడంతో హాలీవుడ్ టెక్నీషియన్లతో వర్క్ చేయించాం. సినిమా బాగా వచ్చింది' అన్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చే సినిమా ఇదని నిర్మాత తెలిపారు.

ఇన్‌ఫెర్టిలిటీ





సమయానికి స్టేషన్‌కు వెళ్లకపోతే ట్రైన్‌నే అందుకోలేం!అలాంటిది సమయం దాటిపోయాక పిల్లల్ని కనగలమా? పండంటి పిల్లలను కనాలంటే, అందుకు తగ్గట్టు శరీరాన్ని సన్నద్ధం చేయడంతో పాటు, సరైన వయసులో తల్లి కావాలంటున్నారు వైద్యులు.

పిల్లల ప్లానింగ్ పక్కాగా..

'వాళ్లకు పిల్లలు లేరంట' పూర్వం ఈ మాట ఎంతో అరుదుగా వినేవాళ్లం. అలాంటి జంటలను కాస్త వింతగా, జాలిగా చూసేవాళ్లం. కానీ ఇప్పుడు ఇదంతా సర్వసాధారణమైపోయింది. పిల్లల కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగే వాళ్లు, అన్ని ప్రయత్నాలూ చేసి 'మనకు పిల్లలు పుట్టే యోగం లేదు' అని సర్దుకుపోయేవాళ్లూ, అన్నీ అనుకూలంగా ఉన్నా పిల్లలు పుట్టని వింత పరిస్థితిని ఎదుర్కొంటున్న వాళ్లూ ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇందుకు చాలా కారణాలున్నాయి. పూర్వం, పెళ్లి, తర్వాత పిల్లలు.. ఇదంతా పాతికేళ్లకే పూర్తయిపోయేది. కానీ ఇప్పుడు పిల్లలను కనడం కోసం ప్రణాళికలు వేసుకోవడం పరిపాటిగా మారింది. కెరీర్‌లో ఎదిగిన తర్వాతే పిల్లల్ని కనాలని అనుకోవడం, 'ఇప్పుడు పిల్లలకేం తొందర, ముందు జీవితంలో స్థిరపడడం ముఖ్యం' అనుకోవడం.. ఇలా గర్భధారణను వాయిదా వేయడానికి దంపతులకు ఎన్నో కారణాలు ఉంటున్నాయి. పైగా ఫెర్టిలిటీని పెంచే అత్యాధునిక చికిత్సా విధానాలు కూడా అందుబాటులోకి రావడంతో నచ్చినప్పుడు పిల్లలను కనొచ్చు అనే ధోరణి పెరుగుతోందంటున్నారు డాక్టర్ సీనియర్ కన్సల్టెంట్ ఇన్‌ఫెర్టిలిటీ, డాక్టర్ ప్రీతి రెడ్డి. అయితే నిజంగానే కోరుకున్నప్పుడు పిల్లల్ని కనే వీలుందా? మహిళలకు అంతటి పునరుత్పత్తి సామర్థ్యం ఉంటుందా? అంటే కచ్చితంగా ఉండదనే చెప్పక తప్పదు. ఎందుకో లోతుగా తెలుసుకుందాం!

30 ఏళ్ల లోపే...

మహిళలు పుట్టుకతోనే అండాలను వెంటబెట్టుకొస్తారు. వాటి సంఖ్య అక్కడికే పరిమితం. మహిళ వయసుతో పాటు అండాల వయసు కూడా పెరుగుతూ ఉంటుంది. పాతికేళ్ల వయసు వరకూ మెరుగ్గా ఉండే అండాల నాణ్యత, ముప్పై ఏళ్లు దాటినప్పటి నుంచి తగ్గిపోవడం మొదలవుతుంది. ఈ సమస్యకు తోడు ఇంటి భోజనాల కంటే బయటి ఆహారం తరచూ తింటూ ఉండడం, గంటల తరబడి కదలకుండా కూర్చుని ఉద్యోగాలు చేయడం, నిద్రవేళలు క్రమం తప్పడం, దురలవాట్లు, ఒత్తిడి, వ్యాయామం లోపించడం, అధిక బరువు, బిపిలు, షుగర్లు... ఇవన్నీ అండాల నిల్వ, నాణ్యతలను దెబ్బతీస్తూ ఉంటాయి. కాబట్టి 30 ఏళ్ల తర్వాత పిల్లల్ని కందామనుకునే మహిళలు వాళ్ల అండాలకు కూడా ముప్పై ఏళ్లు దాటాయనే నిజాన్ని అర్థం చేసుకోవాలి. లేటు వయసులో ప్రెగ్నెన్సీ క్లిష్టమవడమే కాకుండా, గర్భస్రావాలకు కూడా ఎక్కువ అవకాశాలుంటాయి. అన్నిటికంటే ముఖ్యంగా పుట్టే పిల్లల్లో జన్యు సమస్యలు కూడా పెరుగుతాయి. మరి వీటన్నిటి నుంచి తప్పించుకుని, పండంటి పిల్లలను కనాలంటే ఏం చేయాలి? ప్రతి మహిళ గర్భధారణకు తన శరీరం ఎంత అనువుగా ఉందో తెలుసుకోవాలి? అలాగే పిల్లల్ని కనడానికి తనకింకా ఎంత సమయం మిగిలి ఉందో అంచనా వేసుకోవాలి. ఇది ఎవరికి వారు కనిపెట్టలేరు కాబట్టి పెళ్లి అయిన వెంటనే దంపతులిద్దరూ ప్రీ కన్‌సెప్షన్ కౌన్సెలింగ్ తీసుకోవాలి.



ప్రీ కన్‌సెప్షన్ కౌన్సెలింగ్

పిల్లలను కనడానికి ఎంత సమయం మిగిలి ఉందో, ఎంత కాలం పాటు పిల్లల ప్లానింగ్‌ను వాయిదా వేసుకోవచ్చో, గర్భం దాల్చడం కోసం ఎలాంటి జీవనశైలిని అనుసరించాలో తెలుసుకోవడం కోసం ఈ కౌన్సెలింగ్ తప్పనిసరిగా తీసుకోవాలి. మరీ ముఖ్యంగా మహిళలు వాళ్ల పునరుత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసుకోడానికీ, గర్భధారణకు అడ్డుపడే వీలున్న అంతర్గత ఆరోగ్య సమస్యలను చక్కదిద్దుకోడానికి కూడా ఈ కౌన్సెలింగ్ తోడ్పడుతుంది. కొందరు పెళ్లి తర్వాత నాలుగైదేళ్లపాటు పిల్లలు వద్దనుకుంటారు. అయితే వాళ్ల అనుకుంటున్నట్టు నాలుగైదేళ్ల తర్వాత పిల్లలను కనే సామర్థ్యం వాళ్లకు ఉందో, లేదో ఎలా తెలుస్తుంది? నాలుగేళ్లు గడిచిన తర్వాత అండాలు తరిగిపోయి, 'అయ్యో పెళ్లైన వెంటనే పిల్లల కోసం ప్లాన్ చేసి ఉంటే బాగుండేది' అని పశ్చాత్తాపపడకుండా ఉండాలంటే, ముందుగానే వైద్యులను కలవాలి. కౌన్సెలింగ్‌లో భాగంగా వైద్యులు, దంపతుల సాధారణ ఆరోగ్యం, పునరుత్పత్తి సామర్థ్యాలను పరీక్షిస్తారు. సాధారణ ఆరోగ్యంలో భాగంగా అప్పటికే ఉన్న రుగ్మతలు (మధుమేహం, థైరాయిడ్, ఆటో ఇమ్యూన్ డిజార్డర్), ఫిట్స్ లాంటి నాడీసంబంధ రుగ్మతల కోసం వాడుకుంటున్న మందుల గురించి వైద్యులను తెలుసుకుంటారు. అవన్నీ గర్భధారణకు సురక్షితమైనవో, కావో అంచనా వేస్తారు. అలాగే పూర్వం జరిగిన సర్జరీలు, వాటితో ఫెర్టిలిటీ మీద పడే ప్రభావాలను కూడా వైద్యులు అంచనా వేస్తారు. కొందరు మహిళలు 45 ఏళ్లకే మెనోపాజ్‌కు చేరుకుంటూ ఉంటారు. అంటే వీళ్లలో అండాల నిల్వలు 20 ఏళ్ల ముందే తరిగిపోతాయి. కాబట్టి గర్భం దాల్చాలనుకనే మహిళల తల్లుల మెనోపాజ్ వయసు గురించి ఆరా తీసి, అదే క్రమం కొనసాగే అవకాశాలుంటాయి కాబట్టి వీలైనంత తర్వగా గర్భం దాల్చడం అవసరమని వైద్యులు సూచిస్తారు. అలాగే మహిళల్లో అండాల రిజర్వ్, వాటి విడుదల, నెలసరి క్రమం, గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్.. వీటన్నిటినీ కూడా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలా ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు ముందే రిస్క్ ఫ్యాక్టర్లన్నీ అంచనా వేసుకుని, వాటిని చికిత్సతో సరిదిద్దుకోవడం అవసరం. అండాలు తక్కువగా ఉన్నప్పుడు వీలైనంత త్వరగా ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవాలి. ఒకవేళ ఎగ్ రిజర్వ్ మెరుగ్గా ఉంటే, ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు ఎంత కాలం ఆగవచ్చో వైద్యులే సూచిస్తారు.

> **అండం విడుదలకు నెలసరి సూచన. అయితే ఆ నెలకు అవసరమైన అండం ఆ నెలలోనే తయారవుతూ ఉంటుందని మహిళలు అపోహ పడుతూ ఉంటారు. కానీ నిజానికి మెనోపాజ్ వరకూ ప్రతి నెలా నెలసరి రూపంలో విడుదలవుతూ వస్తున్న అండాలన్నీ పుట్టుకతో వెంటబెట్టుకొచ్చినవే! అంతే తప్ప, మహిళల్లో కొత్తగా అండాలనేవి ప్రతి నెలా తయారు కావు. కాబట్టి ఆ అండాల రిజర్వ్ తరిగిపోయేలోగా గర్భం దాల్చేలా ప్లాన్ చేసుకోవాలి.**

కారణం దొరకకపోతే...

30 శాతం జంటల్లో గర్భం దాల్చకపోవడానికి ఎటువంటి కారణం కనిపించదు. జంట అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండవచ్చు, తగిన వయసులోనే ఉండి ఉండవచ్చు. అయినా గర్భం దాల్చలేని అన్‌ఎక్స్‌ప్లేన్‌డ్ ఇన్‌ఫెర్టిలిటీ పరిస్థితి వాళ్లలో నెలకొని ఉంటుంది. ఇందుకు కారణం ఇదీ అని వైద్యులు కూడా సూటిగా చెప్పలేరు. దంపతులు అనుసరించే అలవాట్లు, కొనసాగించే జీవనవిధానం, ఎదుర్కొంటున్న ఒత్తిడులు.. ఫెర్టిలిటీ మీద వేటి ప్రభావం ఏ మేరకు వైద్యులు లెక్కించలేరు. ఈ కారణాల ప్రభావాన్ని కచ్చితంగా కనిపెట్టే పరీక్షలూ లేవు. అధిక బరువు, పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్, థైరాయిడ్ సమస్యలు కూడా గర్భధారణకు అడ్డుపడేవే! అస్తవ్యస్థ జీవన విధానాల ద్వారా మనంతట మనమే కొని తెచ్చుకుంటున్న సమస్యలివి. బరువు అదుపులో ఉన్నంతవరకూ ఫరవాలేదు. ఒకసారి బరువు పెరిగితే ఆ ప్రభావంతో హార్మోన్ల గతి తప్పుతాయి. ఫలితంగా నెలసరులు క్రమం తప్పుతాయి. అండాల విడుదల, నాణ్యత క్రమం తప్పుతాయి. కాబట్టి కారణం దొరకని ఇన్‌ఫెర్టిలిటీ కోవకు చెందిన దంపతులు కచ్చితంగా రెండు నెలల పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, అలవాట్లను కొనసాగించాలి. అప్పటికీ గర్భధారణ సాధ్యపడకపోతే, అండాలు, వీర్యకణాల నాణ్యతను పెంచే చికిత్సను తీసుకోవలసి ఉంటుంది. అందుకోసం మందులు వాడుకోవాలి. తర్వాత ఐయువి ద్వారా నాణ్యమైన వీర్యకణాలను గర్భాశయంలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను ఎంచుకోవాలి. ఇలా నాలుగైదు ప్రయత్నాలకూ గర్భధారణ జరగకపోతే, ఐవిఎఫ్‌ను ఎంచుకోవలసి వస్తుంది.

అండాలు నిల్వ చేసుకున్నా....

మహిళల గర్భధారణకు తగిన వయసు 23 నుంచి 29 సంవత్సరాలు. కానీ కెరీర్ కోసం ప్రెగ్నెన్సీని వాయిదా వేసే వాళ్లు, ఆలస్యంగా పెళ్లి చేసుకునే వాళ్లు... 'అండాలను దాచుకుని, వాటితో నచ్చినప్పుడు గర్భం దాల్చుదాం' అనుకుంటూ ఉంటారు. కానీ ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. యవ్వనంలో నిల్వ చేసుకున్న అండాలు యవ్వనంగానే ఉండిపోయినా, వాటిని మనం వినియోగించుకునే సమయానికి మన శరీరం యవ్వనంగా ఉండదు. పెరిగే వయసులో మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మొదలుకావచ్చు. ఆ రుగ్మతలతో గర్భం దాల్చడంలో సమస్యలు తలెత్తవచ్చు.

ప్రోగ్రామ్డ్ ఇంటిమసీ

దంపతులిద్దరూ ఉద్యోగస్థులైనప్పుడు వారాంతాల్లో దొరికే తీరిక సమయాల్లోనే, అండం విడుదలయ్యే ఆ కొద్ది రోజుల వ్యవధిలోనే శారీరకంగా కలిస్తే సరిపోతుంది అనుకునే ధోరణి కూడా దంపతుల్లో ఉంటోంది. 'ఇప్పుడు మనం పిల్లలను కనాలి కాబట్టి నా ఓవ్యులేషన్ డేట్స్ ఇవీ' అని ఆ తేదీల్లోనే యాంత్రికంగా కలిసే పరిస్థితి కొనసాగుతోంది. నిజానికి ఇలాంటి ప్రయత్నాల్లో విజయం సాధించే అవకాశాలు కేవలం ఇరవై శాతమే! సక్రమమైన గర్భధారణకు తోడ్పడేవి శరీరంలోని హార్మోన్లు. అవి సజావుగా ప్రవించాలంటే మనసు, శరీరం, పరిసరాలు ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉండాలి. ఇలా సాన్నిహిత్యాన్ని కొన్ని వారాలకూ, కొన్ని సమయాలకూ పరిమితం చేయకుండా ఏడాది పాటు ప్రయత్నం చేసినప్పుడే గర్భధారణ సాధ్యపడుతుంది.



డాక్టర్ ప్రీతి రెడ్డి. జి
సీనియర్ కన్సల్టెంట్ ఇన్‌ఫెర్టిలిటీ,
బర్త్‌రైట్ ఫెర్టిలిటీ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
కొండాపూర్, హైదరాబాద్.

హెల్తీ బ్రేక్‌ఫాస్ట్

ఈ అల్పాహారం అమోఘం

కొంతమంది పిండిపదార్థాలతో కూడిన బ్రేక్‌ఫాస్ట్ తినడానికి ఇష్టపడరు. అలాంటి వాళ్ల కోసం సద్గురు జగ్గీ వాసుదేవ్ ఒక పోషకభరిత అల్పాహారాన్ని సూచిస్తున్నారు. అదేంటంటే...



గుప్పెడు వేరుసెనగ గుళ్లను నీళ్లలో నానబెట్టుకోవాలి. నచ్చిన పండ్ల ముక్కలు, రుచికి తేనె తీసుకోవాలి. ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నీళ్లలో నానబెట్టిన వేరుసెనగ గుళ్లను తీసుకుని, నచ్చిన పండు, తేనెలతో కలిపి, సరిపడా నీళ్లు జోడించి మిక్సీలో జ్యూస్‌లా తయారుచేసుకోవాలి. ఈ పానీయంతో కడుపు నిండడమే కాకుండా ఐదు గంటల పాటు ఆకలి వేయకుండా ఉంటుంది. దీన్లో ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు, అవసరమైన పోషకాలుంటాయి. శక్తిని నిరంతరంగా విడుదల చేస్తూ శరీరాన్ని చురుగ్గా ఉంచే శక్తి ఈ పానీయానికి ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవాళ్లు కూడా ఈ బ్రేక్‌ఫాస్ట్‌ను ఎంచుకోవచ్చు.

గుడ్ ఫుడ్

28 గ్రాముల షియా విత్తనాల్లో...

షియా విత్తనాల్లో పోషకాలకు కొదవ ఉండదనే విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టి రోజుకు 28 గ్రాములకు తగ్గకుండా షియా విత్తనాలను తీసుకుంటూ ఉండాలి. ఈ పరిమాణంలోని షియా విత్తనాలతో 138 క్యాలరీల శక్తి సమకూరుతుంది.



నాలుగున్నర గ్రాముల ప్రొటీన్‌తో పాటు పది గ్రాముల పీచు, 9 గ్రాముల ఒమేగా3 కొవ్వు దక్కుతుంది. అలాగే 12 గ్రాముల పిండిపదార్థాలు, బి1, బి2, బి3లు కూడా దొరుకుతాయి. క్యాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, మాంగనీస్‌లతో పాటు జింక్, కాపర్, పొటాషియం కూడా సమకూరతాయి.

ఇలా తినాలి

- ఉదయం అల్పాహారంలో భాగంగా రెండు స్పూన్ల షియా విత్తనాలను ఒక గిన్నెలో నానబెట్టి, నచ్చిన పండ్ల ముక్కలను చేర్చి తినవచ్చు.
- గ్లాసు నీళ్లలో షియా విత్తనాలను నానబెట్టి, తేనె కలుపుకుని బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు తాగవచ్చు.
- ఓట్స్‌ను పాలలో ఉడికించి, షియా విత్తనాలను పైన చల్లుకుని తినవచ్చు.
- టోస్ట్, శాండ్‌విచ్‌ల పైన షియా విత్తనాలను నేరుగా చల్లుకుని తినవచ్చు.

అవేర్‌నెస్

'డిజిటల్ డిటాక్స్'!

కంప్యూటర్ల ముందు ఎక్కువ సమయం పాటు పని చేయడం మూలంగా కంటి సమస్యలు మొదలవుతాయనే విషయం మనందరికీ తెలిసిందే!. ఫోన్లు, కంప్యూటర్లకు అతుక్కుపోయేవాళ్లు సమస్యల బారిన పడకుండా ఉండాలంటే 'డిజిటల్ డిటాక్స్'ను అనుసరించడం అవసరం అంటున్నారు నిపుణులు!

కంప్యూటర్ పనిలో పడిపోయి కళ్లను ఆర్పడం కూడా మర్చిపోతూ ఉంటే, కళ్లతో పాటు, పూర్తి శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది అంటున్నారు కంటి వైద్యులు. అధిక సమయం పాటు స్ర్కీన్‌ల మీద దృష్టి నిలిపితే, డ్రై ఐ సిండ్రోమ్, విజువల్ డిస్‌ప్లే టర్మినల్స్ సిండ్రోమ్ (వి.డి.టి.ఎస్), రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ కారణంగా ఎర్లీ మయోపియా లాంటి కంటి సమస్యలు తప్పవు అంటున్నారు వైద్యులు. నిమిషానికి కనీసం 20 నుంచి 30 సార్లు కళ్లను ఆర్పాలి. కన్నీటి గ్రంథులు స్రావాలను విడుదల చేసి కనుగుడ్లను తేమగా ఉంచాలంటే ఇలా జరగాలి. అయితే కళ్లు ఆర్పకుండా కంప్యూటర్ల ముందు పని చేయడం మూలంగా, కనుగుడ్లు పొడిబారి, తేలికగా అలసటకు గురవుతూ ఉంటాయి. ఇలా దీర్ఘకాలం పాటు కొనసాగితే దూరదృష్టి సన్నగిల్లుతుంది. కళ్లమంటలు, దురదలు లాంటి తాత్కాలిక ఇబ్బందులూ ఎదురుకావచ్చు. పెద్దల్లో చదవడంలో ఇబ్బందులు తలెత్తడంతో పాటు నిద్ర సమస్యలూ ఎదురవవచ్చు. కాబట్టి కంప్యూటర్ ముందు పని చేసే సమయంలో సరైన వెలుతురు ఉండేలా చూసుకోవాలి. నిద్రకు గంట ముందే పని ముగించుకోవాలి. ఒకవేళ దీర్ఘ సమయాల పాటు కంప్యూటర్ ముందు పని చేయవలసివస్తే, ల్యూబ్రికెంట్ కంటి చుక్కలు వాడాలి.

డిజిటల్ డిటాక్స్ ఇలా....

- తరచుగా కళ్లను ఆర్పుతూ ఉండాలి.
- ప్రతి మూడు గంటలకూ ముఖాన్ని గోరువెచ్చని నీటితో కడుక్కోవాలి.
- కాఫీ/టీ బ్రేక్ తీసుకుంటూ, స్వల్పంగా వేడిగా ఉన్న కప్పును మూసిన కనురెప్పలకు ఆనిస్తూ ఉండాలి.
- కంప్యూటర్ మానిటర్ కంటి చూపుకు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. మొబైల్ ఫోన్ల స్ర్కీన్ టైమ్‌ను పరిమితం చేయాలి. ప్రతి అరగంటకూ కంటి చూపును స్ర్కీన్ నుంచి మళ్లిస్తూ ఉండాలి.



మీకు తెలుసా?

ఇమ్యూనిటీ... ఇలా!

వ్యాధినిరోధకశక్తిని బలపరుచుకోవడానికి నేరుగా తోడ్పడే అంశం ఇదీ.. అని ఇప్పటివరకూ కచ్చితంగా నిర్థారణ కాలేదు. అయితే ఇందుకు ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో కొంత తోడ్పడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకోసం అనుసరించవలసిన ఆరోగ్య సూత్రాలు ఇవే!

- ధూమపానానికి దూరంగా ఉండాలి.
- పళ్లు, కూరగాయలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.
- సరిపడా నిద్ర తప్పనిసరి.
- ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- శరీర శుభ్రత పాటించాలి.



ఒత్తిడి ప్రమాదం!

ఒత్తిడితో జీర్ణవ్యవస్థలో లోపాలు, హృద్రోగాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. అంతటి తీవ్ర రుగ్మతలకు పరోక్షంగా కారణమయ్యే ఒత్తిడి, వ్యాధినిరోధకశక్తిని కుంటుపరిచి, తేలికగా వ్యాధులకు గురి చేయదు అనుకోవడంలో అర్థం లేదు. అయితే ఒత్తిడి ఎంతో కొంత ఉండడం సామర్థ్య నిరూపణకు అవసరమే! అయితే ఆ ఒత్తిడి తీవ్రత, కొనసాగే కాలాలను బట్టి, దాని ప్రభావం వ్యాధినిరోధకశక్తి మీద ప్రభావం చూపిస్తుంది. అలాగే ఒత్తిడి అందరిలోనూ ఒకేలా, సమానంగా ఉండకపోవచ్చు. ఒత్తిడికి లోను చేసే విషయాల్లో కూడా వ్యక్తుల మధ్య తేడాలు ఉండవచ్చు. కాబట్టి జీవన నాణ్యతను దెబ్బతీసేలా ఉంటే, ఆ ఒత్తిడి కచ్చితంగా వ్యాధినిరోధకశక్తిని కుంటుపరుస్తుంది అని గ్రహించాలి. కాబట్టి ఒత్తిడిని యోగా, ధ్యానం, వ్యాయామాలతో తగ్గించుకోవాలి.

హోమియో



వేసవికి విరుగుడు

వేసవి కాస్త ముందే మొదలైపోయింది. ఈ కాలంలో వేసవి వెతల నుంచి తప్పించుకోవాలంటే శరీరాన్ని చల్లబరిచే జాగ్రత్తలు పాటిస్తూ, ముందు జాగ్రత్తగా కొన్ని హోమియో మందులు కూడా వాడుకుంటూ ఉండాలి.

వేసవిలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే సమస్య డీహైడ్రేషన్. సరిపడా నీళ్లు తాగితే ఈ సమస్య ఉండదు. కానీ దాహం వేసే వరకూ ఆగడం, దాహం వేసినా దాహార్తిని తీర్చుకోకుండా వాయిదా వేస్తూ ఉండడం మనకు అలవాటు. కొందరికి దాహం తక్కువగా ఉంటూ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆడపిల్లలు, మహిళలకు సహజంగానే దాహం తక్కువ. ఇలాంటివాళ్లు నీళ్లు తాగుతూనే, నీళ్లు తాగాలి అనిపించనప్పుడు బదులుగా ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, పల్చని మజ్జిగ తాగుతూ ఉండాలి. ఉద్యోగాలకు వెళ్లే వాళ్లు, స్కూలుకు వెళ్లే పిల్లలు ఉప్పు కలిపిన పల్చని మజ్జిగను వెంటబెట్టుకు వెళ్లడం మేలు. సాధారణంగా ఉప్పు గురించి అందర్లో ఒక దురభిప్రాయం స్థిరపడిపోయింది. ఉప్పు రక్తపోటును పెంచుతుందన్నది అపోహ. రక్తపోటు ఉన్న వాళ్లు ఉప్పు వల్ల రక్తపోటు పెరిగే విషయం వాస్తవమే అయినా అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఉప్పు తినడం వల్ల వాళ్ల రక్తపోటు పెరగదు. కాబట్టి చెమటతో కోల్పోయే లవణాల్ని ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, నీళ్లతో భర్తీచేసుకుంటూ ఉండాలి. ఇంతకూ మనం వాడే ఉప్పు ఎలాంటిదై ఉండాలి?

సైంధవ లవణం

టేబుల్ సాల్ట్‌గా పిలుచుకునే ప్రాసెస్ చేసిన ఉప్పులో ఖనిజలవణాల శాతం తక్కువ. కాబట్టి వేసవితో పాటు అన్ని కాలాల్లో హిమాలయన్ రాక్ సాల్ట్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. నిజానికి టేబుల్ సాల్ట్ వాడుకోవడం మొదలుపెట్టిన 60ల నాటి నుంచే థైరాయిడ్ సమస్యలు మొదలయ్యాయి. అవసరం లేకపోయినా టేబుల్ సాల్ట్‌లో అదనంగా అయొడిన్ జోడించడం వల్ల థైరాయిడ్ సమస్యలను కొని తెచ్చుకున్నవాళ్లమయ్యాం. దేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, మణిపూర్, మిజోరం, నాగాల్యాండ్, త్రిపుర... ఈ ఏడు ప్రాంతాల్లోని వాతావరణాల్లో అయొడిన్ ఉండదు కాబట్టి ఆ ప్రాంతాల వారి కోసం ప్రత్యేకంగా తయారుచేసిన అయొడైజ్డ్ సాల్ట్‌ను దేశవ్యాప్త ప్రజలందరూ వాడడం సమంజసం కాదు.

> **వేసవి మందులు**
> **ఎండ ప్రభావం నుంచి రక్షణ పొందాలంటే, ఎండలోకి వెళ్లే ముందు, పిల్లలైతే 30 పొటెన్సీ పెద్దలైతే, 200 పొటెన్సీ కలిగిన ఒక డోసు నేట్రంకార్బ్ వేసుకోవాలి. ఈ మందుతో శరీరం చల్లబడి, ఎండదెబ్బ బారిన పడకుండా ఉంటరు. ఒకవేళ ఎండదెబ్బ తగిలి ఉండే నేట్రంమూర్ తీసుకోవాలి.**

చలచల్లని ఆహారం

వేసవిలో శరీరాన్ని చల్లబరుచుకోవడం కోసం ఎక్కువ నీటి శాతాన్ని కలిగి ఉండే కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. కీరా, దోస, బీర, పొట్ల, సొర తినాలి. కీరా ముక్కల మీద ఉప్పు, మిరియాల పొడి చల్లి తినొచ్చు. పొట్టు పెసరపప్పును పలుకుగా ఉడికించి, ఈ కూరగాయలను జోడించి వండుకుని తినడం వల్ల ప్రయోజనం ఉంటుంది. వేసవిలో సొరకాయ, గుమ్మడి రసాలను తాగొచ్చు. వేసవిలో శరీరంలో మెగ్నీషియం తగ్గిపోతూ ఉంటుంది. మిగతా ఖనిజలవణాలన్నిటినీ శరీరం శోషించుకోడానికి మెగ్నీషియం తోడ్పడుతుంది. కాబట్టి ఈ లవణాన్ని సరిపడా తీసుకోవడం అవసరం. జింక్, మెగ్నీషియం, క్రోమియం, సెలీనియం లాంటి అరుదైన ఖనిజ లవణాలను కలిగి ఉండే బూడిద గుమ్మడి రసాన్ని వేసవిలో ప్రతి రోజూ పరగడుపున తీసుకుంటూ ఉండాలి. ఈ లవణాలన్నీ కణజాలాన్ని వృద్ధి చేసి, శరీరంలోని ఖనిజ లవణాలను సంతులనం చేస్తాయి. అలాగే రాచగుమ్మడి పుసులు, వేపుడు తినడం అవసరం. గుమ్మడి, పుచ్చ విత్తనాలు కూడా మేలైనవే! వీటిని రాత్రి నానబెట్టి, ఉదయం తినాలి.



వీటిని మానేయాలి

శరీరంలో వేడిని పెంచే గుడ్లు తగ్గించాలి. అలాగే బ్రాయిలర్ గుడ్లు, మాంసం కూడా మానేయాలి. హార్మోన్లను అస్తవ్యస్తం చేసే గుణం కలిగిన బ్రాయిలర్ ఉత్పత్తులతో మహిళల్లో థైరాయిడ్ సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి నాటు గుడ్లు, నాటు కోడి మాంసం తినడమే ఉత్తమం. అలాగే గుడ్లలోని పోషకాలన్నీ సంపూర్తిగా అందడం కోసం పచ్చి గుడ్డును అలాగే తాగేయడం ప్రయోజనకరం. ఇలా 40 రోజుల పాటు చేయగలిగితే ఆరోగ్యం బాగా మెరుగు పడుతుంది. వీలైనంత వరకూ సేంద్రీయ ఉత్పత్తులనే వాడుకోవాలి. దొరకనివాళ్లు గోరువెచ్చని నీళ్లలో బేకింగ్ సోడా కలిపి, ఆ నీళ్లలో కూరగాయలు, ఆకుకూరలను నానబెట్టి వాడుకుంటే, పురుగుమందుల ప్రభావం నుంచితప్పించుకోవచ్చు.



డాక్టర్ సురేంద్ర రాజు
హోమియో నిపుణులు,
క్యూర్ హోమియో కేర్,
సైఫాబాద్, హైదరాబాద్.

బుమ్రాకు విశ్రాంతి
రాహుల్ రీఎంట్రీ !

రాంచీ టెస్ట్ కోసం టీమిండియాలో మార్పులు



రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌కు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. టీమిండియా ప్రధాన పేసర్ బుమ్రాకు విశ్రాంతి నిచ్చే చాన్సులుండగా.. తొడ కండర గాయం నుంచి కోలుకొన్న కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో తుది జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తోంది. రాంచీ టెస్ట్ శుక్రవారం నుంచి జరగనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు బ్రేక్ ఇచ్చే అవకాశాలున్నాయని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు.



ఈనేపథ్యంలో బెంగాల్ తరపున రంజీ ఆడుతున్న పేసర్ ముకేష్ కుమార్ జట్టులోకి పునరాగమనం చేయొచ్చు. రాంచీలోనే టీమిండియా సిరీస్ సొంతం చేసుకొంటే.. ధర్మశాల టెస్ట్‌కు కూడా బుమ్రాకు విశ్రాంతి లభించవచ్చు. రాహుల్ రీఎంట్రీతో రజత్ పటీదార్ బెంచీకే పరిమితమయ్యే అవకాశముంది. రజత్ ఆడిన రెండు టెస్టుల్లోని నాలుగు ఇన్నింగ్స్‌లో కలిపి 46 (32+9+5+0) పరుగులే చేసి విఫలమయ్యాడు.

విజయంతో ముగించిన జైపూర్

పంచకుల: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10ను జైపూర్ పింక్ పాంథర్స్ విజయంతో ముగించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 45-36తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గి, తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 51-36తో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. ఈ విజయంతో లీగ్ పట్టికలో పుణె 91 పాయింట్లతో ద్వితీయ స్థానానికి చేరుకుంది.

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు

'వారు నేటితరం కుర్రాళ్లు'.. యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, కీపర్ ధ్రువ్ జురెల్‌లనుద్దేశించి కెప్టెన్ రోహిత్ చేసిన వ్యాఖ్యలివి. ఈ మేరకు అతడు ఇన్‌స్టా స్టోరీలో వీరి ఫొటోలు పోస్ట్ చేశాడు. వాస్తవానికి భారత క్రికెట్‌లో ఇప్పుడు యువ ఆటగాళ్ల హవా నడుస్తోంది. అదీ సంప్రదాయక టెస్టు ఫార్మాట్‌లో కావడం మరో విశేషం.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



ఇంగ్లండ్‌తో ముగిసిన మూడో టెస్టులోనే కాదు.. వైజాగ్‌లో జరిగిన రెండో టెస్టులోనూ కుర్రాళ్ల విజృంభణను అంతా గమనించే ఉంటారు. అందుకే భారత టెస్టు క్రికెట్ భవిష్యత్ యువ ఆటగాళ్ల చేతుల్లో పదిలంగా ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అటు కెప్టెన్ రోహిత్ కూడా మూడో టెస్టులో 434 పరుగుల రికార్డు విజయాన్ని యువ ఆటగాళ్ల ఖాతాలోనే వేశాడు. అలాగే ఈ సిరీస్‌లో జట్టు రిజర్వ్ బెంచ్ ఎంత బలంగా ఉందో కూడా ప్రపంచ క్రికెట్‌కు తెలిసివచ్చింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లేకపోయినా ఇబ్బందేమీ లేకుండా ఈ సిరీస్‌లో జట్టు బ్యాటింగ్ ఆర్డర్ కదం తొక్కుతోంది. 22 ఏళ్ల జైస్వాల్ విశ్వరూపాన్ని గమనిస్తున్న క్రికెట్ దిగ్గజాలు వేనోళ్ల పొగుడుతున్నారు. వినోద్ కాంబ్లీ, డాన్ బ్రాడ్‌మన్ తర్వాత రెండు డబుల్ సెంచరీలు బాదేసిన పిన్నవయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. ఆడింది ఏడు టెస్టులే అయినా అతడి పరిణతి చెందిన బ్యాటింగ్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా మారింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో అతనాడిన ఆడిన ఆటకు.. కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించిన తీరుకు అసలు సంబంధమే లేదు. పరిస్థితిని అంచనా వేసుకుంటూ జట్టుకు విలువైన ఇన్నింగ్స్‌ను అందించే ప్రయత్నంలో జైస్వాల్ ఆడిన తీరది. దిగ్గజ పేసర్ అండర్సన్ ఓవర్‌లో వరుసగా మూడు సిక్సర్లతో రాబోయే పరుగుల తుఫాన్‌కు హెచ్చరికలు జారీ చేశాడు. సెంచరీ అయ్యాక వెన్నునొప్పితో మైదానం వీడి.. మరుసటి రోజు వచ్చి మరో సెంచరీ బాదిన అతడి నిలకడైన ఆట గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో 12 సిక్సర్లు బాదిన అతడి పవర్ హిట్టింగ్ సైతం ప్రత్యర్థి జట్లను వణికించేదే. అందుకే ఇంగ్లండ్ ఓపెనర్ డకెట్ అతడిని భవిష్యత్ సూపర్‌స్టార్‌గా ప్రకటించేశాడు. అతి పేద కుటుంబం నుంచి వచ్చి నేడు భారత క్రికెట్‌కు ఆశాకిరణంగా చెప్పుకొనే స్థాయికి ఎదిగిన యశస్వీ దేశంలోని ఎందరో వర్ధమాన ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తున్నాడు. అంతేకాదు.. 'కష్టపడనిదే ఏదీ దరిచేరదు. నా చిన్నప్పటి ప్రయాణంలో బస్సు రైలు లేదా ఆటో రిక్షాలు అందుకునేందుకు చాలా కష్టాలు పడాల్సివచ్చేది. నేను ఆ స్థాయినుంచి కష్టాలు పడుతూ వచ్చినవాణ్ణి. అందుకే ప్రాక్టీస్ సెషన్‌లోనూ అలాగే ఉంటా. క్రీజులో ఉన్న ప్రతిసారీ వంద శాతం నా శక్తిని వినియోగిస్తా' అని యశస్వీ చెబుతున్నాడు.

మరో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సైతం జట్టులో సుస్థిరంగా ఉండేందుకే వచ్చానని చాటుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో అతడికి తుది జట్టులో చోటు దక్కగానే క్రికెట్ ప్రేమికులు ఎంతగానో సంతోషించారు. అతడి దేశవాళీ క్రికెట్ ప్రతిభ అలాంటిది మరి. జాతీయ జట్టులో చోటే లక్ష్యంగా 2022 రంజీ సీజన్‌లో 928 పరుగులు బాదాడంటే ఈ యువ ఆటగాడి ఆకలి ఎలా ఉందో తెలుస్తుంది. ఇక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 45 మ్యాచ్‌ల్లో 14 శతకాలతో 3912 రన్స్ సాధించాడు. రాహుల్ గాయం రూపంలో అతడికి అదృష్టం తలుపు తట్టింది. ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగి రెండు ఇన్నింగ్స్‌లోనూ హాఫ్ సెంచరీలతో తన అరంగేట్రాన్ని ఘనంగా చాటుకున్నాడు. అయితే ఇంగ్లండ్ స్పిన్నర్లు హార్ట్‌లీ, రెహాన్, రూట్‌లను అలవోకగా ఎదుర్కోవడం వెనుక అతడి అలుపెరుగని కష్టం కూడా ఉంది. తండ్రి, కోచ్ నౌషద్ ఖాన్ అతడికి ఆఫ్, లెగ్, లెఫ్టామ్ స్పిన్నర్లతో రోజుకు 500 బంతులు వేయించి ప్రాక్టీస్ చేయించేవాడు. కరోనా సమయంలోనూ ప్రాక్టీస్ కోసం ముంబై నుంచి వివిధ నగరాలకు 1600 కి.మీలపాటు కారులో ప్రయాణించేవాడట. అలాగే కాన్పూర్ అకాడమీలో స్పిన్నర్ కుల్దీప్ బంతులను అదేపనిగా ఎదుర్కొని రాటుదేలాడు. మ్యాచ్‌లు లేనప్పుడు సర్ఫరాజ్ కోసం నౌషద్ ఇంట్లోనే ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌ను ఏర్పాటు చేసి ఆడించేవాడు. ఇంతటి కఠోర సాధన కారణంగానే ఆడుతోంది ఇంగ్లండ్‌లాంటి జట్టుపై అయినా ఈ కుర్రాడు అదురూ బెదురు లేకుండా బ్యాటింగ్ చేశాడు. ఏదిఏమైనా ప్రస్తుత తరుణంలో సీనియర్లను కాదని కొత్త ఆటగాళ్లకే టీమిండియా సెలెక్టర్లు పెద్దపీట వేస్తున్నారు కాబట్టి.. యంగ్ గన్స్ కూడా తమ ప్రతిభ నిరూపించుకుంటే వారి స్థానాలకు ఢోకా లేనట్టే..

రైల్వేస్ నయా చరిత్ర

రంజీలో రికార్డు ఛేదన

త్రిపురపై ఘన విజయం

న్యూఢిల్లీ: రంజీ ట్రోఫీ చరిత్రలో రైల్వేస్ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. త్రిపురతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఈ జట్టు 378 పరుగుల ఛేదనను విజయవంతంగా అధిగమించింది. 90 ఏళ్ల రంజీ ట్రోఫీలో ఇప్పటిదాకా ఏ జట్టూ ఇంత భారీ స్కోరును ఛేదించలేకపోయింది. నాలుగేళ్ల క్రితం సౌరాష్ట్ర జట్టు ఉత్తరప్రదేశ్‌పై 372 పరుగులను ఛేదించడమే ఇప్పటిదాకా రికార్డు. అయితే ఈ ఛేదనలో రైల్వేస్ 31 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినా.. ఓపెనర్ ప్రథమ్ సింగ్ (169), మహ్మద్ సైఫ్ (106) జోడీ ఐదో వికెట్‌కు 175 పరుగులు జోడించడంతో గట్టెక్కింది. దీంతో 378/5 స్కోరు సాధించిన రైల్వేస్ ఐదు వికెట్లతో అద్భుత విజయాన్నందుకుంది. త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 149, రెండో ఇన్నింగ్స్‌లో 333 పరుగులు చేయగా.. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగులు సాధించింది.

సిరీస్ శ్రీలంకదే..

అఫ్ఘాన్ మరో పరాజయం



దంబుల్లా: అఫ్ఘానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే శ్రీలంక చేజిక్కించుకుంది. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 72 పరుగులతో నెగ్గింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 187/6 స్కోరు చేసింది. సమరవిక్రమ (51), ఏంజెలో మాథ్యూస్ (42 నాటౌట్) రాణించారు. ఛేదనలో 17 ఓవర్లలో అఫ్ఘానిస్థాన్ 115 పరుగులకే కుప్పకూలింది. ఏంజెలోతోపాటు నలుగురు బౌలర్లు తలా రెండేసి వికెట్లు తీశారు.

స్టేడియం వద్ద ఉద్రిక్తత..: సోమవారం నాటి ఈ రెండో మ్యాచ్ టిక్కెట్లకోసం అభిమానులు స్టేడియానికి భారీగా తరలొచ్చారు. గేట్లను బద్దలుగొట్టి టిక్కెట్ కౌంటర్ల వద్దకు పరుగులు తీయడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

అబ్బో..ఇక్కడ మహిళలకు కష్టమే !



న్యూఢిల్లీ: భారత్‌లో పనిచేయడం ఎంతో కష్టమని మహిళల హాకీ జట్టు కోచ్ షాప్‌మన్ వ్యాఖ్యానించింది. భారత జట్టుకు తొలి మహిళా కోచ్‌గా గత రెండున్నరేళ్ల తన పదవీ కాలంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని వాపోయింది. 'నేను ఎంతో ఒంటరిగా ఫీలవుతున్నా' అని వెల్లడించింది. హాకీ ఇండియా తనకు గౌరవం ఇవ్వలేదని విమర్శించింది. బీజింగ్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన నెదర్లాండ్స్ జట్టులో ఆమె సభ్యురాలు. 'మహిళలను గౌరవించే దేశం నుంచి నేను వచ్చా. కానీ అదే గౌరవాన్ని నేను ఇక్కడ పొందలేకపోతున్నా. పురుషుల, మహిళల కోచ్‌లు, పురుషుల, మహిళల జట్ల మధ్య హాకీ ఇండియా పక్షపాతాన్ని చూపుతోంది' అని 46 ఏళ్ల షాప్‌మన్ చెప్పింది.



మలేసియాలో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టు సభ్యురాలు పుల్లెల గాయత్రి గోపీచంద్‌ను హైదరాబాద్‌లో సోమవారం అభినందిస్తున్న తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్

ఉజ్బెకిస్థాన్‌పై అమ్మాయిల గెలుపు

- పురుషులకు మరో ఓటమి
- వరల్డ్ టీటీ చాంపియన్‌షిప్స్

బుసాన్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళల జట్టు గెలుపు జోరును కొనసాగిస్తోంది. గ్రూప్-1లో సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0తో ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసింది. అర్చన 11-7, 11-3, 11-6తో రిమ్మా గుఫ్రనోవాపై, మనికా బాత్రా 11-7, 11-4, 11-1తో మర్కబో మగ్దియేవాపై, దివ్య చితాలే 11-6, 10-12, 11-4, 11-6తో రోజ్‌లినా కద్యయేవాపై గెలిచారు. బలహీన ప్రత్యర్థి కావడంతో ఆకుల శ్రీజ, అయిహిక ముఖర్జీలకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతినిచ్చారు. చైనా చేతిలో ఓడినా.. హంగేరిపై గెలిచిన అమ్మాయిలు గ్రూప్‌లో రెండో స్థానంలో ఉన్నారు. మంగళవారం ఆఖరి మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది. మరోవైపు పురుషుల జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. గ్రూప్-3 మ్యాచ్‌లో భారత్ 0-3తో కొరియా చేతిలో చిత్తయింది. హర్మీత్ దేశాయ్ 4-11, 10-12, 8-11తో జాంగ్ ఉజిన్ చేతిలో సాథియాన్ 5-11, 7-11, 7-11తో లిమ్ జంగూన్ చేతిలో, శరత్ కమల్ 9-11, 11-8, 6-11, 5-11తో లీ సంగ్ సు చేతిలో పరాజయం పాలయ్యారు.

ప్రైమ్ వాలీబాల్‌లో హైదరాబాద్ బోణీ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు బోణీ కొట్టింది. సోమవారం ఆడిన తమ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ 3-2తో ముంబై మెటియర్స్‌పై నెగ్గింది. తొలి రెండు సెట్లలో హైదరాబాద్ 7-15, 12-15 స్కోరుతో ఓడింది. ఆ తర్వాత పుంజుకుని 15-10, 15-11, 20-18 స్కోరుతో వరుసగా మూడు సెట్లలో నెగ్గి, మ్యాచ్‌లో విజయం సాధించింది.

బిజినెస్

ప్రపంచ టాప్-100 లగ్జరీ బ్రాండ్లలో మలబార్ గోల్డ్

- టైటాన్, మరో 4 దేశీ బ్రాండ్లకూ స్థానం
- జాబితా విడుదల చేసిన డెలాయిట్

ముంబై: ప్రపంచంలోని టాప్-100 లగ్జరీ బ్రాండ్ల జాబితాలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, టైటాన్ సహా మరో నాలుగు భారత కంపెనీలకు చోటు దక్కింది. అంతర్జాతీయ సంస్థ డెలాయిట్ విడుదల చేసిన ఈ జాబితాలో మలబార్ గోల్డ్‌కు 19వ స్థానం లభించింది. దేశీ బ్రాండ్లలో దీనిదే అగ్రస్థానం. టాటా గ్రూప్‌నకు చెందిన ఫ్యాషన్ ఉత్పత్తుల తయారీ సంస్థ టైటాన్ 24వ స్థానంలో నిలిచింది. ఆభరణాల విక్రయ కంపెనీలైన కల్యాణ్ జువెలర్స్, జోయ్ అలుక్కాస్ వరుసగా 46,47 స్థానాలను దక్కించుకున్నాయి. సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్‌కు 78, తంగమాయిల్ జువెలరీకి 98వ స్థానం లభించింది. కాగా, ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ లగ్జరీ ఉత్పత్తుల బ్రాండ్ ఎల్‌వీఎంహెచ్ ఈ జాబితాలో తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకుంది. పీపీహెచ్ కార్ప్ రెండు, రిచ్‌మాంట్ వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నాయి.

మరిన్ని విషయాలు..

- కోజికోడ్‌కు చెందిన మలబార్ గోల్డ్‌కు ఈ జాబితాలో చోటు దక్కడం ఇదే తొలిసారి. గత ఏడాది (2023)కి గాను కంపెనీ ఆదాయం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.33,200 కోట్లు)గా నమోదైంది. కాగా, టైటాన్ టర్నోవర్ 367 కోట్ల డాలర్లు (రూ.30,461 కోట్లు)గా ఉంది.
- భారత్‌లో లగ్జరీ బ్రాండ్లు పెరుగుతుండటం దేశీయంగా విలాస ఉత్పత్తుల మార్కెట్ గతిని నొక్కి చెబుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి జోరు కొనసాగుతున్న నేపథ్యంలో వినియోగదారుల ప్రాధాన్యాలు కూడా పెరుగుతుండటంతో లగ్జరీ మార్కెట్ కూడా గణనీయ వృద్ధి సాధించనుందని రిపోర్టు పేర్కొంది. దీంతో మున్ముందు మరిన్ని భారత బ్రాండ్లు ఈ జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం ఉంది.
- గత ఏడాది టాప్-100 లగ్జరీ బ్రాండ్ల టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం పెరిగి 34,700 కోట్ల డాలర్ల (రూ.28,80,100 కోట్లు)కు చేరుకుంది. అందులో ప్రపంచ నం.1 లగ్జరీ బ్రాండ్ ఎల్‌వీఎంహెచ్ వాటానే 31 శాతంగా ఉంది. టాప్-10 బ్రాండ్ల టర్నోవర్ వాటా 63 శాతం. ఈ బ్రాండ్ల విక్రయాలు గత ఏడాదిలో 23 శాతం వృద్ధి చెందాయి. అంతేకాదు, టాప్-100 బ్రాండ్ల నికర లాభంలో 76.4 శాతం వాటా ఈ పది కంపెనీలదే.

స్పైస్‌జెట్ చీఫ్‌కు 'సుప్రీం' చీవాట్లు

న్యూఢిల్లీ: స్పైస్‌జెట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. స్విట్జర్లాండ్‌కు చెందిన క్రెడిట్ సూయిస్‌కు నెలనెలా చెల్లించాల్సిన బకాయిలను సక్రమంగా చెల్లించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'గో ఫస్ట్ ఎయిర్‌లైన్‌ను కొనేందుకు మీ వద్ద డబ్బులు ఉంటాయి గానీ, క్రెడిట్ సూయిస్ బకాయిలు చెల్లించేందుకు మాత్రం డబ్బులు లేవా?' అని సూటిగా ప్రశ్నించింది. కుయుక్తులు పక్కన పెట్టి వచ్చే నెల 15 కల్లా క్రెడిట్ సూయిస్‌కు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసుపై మార్చి 22న జరిగే తదుపరి విచారణకు అజయ్ సింగ్ స్వయంగా హాజరు కావాలని కూడా ఆదేశించింది.

పన్ను చెల్లింపుదారులకు ఊరట

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ), వెల్త్ ట్యాక్స్, గిఫ్ట్ ట్యాక్స్ చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుభవార్త చెప్పింది. 2015-16 అసెస్‌మెంట్ ఇయర్ వరకు వీరికి జారీ చేసిన రూ.లక్ష లోపు పన్ను చెల్లింపు డిమాండ్ నోటీసులను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రకటన మేరకు సీబీడీటీ ఈ నిర్ణయం తీసుకుంది.

టాటా గ్రూప్ మార్కెట్ విలువ..

పాకిస్థాన్ జీడీపీ కంటే ఎక్కువ

రూ.30 లక్షల కోట్లు దాటిన టాటా కంపెనీల మార్కెట్ క్యాప్



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 36,500 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.30.3 లక్షల కోట్లు) చేరుకుంది. ఇది మన పొరుగు దేశమైన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం కంటే అధికం. గత ఏడాది నాటికి పాకిస్థాన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 34,100 కోట్ల డాలర్ల స్థాయిలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ అంచనా. కాగా, టాటా గ్రూప్‌లో అత్యంత విలువైన, దేశీయ లిస్టెడ్ కంపెనీల్లో రెండో అత్యంత విలువైన కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ క్యాప్ రూ.15 లక్షల కోట్లు దాటింది. టాటా గ్రూప్ మొత్తం మార్కెట్ విలువలో 50 శాతం వాటా ఈ కంపెనీదే. అంటే, పాకిస్థాన్ ఎకానమీ సైజులో సగం. గడిచిన ఏడాది కాలంలో టీసీఎస్‌తో పాటు టాటా మోటార్స్, ట్రెంట్, టాటా పవర్, టైటాన్, టీఆర్‌ఎఫ్ షేర్లు భారీగా పుంజుకోవడం గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయి.

మన టాప్-10 కంపెనీల విలువ 6 పొరుగు దేశాల జీడీపీ కంటే అధికం

గత వారం చివరి నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ సహా దేశంలోని అత్యంత విలువైన 10 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 1.1 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.89.98 లక్షల కోట్లు) చేరుకుంది. దక్షిణాసియాలోని 6 పొరుగు దేశాల (పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులు) మొత్తం జీడీపీ కంపెనీ అధికమిది. 'వరల్డ్ ఎకనామిక్ రిపోర్టు 2023'లో ఐఎంఎఫ్ పేర్కొన్న అంచనాల ప్రకారం.. ఈ ఆరు దేశాల మొత్తం జీడీపీ విలువ 91,200 కోట్ల డాలర్లు. కాగా, దేశంలో అత్యంత విలువైన కంపెనీ ఆర్ఐఎల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 23,800 కోట్ల డాలర్ల స్థాయికి ఎగబాకింది. ఇది శ్రీలంక, నేపాల్, భూటాన్, మాల్దీవుల మొత్తం జీడీపీ కంటే అధికం.

పెద్దల కోసం పన్ను సంస్కరణలు

పొదుపు, గృహ పథకాలు తప్పనిసరి: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ: పెరుగుతున్న వృద్ధుల జనాభా అవసరాల కోసం పన్నుల సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని నీతి ఆయోగ్ కోరింది. ఇందుకు వారి కోసం ప్రత్యేక పొదుపు, గృహ పథకాలు తీసుకురావాలని ఒక నివేదికలో సూచించింది. ప్రస్తుతం దేశ జనాభాలో 10 శాతంగా ఉన్న వృద్ధుల జనాభా, 2050 నాటికి 19.5 శాతానికి పెరగబోతున్న విషయాన్ని నీతి ఆయోగ్ గుర్తు చేసింది. దేశంలో కొద్ది మంది వృద్ధులకు మాత్రమే ఆర్థిక భద్రత ఉన్న విషయాన్నీ గుర్తు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్ల మార్పు ప్రభావం వారిపై పెద్దగా పడకుండా ఉండేలా సీనియర్ సిటిజన్స్ డిపాజిట్ పథకాన్ని తీర్చిదిద్దాలని కోరింది.

రివర్స్ మార్టగేజ్‌ను సంస్కరించాలి: సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన రివర్స్ మార్టగేజ్ పథకాన్ని మరింత సంస్కరించాని నీతి ఆయోగ్ కోరింది. అలాగే సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉపయోగించే ఉత్పత్తులపైనా జీఎస్‌టీతో సహా ఇతరు పన్ను రాయితీలు ఇవ్వాలని సూచించింది. కంపెనీలు సామాజిక బాధ్యత కింద ఖర్చు చేసే సీఎస్ఆర్ నిధుల్లో కొంత భాగం సీనియర్ సిటిజన్ల సంరక్షణకు వినియోగించేందుకు అనుమతించాలని సూచించింది.

డీవీపీ వాక్యూమ్‌తో ఎల్జీ ఎక్విప్‌మెంట్ జట్టు

ఇటలీకి చెందిన డీవీపీ వాక్యూమ్ టెక్నాలజీ ఎస్‌పీఏతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఎల్జీ ఎక్విప్‌మెంట్స్ ప్రకటించింది. ఒప్పందంలో భాగంగా డీవీపీ వాక్యూమ్ ఉత్పత్తుల తయారీతో పాటు పంపిణీ నెట్‌వర్క్, విక్రయాలను ఎల్జీ ఎక్విప్‌మెంట్ చేపట్టనుంది. ఈ భాగస్వామ్యంతో ఉత్పత్తి పోర్టుఫోలియో విస్తరణతో పాటు వృద్ధి ఆధారిత మార్కెట్లకు కార్యకలాపాలను విస్తరించే అవకాశం కలిగిందని ఎల్జీ ఎక్విప్‌మెంట్స్ ఎండీ జైరామ్ వరదరాజ్ అన్నారు. ఎల్జీతో ఒప్పందం కారణంగా భారత మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం లభించిందని డీవీపీ వాక్యూమ్ ప్రెసిడెంట్ రాబర్టో జుచిని తెలిపారు. ఇరు కంపెనీల వ్యాపార వృద్ధికి ఈ భాగస్వామ్యం తోడ్పాటునందించనుందన్నారు.

మన స్టాక్ మార్కెట్ పరుగుకు ఢోకా లేదు..

వచ్చే పాతికేళ్లలో 50 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్

అందరి ఆమోదంతోనే ట్రేడింగ్ సమయం పెంపు.. ● ఎన్ఎస్ఈ ఎండీ ఆశిష్ చౌహాన్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లకు ఢోకా లేదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. ఇప్పటికే జీడీపీని మించిపోయిన మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో పాతికేళ్లలో (2047 నాటికి) మరింతగా పెరగనుందన్నారు. అప్పటికి దేశ జీడీపీ 30 లక్షల కోట్ల డాలర్లు ఉంటే.. మార్కెట్ క్యాప్ 50 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందన్నారు. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఇది రూ.4,150 లక్షల కోట్లకు సమానం. ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్ క్యాప్ 4.5 లక్షల కోట్ల డాలర్ల నుంచి 4.6 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.373.5 లక్షల కోట్ల నుంచి రూ.381.8 లక్షల కోట్లు) మాత్రమే.

టెక్నాలజీనే ఊతం : వచ్చే పాతికేళ్లలో దేశీయ టెక్నాలజీ కంపెనీలు పెద్ద ఎత్తున సంపదను సృష్టించబోతున్నట్టు చౌహాన్ తెలిపారు. మన దేశం ఇప్పటికే అనేక టెక్నాలజీలకు ప్రపంచంలో ప్రధాన కేంద్రంగా మారుతోందన్నారు. గత పదేళ్లలో టెక్నాలజీ దాదాపు అన్ని దైనందిక కార్యకలాపాల్లో భాగమైపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం రోజుకి 6.15 గంటలు మాత్రమే ఉన్న ట్రేడింగ్ సమయాన్ని పెంచే విషయంపైనా చౌహాన్ మాట్లాడారు. బ్రోకర్లతో సహా అందరూ ఇందుకు అంగీకరించాల్సి ఉందన్నారు. కొన్ని దేశాల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఇప్పటికే 24 గంటలు ట్రేడింగ్‌ను అనుమతిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు

జీవితకాల గరిష్ఠానికి నిఫ్టీ

ముంబై: కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్లో జోరు కొనసాగుతోంది. వరుసగా ఐదో రోజు కూడా లాభాల బాటలో మార్కెట్ సూచీలు పయనించాయి. దీంతో సోమవారం నిఫ్టీ కొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలు నమోదు చేయగా ఇన్వెస్టర్ల సంపద కూడా కొత్త రికార్డును నమోదు చేసింది. సెన్సెక్స్ 281.52 పాయింట్ల లాభంతో 72,708.16 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. నిఫ్టీ 81.55 పాయింట్ల లాభంతో 22,122.25 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 22,186.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఈ రెండూ కొత్త రికార్డు స్థాయిలే. నిఫ్టీలోని 50 షేర్లలో 27 లాభాలతో ముగిశాయి.

కొత్త శిఖరాలకు సంపద: మార్కెట్లో కొనుగోళ్ల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ సోమవారం రూ.2,19,581.56 కోట్లు పెరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపద కొత్త రికార్డు రూ.391.69 లక్షల కోట్లకు దూసుకుపోయింది.

లిక్విడేషన్‌కు గీతాంజలి జెమ్స్

ముంబై: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ లిక్విడేషన్ (ఆస్తుల విక్రయం)కు జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సోమవారం ఆదేశించింది. కంపెనీ లిక్విడేటర్‌గా 'శాంతను టీ రే'ను నియమించింది. దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా గీతాంజలి జెమ్స్ పునరుద్ధరణ అవకాశాలు పూర్తిగా సన్నగిల్లడంతో కంపెనీ దివాలా పరిష్కార నిపుణుడు విజయ్ కుమార్ గార్గ్ లిక్విడేషన్‌కు అనుమతించాలని ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు సమర్పించారు. కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తికి గడువు 2019 ఏప్రిల్‌లోనే ముగియడంతో పాటు సంస్థపై కొనసాగుతున్న ఈడీ, సీబీఐ దర్యాప్తులు, పలు ఆస్తులు ఈ దర్యాప్తు ఏజెన్సీల జప్తులో ఉన్న నేపథ్యంలో ట్రైబ్యునల్ లిక్విడేషన్‌కు ఆదేశించింది.

గీతాంజలి జెమ్స్ పలు బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలకు రూ.12,558 కోట్లకు బకాయిపడింది. దివాలా పరిష్కార చర్యల ద్వారా ఏదైనా కంపెనీ వ్యాపార పునరుద్ధణ సాధ్యం కాని పక్షంలో దాని ఆస్తుల విక్రయం ద్వారా రుణదాతల బకాయిలను పరిష్కరించే ప్రక్రియనే లిక్విడేషన్ అంటారు.


కర్ణాటకలో టాటాల రూ.2,300 కోట్ల పెట్టుబడి

బెంగళూరు: కర్ణాటకలో చేపట్టనున్న పలు కొత్త ప్రాజెక్టుల్లో టాటాల సారథ్యంలోని ఎయిరిండియా, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) రూ.2,300 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టులు 1,650 మందికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తాయి. ఈ మేరకు ఉభయ సంస్థలు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మధ్యశ్రేణి పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ సమక్షంలో ఎంఓయూలపై సంతకాలు చేశాయి.

22న జీపీటీ హెల్త్‌కేర్ ఇష్యూ

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్వహణ సంస్థ జీపీటీ హెల్త్‌కేర్ ఇష్యూ గురువారం (తేదీ 22) ప్రారంభమై వచ్చే సోమవారం (తేదీ 26) ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.177-186గా కంపెనీ ప్రకటించింది. ఈ ఐపీఓ కనిష్ఠ ధరలో రూ.501.67 కోట్లు, గరిష్ఠ ధరలో రూ.525.14 కోట్లు సమీకరించగలుగుతుంది. ఇష్యూలో భాగంగా 2.6 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ విధానంలో విడుదల చేస్తారు. రూ.40 కోట్ల విలువ గల తాజా షేర్లు మార్కెట్లో విక్రయానికి పెడతారు.

- టోలిన్స్ టైర్స్ కంపెనీ రూ.230 కోట్ల విలువ గల పబ్లిక్ ఇష్యూ జారీకి అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక పత్రాలు సమర్పించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,670 ▲	57,450 ▲	77,500 ▼
ముంబై	62,017 ▲	56,808 ▲	71,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ	
హైదరాబాద్	554
20వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	542
విజయవాడ	542
విశాఖపట్నం	555
వరంగల్	556

దజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135
వరంగల్	135
కరీంనగర్	135
మహబూబ్‌నగర్	135
కర్నూలు	135
విశాఖపట్నం	124
గోదావరి	139
విజయవాడ	139
గుంటూరు	139
ఒంగోలు	139
చిత్తూరు	135

టీడీపీ జాబితాల్లో మార్పుచేర్పులు!

- అధినేత చంద్రబాబు పరిశీలనలో మహీధర్ రెడ్డి, వసంతల పేర్లు
- టికెట్ ఇస్తే వచ్చేస్తా: వైసీపీ మంత్రి.. కీలక నేతలతో బాబుకు రాయబారం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రధాన ప్రతిపక్షం టీడీపీ అభ్యర్థుల జాబితాలో కొన్ని మార్పుచేర్పులు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ నిర్వహిస్తున్న సర్వేల్లో వచ్చిన ఫలితాలు, కొన్ని జిల్లాల్లో కొంత మంది నేతల చేరికతో మారుతున్న పరిణామాలే దీనికి కారణమని తెలుస్తోంది. విజయవాడకు సమీపంలోని ఒక నియోజకవర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యేకి ఈసారి కూడా టికెట్ ఇవ్వాలని అనుకున్నారు. కానీ, సర్వే ఫలితాల అనంతరం నిర్ణయం మారినట్టు తెలిసింది. నెల్లూరు జిల్లాలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి టీడీపీలో చేరడంతో అక్కడ కనీసం 2 చోట్ల అభ్యర్థులు మారే అవకాశముంది. అదేవిధంగా సర్వేపల్లి, ఆత్మకూరు, కోవూరులోనూ మార్పులు జరుగుతాయని తెలిసింది. కందుకూరు, మైలవరం సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యేలు మానుగుంట మహీధర్ రెడ్డి, వసంత కృష్ణప్రసాద్ పేర్లు తాజాగా టీడీపీ పరిశీలనలోకి వచ్చాయి. ఇక, వైసీపీలో సీటు మార్చారన్న కారణంగా ఒక మంత్రి తాజాగా టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ మంత్రి కోరుతున్న నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. దీంతో ఆ సీటు ఇచ్చినా పర్వాలేదని.. లేదా తన పాత నియోజకవర్గం అయినా ఓకే అంటూ ఆ మంత్రి వర్తమానం పంపినట్టు తెలిసింది. ఈ విషయంపైనా పార్టీ పరిశీలన చేస్తోంది.

వైసీపీలో అక్రమార్కులు: అశోక్ గజపతిరాజు

విజయనగరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు, దొంగ వ్యాపారులే వైసీపీలో ఉంటారని, అభివృద్ధి కోరుకునే వారే టీడీపీతో ఉంటారని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరంలో సోమవారం పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి అశోక్‌తో పాటు మాజీ మంత్రి కళా వెంకటరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అశోక్, కళాలు మాట్లాడుతూ... 'వైసీపీ పాలనలో మహిళలకు, ప్రజలకు భద్రత లేకుండా పోయింది. బెదిరింపులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ఎంతోమంది ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల్లేక వలసలు పోతున్నారు. అందుకే వైసీపీవారు టీడీపీలోచేరుతున్నారు' అని అన్నారు.

శ్రీకాళహస్తిలో ఓట్ల అవకతవకలపై దర్యాప్తు చేయాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నేత షరీఫ్ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరిగిన ఓట్ల అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేసి, తగు చర్యలు తీసుకోవాలని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సీఈసీకి లేఖ రాశారు. 'జనవరి 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసీపీ నేతలు 5 వేలకుపైగా ఫాం-7 దరఖాస్తులు పెట్టారు. ఈ అంశంపై టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సీఈవోకి గతంలో ఫిర్యాదు చేశారు. ఫాం-7 దరఖాస్తులు పెట్టిన విషయం సదరు ఓటర్లకు తెలీదు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే ఆదేశాలతోనే వాటిని పెట్టారు. జాబితా నుంచి తమ పేర్లు ఎందుకు తొలగించారో ఓటర్లకు తెలీదు' అని షరీఫ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జగన్.. ఉత్తర కుమారుడు: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్‌రెడ్డి ఏడీ? ఎక్కడ? చంద్రబాబు సవాల్ విసిరి 24 గంటలైంది. ఏది స్పందన? అర్జునుడు.. కృష్ణుడు అని తనకు తాను కితాబులు ఇచ్చుకోవడం తప్ప సవాలు విసిరితే స్పందించే ధైర్యం లేదు. ఆయన ఉత్తుత్తి ప్రగల్భాల ఉత్తర కుమారుడు' అని టీడీపీ ఎద్దేవా చేసింది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సోమవారం మాట్లాడారు. 'రాప్తాడు సభలో సీఎం పచ్చి అబద్ధాలు మాట్లాడారు. దీనిపై బహిరంగ చర్చకు రావాలని చంద్రబాబు సవాల్ విసిరితే తాడేపల్లి ప్యాలెస్‌లో మునగదీసుకొని పడుకోవడం తప్ప ధైర్యంగా ముందుకు రాలేకపోతున్నారు. దమ్ముంటే చర్చకు రావాలి' అని అన్నారు.

సీపీఎస్ రద్దు చేయలేకపోయాం

- మద్యపానం నిషేధించలేకపోయాం: సజ్జల

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో సీపీఎస్‌ను రద్దు చేయలేకపోయాం. మద్యపాన నిషేధాన్ని అమలు చేయలేకపోయాం' అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అంగీకరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. 'తప్పు చేస్తే కేసులు పెడతారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పైనా ఇదే తరహాలో క్రిమినల్ కేసు నమోదైంది. ఎవరో ఫిర్యాదు చేస్తే పెట్టినదని చంద్రబాబు గుర్తు చేసుకోవాలి. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని అనేది పార్టీ అభిప్రాయం కాదు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశం గతించిన చరిత్ర' అని సజ్జల అన్నారు.

వైసీపీని ఛీకొట్టినా ప్రధాన కార్యదర్శి పదవులేనా?

- పార్టీ వెబ్‌సైట్‌లో కొనసాగుతున్న నేతల పేర్లు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీని ఛీకొట్టిపోయిన నేతలను కూడా ఆ పార్టీ ఇంకా తమవారిగానే ప్రచారం చేసుకుంటోంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవుల్లో వారినే కొనసాగిస్తోంది. అనకాపల్లికి చెందిన దాడి వీరభద్రరావు ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కానీ, వైసీపీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానే కొనసాగుతున్నట్లు ఉంది. ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య కూడా వైసీపీని వదిలేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. అయితే, ఆయనను కూడా వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెబ్‌సైట్‌లో కొనసాగిస్తున్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వైసీపీని వీడి జనసేనలో చేరారు. ఆయనను కూడా వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధికారిక వెబ్‌సైట్ పేర్కొన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి టిక్కెట్ దక్కకపోవడంతో వైసీపీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనను కూడా వైసీపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిస్తున్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన జూపూడి క్షమాపణ చెప్పాలి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు క్షమాపణ చెప్పాలని సీపీఐ డిమాండ్ చేసింది. 'మాకు డబ్బులు మాత్రమే ముఖ్యం.. అంబేడ్కర్ పేరు ముఖ్యం కాదు' అంటూ జూపూడి చేసిన వ్యాఖ్యలు అంబేడ్కర్‌ను అవమానించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. జూపూడి ప్రభాకరరావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


సోషల్ మీడియాలో ఎన్నికల షెడ్యూల్!

- తప్పుడు వార్త అని ఖండించిన ఈసీ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన నకిలీ వార్తను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అది పూర్తిగా తప్పుడు వార్త అని, ఆ వార్తతో తమ కార్యాలయానికి ఎటువంటి సంబంధమూ లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

'డయేరియా' పరిస్థితిపై నివేదిక ఇవ్వండి!

- గుంటూరు అతిసారం ఉదంతంపై హైకోర్టు ఆదేశం
- జీజీహెచ్‌ను సందర్శించిన న్యాయాధికారి లీలావతి



గుంటూరు జీజీహెచ్‌లో డయేరియా బాధితులతో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి లీలావతి

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 19: గుంటూరు నగరంలో 15 రోజులుగా విజృంభిస్తున్న అతిసారం వాస్తవ పరిస్థితిపై నివేదిక అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. గుంటూరులో డయేరియాతో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో వందలాది మంది చికిత్స పొందుతున్నారు. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం అడుగడుగునా గోప్యత పాటిస్తోంది. తాగునీటి నాణ్యతపై రీజనల్ ల్యాబ్ ఇచ్చిన నివేదికను సైతం వెల్లడించ లేదు. రోగుల సంఖ్యను కూడా తక్కువగా చూపుతున్నారు. దీంతో పత్రికల్లో వెలువడుతున్న వార్తలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. దీనిపై సమగ్ర నివేదికను అందజేయాలని గుంటూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీని ఆదేశించింది. కాగా, హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి టీ లీలావతి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో డయేరియా వార్డును సందర్శించారు. అందుతున్న వైద్యసేవలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయాధికారి లీలావతి, సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్‌తో మాట్లాడారు.

పేదోడి చైతన్య రథం సైకిల్!

అదెప్పుడూ ప్రజల మధ్యే.. సైకిల్, గ్లాస్ విలువ పెత్తందారుకు అర్థం కాదు: లోకేశ్ ధ్వజం



గాజువాకలో సభలో 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్యకర్తలు



అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డుపై గతుకులను చూపుతూ లోకేశ్ సెల్ఫీ

(మొదటి పేజీ తరువాయి)

హత్య చేశారని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక పర్యాయాలు ప్రభంజనం సృష్టించిన 'సైకిల్'.. సామాన్యుడి చైతన్య రథమని, అది అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటుందని అన్నారు. 'శంఖారావం' కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం విశాఖ ఉత్తరం, గాజువాక, అనకాపల్లి, చోడవరం సభల్లో ప్రసంగించారు. సైకిల్, గ్లాస్ విలువ పెత్తందారుకు అర్థం కాదన్నారు. సామాన్యులు ప్రతి ఒక్కరూ గ్లాస్‌లోనే టీ తాగి తర్వాత శుభ్రం చేసుకుని మరోసారి వినియోగిస్తారని.. బహుశా జగన్ బంగారు/వెండి గ్లాస్‌లో టీ తాగుతారేమోనని ఎద్దేవా చేశారు. 'ఫ్యాన్ రెక్కలు ఎప్పుడో విరిగిపోయాయి. దానిని చెత్తబుట్టలో పడేయడం ఒక్కటే మిగిలింది. అధికారంలోకి వస్తే లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, గ్రూప్-1,2 నోటిఫికేషన్లు, ఏటా 6,500 కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని 2019లో జగన్ ఇచ్చిన హామీని నమ్మి వేలాది మంది యువతీయువకులు రూ.లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నారు. చివరకు నోటిఫికేషన్లు లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అందుకు ఫ్యాన్ ఉపయోగపడుతోంది. ఉచిత ఇసుక విధానం రద్దుతో పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు.. ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికులు.. బిల్లులు రాక చిన్న చిన్న కాంట్రాక్టర్లు ఫ్యాన్లకు ఉరేసుకుని చనిపోతున్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో పలు వర్గాలకు చెందిన సుమారు 35 వేల మంది వరకు ఫ్యాన్లకు ఉరేసుకుని చనిపోయారు. జగన్ పదేపదే 'సిద్ధమా' అని అంటున్నారు. ఆదివారం రాప్తాడు సభకు వెళ్లిన జగన్‌కు అక్కడ నాయకులు, కార్యకర్తలు తామంతా సిద్ధంగా లేమని చెప్పారు. సభ విఫలమైందని, ప్రజలు వెనక్కి వెళ్లిపోతున్న సమయంలో ఫొటోలు తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై ఉక్రోషంతో వైసీపీ రౌడీలు దాడి చేయడం హేయం.

ఉక్కు ప్రైవేటీకరణ అడ్డుకుంటాం..

విశాఖ ఉక్కు కర్మాగారం భూముల అమ్మకానికి ఏపీలో కాకుండా హైదరాబాద్‌లో పేపర్‌లో ప్రకటన జారీ చేసినట్టు ఇప్పుడే సెల్‌ఫోన్‌లో చూశా. ఆ భూములు ఎవరు కొనుగోలు చేసినా అధికారంలోకి వచ్చిన వెంటనే వెనక్కి తీసుకుంటాం. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటాం. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులపై వేల కేసులు, నాపై హత్యాయత్నంతోపాటు మొత్తం 22 కేసులు పెట్టారు. చంద్రబాబును అర్ధరాత్రిపూట అరెస్టు చేసి అక్రమంగా 53 రోజులు జైలులో పెట్టారు. ప్రతి దుకాణం, కూడళ్ల వద్ద మా నమ్మకం నువ్వే జగన్ అని బోర్డులు పెడుతున్నారు. అయితే ఆయన్ను చెల్లి, తల్లే నమ్మడం లేదు. అటువంటప్పుడు మనం ఎలా నమ్మాలి? షర్టు మడత పెడతానని జగన్ అంటున్నారు. ప్రజలు మాత్రం ఆయన కుర్చీని మడత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

● సీఎం ఏదైనా సభకు వెళ్తే తాను చేసిన నాలుగు మంచి పనులు చెప్పుకొంటారు. జగన్ రాప్తాడు సభలో గంట మాట్లాడి.. 100 సార్లు చంద్రబాబు పేరు జపించారంటే ఆయన పీకిందేమీ లేదని అర్థమవుతోంది.

● ఉత్తరాంధ్రను, ఇక్కడి వనరులను సైకో జగన్, ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డగోలుగా దోచుకున్నారు. 2 నెలల్లో ఈ ప్రాంత ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. - లోకేశ్

రెడ్‌బుక్‌లో వారి పేర్లు..

జగన్ పాలనలో భారీగా జరిగిన అవినీతిని నిరూపించేందుకు నేను సిద్ధం. సమయం, వేదిక చెబితే అక్కడకు చెప్పిన సమయానికి వస్తా. గడచిన ఐదేళ్లలో తప్పులు చేసిన వ్యక్తులను వదిలేది లేదు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారుల పేర్లు, అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకుల పేర్లు రెడ్ బుక్‌లో ఉన్నాయి. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక న్యాయవిచారణ జరిపి దోషులను జైలుకు పంపిస్తాం. ఆంధ్రకే కాదు.. దేశానికే సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖ. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్ర ఆర్థిక రాజధానిగా చేశారు. వైసీపీ పాలకులు నేడు గంజాయి కేపిటల్‌గా మార్చారు. నేను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు విశాఖకు నెలకు రెండు కంపెనీలు తీసుకొస్తే.. నేడు వారానికో కిడ్నాప్, భూ కబ్జా, మర్డర్ జరుగుతున్నాయి. కోడిగుడ్డు మంత్రి దెబ్బకు పరిశ్రమలు వెళ్లిపోతున్నాయి.

ఇవిగో జగన్ మోసాలు

నవరత్నాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చి.. తర్వాత జగన్ నవ మోసాలు చేశారు. జలయజ్ఞం చేస్తానని చెప్పి.. తట్టెడు మట్టి కూడా వేయలేదు. సంపూర్ణ మద్య నిషేధం చేసి మహిళలను ఓట్లు అడుగుతానని చెప్పిన పెద్ద మనిషి బూమ్‌బూమ్ దుకాణాలు పెట్టి ఎక్కడ చూసినా పుష్కలంగా మద్యం అమ్మడమే కాకుండా రోజుకు రూ.లక్ష వ్యాపారం చేయాలని సేల్స్‌మెన్‌కు లక్ష్యాలు నిర్దేశించారు. కల్తీ మద్యం తాగి లక్షలాది మంది చనిపోతున్నారు. రూ.1,000 దాటితే ఆరోగ్యశ్రీ అని చెప్పి.. ఇప్పుడు దానిని అనారోగ్యశ్రీ చేశారు. ఆస్పత్రులకు రూ.వెయ్యి కోట్లు బకాయి పెట్టారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారు. 45 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని నమ్మించి వంచించారు. పేదలకు 30 లక్షలు ఇళ్లు ఇస్తామని చెప్పి 3 వేలు కూడా కట్టలేని అసమర్థ సీఎం. టీడీపీ హయాంలో వెయ్యి రూపాయలు ఉండే టన్ను ఇసుక ధర జగన్ పాలనలో రూ.5 వేలకు పెరిగిపోయింది. పెరిగిన రూ.4 వేలలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నుంచి సీఎం వరకూ వాటాలు వెళ్తున్నాయి. వలంటీర్లను ఇంటింటికీ పంపించి ప్రజలు పీల్చే గాలికి కూడా పన్ను వసూలు చేయించే దుర్మార్గానికి సైతం వెనుకాడడు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అమ్మ ఒడి అని చెప్పి.. గద్దెనెక్కాక ఒకరికే పరిమితం చేశారు. ఇలా ప్రతి దాంట్లో మోసం చేశారు. వైసీపీ నవమోసాలపై జగన్ చర్చకు వస్తారా? ఆయన వైనాట్ 175 అని అంటున్నారు. మరి 'వైనాట్ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిలుపుదల', 'వైనాట్ పోలవరం ప్రాజెక్టు పూర్తి', వైనాట్ జాబ్ కేలెండర్.. వైనాట్ గ్రూపు-1,2 నోటిఫికేషన్.. వైనాట్ సంపూర్ణ మద్య నిషేధం అని ఎందుకు అనడం లేదు?

'ఐబీ' ఖర్చు 24 వేల కోట్లు

- కట్టేది ప్రభుత్వమా.. పిల్లలా..?
- ప్రపంచవ్యాప్తంగా ఐబీ స్కూళ్లు 5 వేలు
- ఒక్క మన రాష్ట్రంలోనే 58 వేల పాఠశాలల్లో ఎలా సాధ్యం: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని మొత్తం 58 వేల పాఠశాలల్లో దశలవారీగా ఐబీ విద్యా విధానం ప్రవేశపెడతామని సీఎం జగన్మోహన్‌రెడ్డి ఘనంగా ప్రకటించారు. ఈ విద్యా విధానాన్ని ఇన్ని వేల పాఠశాలల్లో పెట్టాలంటే రూ.24 వేల కోట్లు ఖర్చవుతుంది. ఇంత డబ్బు ప్రభుత్వం కడుతుందా? లేక పిల్లలు కట్టాలా..!' అని తెలుగుదేశం పార్టీ ప్రశ్నించింది. సోమవారం ఆ పార్టీ ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో కలిపి ఐబీ సిలబస్ అమల్లో ఉన్న పాఠశాలలు 5,000 మాత్రమే. ఈ ఒక్క రాష్ట్రంలో వేల సంఖ్యలో పాఠశాలల్లో అమలు చేయడం సాధ్యం కాదని తెలిసీ ప్రచారం కోసం సీఎం పాట్లు పడుతున్నారు. ఏదైనా పాఠశాలల్లో ఐబీ సిలబస్ పెట్టాలంటే దానికి సంబంధించిన అంతర్జాతీయ సంస్థ నుంచి అనుమతులు తీసుకోవాలి. మొదట రూ.3.75 లక్షలు చెల్లించి దరఖాస్తు పెట్టాలి. వాళ్లు పాఠశాలను పరిశీలించి తమ సిలబస్ వాడుకోవడానికి అనుమతి ఇచ్చిన తర్వాత గుర్తింపు కోసం మళ్లీ రూ.7.70 లక్షలు కట్టాలి. పూర్తిస్థాయి గుర్తింపు వచ్చేవరకూ ఏటా రూ.7.70 లక్షలు చెల్లిస్తూనే ఉండాలి. దీనికితోడు ఆథరైజేషన్ కోసం మరో రూ.3.25 లక్షలు చెల్లించాలి. ఆథరైజేషన్ రెన్యువల్ కోసం ఏటా రూ.7.50 లక్షలు చెల్లించాల్సిందే. ఇవి ప్రాథమిక పాఠశాలకు చెల్లించాల్సిన ఫీజులు. ఇవన్నీ కలిపితే సుమారు రూ.30 లక్షలు అవుతాయి. విద్యార్థులకు నిర్వహించే పరీక్షల కోసం సబ్జెక్టుల వారీగా మళ్లీ ఏటా చెల్లించాలి. ఇవన్నీ కలిపితే ఒక్కో పాఠశాలకు ఖర్చు రూ.50 నుంచి రూ.70 లక్షల వరకూ ఉంటుంది. ఇంత డబ్బు ఎవరు చెల్లించాలి? ఇంత చెల్లిస్తే విద్యార్థులకు వచ్చే లాభం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఊరికే ఐబీ పేరుతో ప్రచారార్భాటం చేస్తున్నారు' అని ఆయన విమర్శించారు. ఐబీ విద్యా విధానం అమల్లో ఉన్న స్కూళ్లలో ఎల్‌కేజీ విద్యార్థికి ఏడాదికి రూ.మూడు లక్షలు ఖర్చవుతోంది. ఇంత డబ్బు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు చెల్లించగలరా? ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలలు రాష్ట్రంలో కేవలం 12 మాత్రమే ఉన్నాయి. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఒకే ఒక్క పాఠశాలలో ఉంది. ఈ సిలబస్ చెప్పే స్థాయి మన ఉపాధ్యాయులకు ఉందా? దానిని అంది పుచ్చుకోగల స్థితిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నారా? ఎవరితోనూ చర్చించకుండా ఎవరో ఏదో చెప్పగానే వైసీపీ ప్రభుత్వం దానిని అమలు చేయడానికి పరుగులు తీస్తోంది. చివరకు చతికిలబడుతోంది' అని వ్యాఖ్యానించారు. అధికారం చివరి రోజుల్లో ఇటువంటి పిచ్చి నిర్ణయాలను ముఖ్యమంత్రి ఎలా తీసుకొంటారని ఆయన ప్రశ్నించారు. ఎడెక్స్ కోర్సుల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడి కూడా ఇదే మాదిరిగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. 'ఎడెక్స్ అనే సంస్థ లాభం కోసం పనిచేసే కంపెనీ. అందులో కొన్ని ఉచిత కోర్సులు ఉంటాయి. వాటికి ఏ సర్టిఫికెట్లూ ఇవ్వరు. సర్టిఫికెట్ కావాలంటే డబ్బులు చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం స్వయం అనే పోర్టల్ ద్వారా అనేక కోర్సులు ఉచితంగా ఇస్తోంది. ఏ టెండర్లు లేకుండా ఎడెక్స్ సంస్థను ఎంపిక చేసి దానికి రూ.50 కోట్లు ఎలా చెల్లిస్తారు? దీనిపై సీఎం సమాధానం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

లెక్కలు తేలక.. అలజడి!

- రోజంతా ఐప్యాక్ బృందంతో జగన్ సమీక్ష
- రీసర్వే ఫలితాలపై మంతనాలు
- కొందరు సిటింగ్‌లకు టికెట్లపై తర్జనభర్జన
- కొడాలి నాని, వల్లభనేని వంశీకీ డౌటే!
- నానిని గన్నవరానికి పంపుతారని సీఎం సొంత మీడియాలో ప్రచారం
- తాజాగా తెరపైకి ముద్దరబోయిన!
- బెజవాడ లోక్‌సభకు మళ్లీ వంశీ?
- ఇటీవలే కేశినేని నాని పేరు ప్రకటన
- దీంతో ఇరు వర్గాల్లో అయోమయం



అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలనూ గెలుస్తామని గొప్పలు చెప్పుకొంటున్న సీఎం జగన్మోహన్‌రెడ్డికి వాస్తవ సర్వేల ఫలితాలు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇవన్నీ టీడీపీ-జనసేన కూటమి విజయం సాధిస్తుందని చెబుతున్నాయని.. జగన్ సొంత సర్వేల్లోనూ ఇదే తరహా ఫలితాలు వస్తున్నాయని వైసీపీ వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. ఇటు ఈ సర్వేలు, అటు టీడీపీ-జనసేన కూటమితో పొత్తు దిశగా వడివడిగా బీజేపీ అడుగులు వేస్తోందన్న వార్తలు ఆయనలో అలజడి రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐ-ప్యాక్ బృందంతో సీఎం సోమవారం రోజంతా మంతనాలు జరిపారు. అభ్యర్థుల ఎంపికలో భాగంగా 60 అసెంబ్లీ.. 14 లోక్‌సభ స్థానాలకు ఇన్‌చార్జులను నియమించిన ఆయన.. ఇప్పుడు మరోసారి వారి జయాపజయాలపై రీ-సర్వే చేయిస్తున్నారు. ఐ-ప్యాక్ బృందమే ఇందుకు పూనుకుంది. దాని సర్వేలపై సోమవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కొన్ని స్థానాల్లో మార్పుచేర్పులపై ఒక స్పష్టతకు వచ్చారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొందరు ఇన్‌చార్జులు గందరగోళానికి గురవుతున్నారు. జగన్‌కు అత్యంత నమ్మకస్తుడైన మాజీ మంత్రి కొడాలి నానికి గుడివాడ అసెంబ్లీ టికెట్ దక్కుతుందా లేదా అనే సందేహాలు తాజాగా నెలకొన్నాయి. గుడివాడ వైసీపీ అభ్యర్థిగా తానే పోటీచేస్తున్నానంటూ ఆ పార్టీ నేత మండల హనుమంతరావు పేరిట సోమవారం గుడివాడలో ఫ్లెక్సీలు వెలిశాయి. ఇది నాని వర్గీయుల్లో కలవరం రేపింది. దీనికితోడు సీఎం సొంత, కూలి మీడియాలో కూడా ఆయనకు అక్కడ టికెట్ రాదని.. ప్రత్యామ్నాయంగా గన్నవరం అభ్యర్థిగా పంపుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. ఈ సమయంలోనే మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నూజివీడు ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సోమవారం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డిని కలిశారు (ముద్దరబోయిన గతంలో కాంగ్రెస్ తరఫున గన్నవరంలోనే గెలిచారు). ఈయనకే వైసీపీ టికెట్ ఖరారైనట్లు ప్రచారం జోరందుకోవడంతో.. టీడీపీ నుంచి గెలిచి వైసీపీ పంచన చేరిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పరిస్థితి డోలాయమానంలో పడింది. పైగా ఆయన్ను మళ్లీ విజయవాడ ఎంపీగా పంపుతారని ప్రచారం మొదలైంది. ఇప్పటికే అక్కడ కేశినేని నానిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పుడు మళ్లీ వంశీ పేరు తెరపైకి రావడంతో రెండు వర్గాల్లోనూ ఆందోళన నెలకొందని వార్తలు వస్తున్నాయి. కాగా.. మండపేట ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు.. తాజాగా తనకు తన సొంత నియోజకవర్గమైన రామచంద్రపురమే కావాలని పట్టుబడుతున్నారు. ఆయన కూడా సోమవారం సీఎంవోకు వచ్చారు. కుప్పం అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్, మరో ఎమ్మెల్సీ మాధవరావు, కమలాపురం, నూజివీడు, గిద్దలూరు, మాచర్ల, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథరెడ్డి, మేకా వెంకట ప్రతాప అప్పారావు, అన్నా రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బడ్డుకొండ అప్పలనాయుడు కూడా వచ్చి సజ్జలను, ధనుంజయరెడ్డిని కలిశారు.

మళ్లీ ఢిల్లీకి జగన్?

- ప్రధాని అపాయింట్‌మెంట్ కోరిన సీఎం!

మరోసారి ఢిల్లీ పెద్దలను కలవాలని సీఎం జగన్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రధాని మోదీని అపాయింట్‌మెంట్ కూడా కోరినట్లు సమాచారం. రేపో మాపో ఎప్పుడు సమయం ఖరారైతే అప్పుడు ఢిల్లీ బయల్దేరేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాస్తవానికి టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 7వ తేదీ రాత్రి ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసి పొత్తు చర్చలు జరిపిన వెంటనే.. జగన్ 9వ తేదీన ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసిన సంగతి తెలిసిందే. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపై ఆరా తీయడంతో పాటు తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. కేంద్రానికి అన్ని విధాలుగా అందిస్తున్న సహకారం గురించి ప్రధాని వద్ద సీఎం ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగింది. ఆయన చెప్పినదానిపై మోదీ స్పందించకుండా మౌనంగా ఉండిపోయారని బీజేపీ వర్గాలు కూడా వెల్లడించాయి. ఆ తర్వాత టీడీపీతో పొత్తువైపే బీజేపీ అడుగులు పడుతున్నట్లు కనిపిస్తుండడంతో మరోసారి ఢిల్లీ పెద్దలతో మాట్లాడాలని జగన్ నిర్ణయించినట్లు సమాచారం. 'ఇండియా టుడే' సర్వేలో వైసీపీకి 8 ఎంపీ సీట్లే వస్తాయని తేలడంతో.. ఆ పార్టీతో జట్టుకట్టేందుకు బీజేపీ పెద్దలు ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వం వచ్చాక అన్ని పదవుల్లో వాటా

- పార్టీకి పనిచేసిన వారికి గౌరవం
- జనసేన కూటమి విజయం ఖాయం
- అవసరమైతే త్యాగాలు తప్పవు: పవన్
- పార్టీకి 10 కోట్లు విరాళం



విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో విస్పష్టమైన తీర్పు ఇవ్వబోతున్నారని, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరి కీ సముచిత గౌరవం దక్కేలా చూసే బాధ్యత తనదని, ఈ ఐదేళ్లూ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాయకులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మూడు రోజుల విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. పవన్ మాట్లాడుతూ.. కూటమిని విజయం దిశగా నడిపించేందుకు క్షేత్రస్థాయిలో బలంగా పనిచేయాలని సూచించారు. ఈసారి వ్యక్తిగతమైన గెలుపు కంటే సమష్టి విజయం కోసమే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అవసరమైతే త్యాగాలకు కూడా సిద్ధంగా ఉండాలన్నారు. పొత్తు లో భాగంగా అన్నింటా మూడో వంతు జనసేనకు స్థానాలు లభిస్తాయన్నారు. సాధారణ ఎన్నికల్లోనే కాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వచ్చే అవకాశాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. స్థానిక ఎన్నికలు, ప్రాథమిక సహకార సంఘాలు, ఇతర కీలక నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానాలు జనసేనకు వస్తాయన్నారు. పార్టీకి పనిచేసిన వారిని విస్మరించే అవకాశం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సుస్థిర పాలన అవసరమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొనే కూటమి నిర్ణయాలు తీసుకుంటుందని వివరించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎటువంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని స్పష్టంచేశారు. పార్టీ బలోపేతం కోసం, ఎన్నికల నిర్వహణకు తన కష్టార్జితం నుంచి రూ.10 కోట్లు పార్టీ నిధిగా ఇస్తున్నట్టు పవన్ ప్రకటించారు.

వలంటీర్లూ.. మీరు కూలీలేనట

- మిమ్మల్ని జగన్ మోసం చేశాడు .. వెనుక పెద్ద కుట్ర జరుగుతోంది
- మీరు సేకరించిన డేటా ఎఫ్ఓఏకు.. డేటా చౌర్యం కేసు పెడితే బలయ్యేది మీరే .. జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్



తెనాలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లను కటకటాలపాలు చేసేందుకు వైసీపీ ప్రభుత్వం భారీ కుట్ర చేస్తోందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. వలంటీర్ల వ్యవస్థ పేరు చెప్పి రూ.7,800 కోట్ల భారీ దోపిడీ చేయడ మే గాక డేటా చౌర్యం వంటి హైటెక్ నేరాలకూ పాల్పడ్డారని, భవిష్యత్‌లో వీటిపై కేసులు నమోదయితే వలంటీర్లనే బలిచేసేందుకు జగన్ పెద్ద కుట్రే పన్నారన్నారు. నమ్మిన నిరుద్యోగ యువతకు జగన్ నమ్మక ద్రోహం చేశారని, ఈ కుట్రను ఆధారాలతో సహా బయటపెడుతున్నట్టు చెప్పారు. సోమవారం గుంటూరు జిల్లా తెనాలిలో మాట్లాడారు. అధికారికంగా గ్రామ, వార్డు సచివాలయ చట్టంలో ఎక్కడా వలంటీర్ అనే పదమే లేదన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రొఫెషనల్ అండ్ కాంట్రాక్చువల్ సర్వీసెస్ పేరుతో జగన్ సర్కారు దోపిడీకి తెగబడిందన్నారు. "వలంటీర్లకు గౌరవ వేతనం పేరుతో రోజుకు రూ.167 కూలి ఇచ్చి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. 1,02,836 మంది వలంటీర్ల డేటానే అసలు అప్‌లోడ్ కాలేదు. ఎక్కడో హైదరాబాద్‌లో ఉందంటూ అడ్రస్ కూడా బయట పెట్టని 'ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ'(ఎఫ్ఓఏ) పేరుతో ఆ సంస్థ కిందే వీరంతా పనిచేస్తున్నట్టు చూపారు. వీరందరికీ వేతనాలు, ఇతర ఖర్చుల కింద ఏటా రూ.1560 కోట్లు ఈ సంస్థకే దోచిపెట్టారు. ఐదేళ్లలో ఈ రూపంలో దోచుకున్నది మొత్తం రూ.7,800 కోట్లు. ఇదంతా ఎవరి జేబుల్లోకి మళ్లించారో తేలాల్సి ఉంది. వలంటీర్లంతా సేకరించిన జనం డేటా మొత్తం ఎఫ్ఓఏకు వెళ్లిపోతోంది. రేపటి రోజున డేటా చౌర్యం కేసు నమోదయితే, వలంటీర్లనే దోషులను చేసి, తాను, తన అడ్రస్ లేని సంస్థ పదిలంగా ఉండేందుకు జగన్ కుట్రపన్నారు. వలంటీర్లు దీనిని గుర్తించాలి. వలంటీర్లపై మాకు ఎటువంటి వ్యక్తిగత ద్వేషం లేదు. అసలు ఎఫ్ఓఏ అనేది ఉందా? హైదరాబాద్‌లో దీని అడ్రస్ ఎక్కడ? అత్యంత రహస్యంగా ఉంచాల్సిన జనం డేటాను ప్రభుత్వం వారికి ఎందుకు అప్పగిస్తుంది? వీటన్నిటికీ జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. జనసేన, టీడీపీ ప్రభుత్వం వచ్చాక దీని వెనకున్న కుట్రదారులను బయటకు లాగుతాం" అని మనోహర్ అన్నారు. వలంటీర్లను అవమానించామంటూ పెట్టిన కేసులో పవన్ కోర్టుకు హాజరవుతారని, వలంటీర్ వ్యవస్థ వెనకున్న అవినీతి కుట్రలన్నీ కోర్టు సాక్షిగానే బయటకు వస్తాయన్నారు.

నత్తనడకన క్రమబద్ధీకరణ!

- మొత్తం అర్హులు 10,586 మంది
- ఆర్థిక శాఖకు చేరింది 1,254 మంది వివరాలే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న సర్వీసు క్రమబద్ధీకరణ ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయండని చెబుతున్నా, ఆచరణలో మాత్రం ఆ జోరు కనపడటం లేదు. చాలా ప్రభుత్వ శాఖలు అసలు ఇంతవరకు దరఖాస్తులను డీడీఓ(డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్) స్థాయిలోనే అప్‌లోడ్ చేయలేదు. ఒకటి, రెండు శాఖలు దరఖాస్తులను అప్‌లోడ్ చేసినా, అవి ఇంతవరకు ఆర్థిక శాఖకు చేరలేదు. రేపో మాపో ఎన్నికల కోడ్ రాబోతుందని ప్రచారం జరుగుతున్న తరుణంలో వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ నత్తనడకన సాగడం అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ ప్రక్రియకు గతేడాది అక్టోబరులో శ్రీకారం చుట్టారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు 2023 అక్టోబరు 20న గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 10,586 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయ్యేందుకు అర్హులు. గత రెండు నెలలుగా అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులు దరఖాస్తులను అప్‌లోడ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అయినప్పటికీ ఆర్థిక శాఖ వద్దకు 1,254 మంది అభ్యర్థుల వివరాలు మాత్రమే చేరాయి. వివిధ ప్రభుత్వ శాఖలు అసలు ఒక్క దరఖాస్తును కూడా ఇంతవరకు అప్‌లోడ్ చేయలేదని అధికారులు రూపొందించిన నివేదిక బహిర్గతం చేసింది. ఇంటర్మీడియట్ విద్యాశాఖలో 3,593 మంది అర్హులైన అభ్యర్థులు ఉండగా, 1,461 మంది వివరాలే అప్‌లోడ్ చేశారు. అందులో ఆర్థిక శాఖకు 20 మంది అభ్యర్థుల దరఖాస్తులు మాత్రమే చేరాయి. ప్రభుత్వం నిర్దేశించిన 25 శాఖల్లో అర్హత పొందిన కాంట్రాక్టు ఉద్యోగుల దరఖాస్తులు ఇంతవరకు డీడీవో స్థాయిలోనే చక్కర్లు కొడుతుండటం అధికారుల నిర్లిప్తతకు దర్పణం పడుతోంది.


నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయింపు


వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జర్నలిస్టులు, అఖిలపక్ష నేతలతో నిరసన



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు


విజయవాడలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన

సిగ్గు సిగ్గు

జర్నలిస్టులపై దాడులకేనా 'సిద్ధం'?

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం
- రాష్ట్రమంతా రగిలిన జర్నలిస్టులు
- ధర్నాల్లో పాల్గొన్న టీడీపీ, లెఫ్ట్, జనసేన, బీజేపీ, సంఘాలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉందా? లేక నియంత పాలన సాగుతోందా? చివరకు ముఖ్యమంత్రి సభల్లో పాల్గొనే జర్నలిస్టులకు కూడా రక్షణ కరువైంది. వైసీపీ రౌడీమూకల దాడిని ప్రభుత్వం ఖండించాలి. తక్షణం నిందితులను అరెస్టు చేసేలా డీజీపీ చర్యలు తీసుకోవాలి" అంటూ జర్నలిస్టులు ముక్తకంఠం వినిపించారు. జర్నలిస్టులపై దాడులు చేయడానికేనా 'సిద్ధం' అంటున్నారని ఆగ్రహించారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రమంతా జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే నేతృత్వంలో విజయవాడలో పెద్దసంఖ్యలో పాత్రికేయులు రోడ్డెక్కారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేసిన విషయం తెలిసిందే. 'మీరు ఆంధ్రజ్యోతా' అని అడుగుతూ, ఎంచుకొని మరీ శ్రీకృష్ణను వెంటబడి కర్రలతో కొట్టారు. ఈ దాడి జరిగి 24 గంటలు దాటిపోయినా, ఇంతవరకు నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదు. విజయవాడలో జరిగిన నిరసన కార్యక్రమంలో దాడి దృశ్యాలను ప్రదర్శిస్తూ, వైసీపీ మూకల దాడులను నిరసిస్తూ జర్నలిస్టులు ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, సీనియర్ నాయకులు ఎస్కే బాబు, మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో తెచ్చిన విధంగా జర్నలిస్టులపై దాడుల నివారణకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో జర్నలిస్టు నాయకులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ సర్కిల్ వద్ద వామపక్ష నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఆర్డీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తదితర నేతలు రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అంబేడ్కర్ జంక్షన్ వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి జర్నలిస్టులు, ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన తెలిపారు.

ఆగ్రహించిన అనంత

శ్రీకృష్ణపై దాడి వైసీపీ గూండాల పాశవిక చర్య అంటూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, వామపక్షాలు, రాజకీయ పార్టీలు ఆగ్రహించాయి. అనంతపురం నగరంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఉరవకొండ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ తదితరులు ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో అనంతపురం సిటీలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నుంచి ఎస్పీ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు క్లాక్ టవర్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొయుద్దీన్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. చిత్తూరులో కలెక్టరేట్ ఎదుట చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాత్రికేయులు...డీఆర్వో పుల్లయ్యకు వినతి పత్రాన్ని అందించారు. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పూతలపట్టులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ పాత్రికేయుల నిరసనలకు మద్దతు పలికారు.

హోరెత్తిన నిరసనలు...

ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ప్రజా సంఘాలతో కలిసి నంద్యాల-చిత్తూరు రహదారిపై రాస్తారోకో చేపట్టి.. శ్రీకృష్ణపై దాడిని ఖండించారు. అనంతరం కలెక్టర్ కే.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. తిరుపతిలో వివిధ జర్నలిస్టు సంఘాలు ప్రెస్ క్లబ్ నుంచీ ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద గాంధీ విగ్రహం కూడలి వరకూ భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. సంఘీభావంగా టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం,కాంగ్రెస్ పార్టీల నేతలు పాల్గొన్నారు. మహాత్ముడి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లతో గంట పాటు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

తక్షణం అరెస్టు చేయాలి

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టు సంఘాలు సోమవారం డిమాండ్ చేశాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేశారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై అమానుషంగా దాడి చేసిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, తాళ్లపూడి, అనపర్తి మండలాల్లో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన చేశారు.

మేము సైతం

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఏపీయూడబ్ల్యూజే కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, టీడీపీ, వామపక్ష పార్టీలు నిరసన తెలిపాయి. కడప, అన్నమయ్య జిల్లాల్లో వర్కింగ్ జర్నలిస్టులు, పలు రాజకీయ పార్టీల నాయకులు రోడ్డెక్కారు. కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలు, తాహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. వినతిపత్రాలు అందజేశారు. కడపలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, చిన్నపత్రికల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి ఇతర మీడియా సిబ్బంది హాజరై సంఘీభావం తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌని పల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చీర్ల శ్రీనివాసయాదవ్, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టీ.ఈశ్వర్, జనసేన, ఎంఆర్‌పీఎస్, గిరిజన సమాఖ్య నేతలతోపాటు పెద్ద సంఖ్యలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి 'స్పందన' కార్యక్రమంలో ఉన్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

దాడి ఉన్మాద చర్య: సత్యకుమార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ పై వైసీపీ మూకల దాడిని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం అత్యంత ఉన్మాద చర్య అని సోమవారం ట్వీట్ చేశారు. రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్ సభను కవర్ చేయడానికి వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమని, దీనిని ప్రతిఒక్కరూ ఖండించాలని సత్యకుమార్ పేర్కొన్నారు. సిద్ధం అంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికో, సంక్షేమానికో కాదని, వ్యవస్థలపై దాడులకు సిద్ధమని సీఎం జగన్ నిరూపించారని మండిపడ్డారు.


అపోలో ఆస్పత్రికి వచ్చిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను వీల్‌చైర్‌లో లోపలికి తీసుకెళ్తున్న సిబ్బంది

శ్రీకృష్ణకు అపోలోలో చికిత్స

- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలింపు

అనంతపురం, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో ఆదివారం వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. దాడి తర్వాత ఆయనను అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు సోమవారం ఉదయం ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. సీఎం జగన్ పాల్గొన్న 'సిద్ధం' సభలో ఫొటోలు తీస్తున్న శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విరుచుకుపడి.. తల, మెడ, వీపు, ఛాతీ భాగంలో విచక్షణా రహితంగా కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. సొమ్మసిల్లి పడిపోయినా వదలకుండా బూటు కాళ్లతో రాక్షసంగా తన్నారు. అక్కడనుంచి శ్రీకృష్ణను తీసుకెళ్లడానికి ప్రయత్నించిన సీఐపైనా దాడికి యత్నించారు. శ్రీకృష్ణను తరలిస్తున్న పోలీస్ వాహనంపై రాళ్ల వర్షం కురిపించారు. కాగా, హైదరాబాద్‌కు తరలించే ముందు ఆస్పత్రిలో శ్రీకృష్ణను మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి తదితరులు పరామర్శించారు.

సీఎం క్షమాపణ చెప్పాలి: రఘువీరా

మడకశిర టౌన్, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యుడు రఘువీరారెడ్డి ఖండించారు. సోమవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో దాడులు సరైన పద్ధతి కాదన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ సీఎం జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పత్రికల్లో పనిచేస్తున్న ఫొటోగ్రాఫర్లు, విలేకరులపై దాడి చేయడం దిగజారుడు తనమేనన్నారు. దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకృష్ణ వైద్యానికయ్యే ఖర్చులు వైసీపీ భరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్.. శ్రీకృష్ణకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దేనిమీదైనా చర్చిస్తా!

- జగన్‌రెడ్డీ.. నువ్వు సిద్ధమా..!
- 'ఎక్స్' వేదికగా మరోసారి చంద్రబాబు చాలెంజ్

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'సామాజిక న్యాయానికి నిలువునా శిలువ వేసి... బాదుడు పాలనతో ప్రజల రక్తం పీల్చేసి... విధ్వంస పోకడలతో రాష్ట్ర భవిష్యత్‌ను కూల్చేసి.. ఇప్పుడు నువ్వు ర్యాంప్ వాక్ చేసి అబద్ధాలు చెబితే ప్రజలెలా నమ్ముతారు జగన్‌రెడ్డీ?' అని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. సోమవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'నీకు, నీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇంకా 50 రోజులే. రెక్కలు ఊడిపోయిన ఫ్యాన్‌ని విసిరిపారేయడానికి జనం సిద్ధంగా ఉన్నారు. వరం ఇచ్చిన శివుడినే బూడిద చేయాలనుకున్న భస్మాసురుడి గతే నీకూ పడుతుంది. బూటకపు ప్రసంగాలు కాదు... అభివృద్ధి పాలన ఎవరిదో... విధ్వంసం ఎవరిదో జనం ముందు చర్చిద్దాం. దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు రా..! ప్లేస్, టైమ్ నువ్వే చెప్పు. ఎక్కడికైనా వస్తా... దేనిమీదైనా చర్చిస్తా! నువ్వు సిద్ధమా.. జగన్‌రెడ్డీ?' అని చంద్రబాబు మరోసారి చాలెంజ్ చేశారు.

రేపు విశాఖ పర్యటనకు జగన్

- శారదాపీఠంలో రాజశ్యామల దర్శనం

అమరావతి/విశాఖపట్నం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖపట్నం పర్యటనకు వెళ్తున్నారు. శ్రీ శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకోనున్నారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి ఆయన విశాఖపట్నం చేరుకుంటారు. విశాఖ విమానాశ్రయం నుంచి నేరుగా చినముషిడివాడలో గల శారదా పీఠానికి వెళ్లి పీఠం వార్షికోత్సవంలో పాల్గొంటారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి విజయవాడ బయలుదేరతారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇటీవల ఉండవల్లిలోని తమ నివాసంలో రాజశ్యామల యాగం చేసిన సంగతి తెలిసిందే. మూడురోజుల తర్వాత జగన్ రాజశ్యామల అమ్మవారి దర్శనానికి విశాఖ వెళ్తున్నారు.

వాళ్లు వైసీపీ గూండాలే..!

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసినవారిని ఫొటోలు, వీడియోల ఆధారంగా గుర్తింపు

అనంతపురం క్రైం/కల్యాణదుర్గం, ఫిబ్రవరి 19 : ఆంధ్రజ్యోతి అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి దిగినవారు వైసీపీ గూండాలేనని తేలిపోయింది. దాడి జరిగి 24 గంటలు దాటిపోయినా ఇప్పటివరకూ పోలీసులు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు. కానీ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఫొటోలను, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమైన దృశ్యాలను చూసిన జనం... నిందితులను గుర్తించగలుగుతున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలో వారి నుంచి దీనికి సంబంధించిన సమాచారం బయటకు వచ్చింది. దాడి చేసినవారిలో మంత్రి ఉషశ్రీచరణ్ అనుచరుడు గొల్ల అశోక్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అనుచరుడు బండి రవి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుయాయి మిద్దె ఎర్రిస్వామి ఉన్నట్టు చెబుతున్నారు. అశోక్‌ది కల్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామం. తరచూ గొడవలు పడుతుంటాడు. వివాదాల్లో జోక్యం చేసుకుంటూ ఉంటాడు. మంత్రి అండతో రెచ్చిపోతుంటాడని స్థానికులు చెబుతున్నారు. కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. కల్యాణదుర్గం టౌన్, కంబదూరు పోలీస్‌స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయి. 2021 క్రైం నంబర్ 127 కింద బియ్యం అక్రమ రవాణా కేసు నమోదైంది. బండి రవిది శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కోనాపురం. రవి భార్య గ్రామంలో వలంటీరుగా పనిచేస్తున్నారు. చేనేత కార్మికుడిగా నకిలీ సర్టిఫికెట్ పొంది పింఛను తీసుకుంటున్నాడు. పెనుగొండలో ఓ మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడు. అధికార పార్టీ అండతో గ్రామం రజకులకు దోబీఘాట్ కోసం ఏర్పాటుచేసిన బోరుబావి నీటిని దౌర్జన్యంగా తన పొలానికి మళ్లించుకున్నాడు. ఎంపీటీసీ ఎన్నికల సమయంలో బూత్‌లోకి దూరి టీడీపీ ఏజెంట్లపై దాడిచేశాడు. సిద్ధం సభలో శ్రీకృష్ణపై కట్టెతో రవి దాడిచేస్తున్న దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. ఎర్రిస్వామిది అనంతపురం జిల్లా కూడేరు మండలం మరుట్ల 2వ కాలనీ. ఇతను గతంలో యానిమేటర్‌గా పనిచేశాడు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు ప్రణయ్‌రెడ్డికి అనుచరుడిగా ముద్ర వేసుకున్నాడు. మూడేళ్ల క్రితం పీర్ల పండుగలో బీసీ సామాజికవర్గానికి చెందిన వారిపై దాడి చేశాడు. తిరిగి వారిపైనే కేసు పెట్టించాడు. కల్యాణదుర్గం నియోజకవర్గం బోయలపల్లికి చెందిన నాగేంద్ర, కిష్ట కూడా దాడిలో పాల్గొన్నారని స్థానికులు చెబుతున్నారు. వీరిద్దరూ కర్ణాటక మద్యాన్ని అక్రమంగా జిల్లాకు తెచ్చి విక్రయిస్తుంటారు.


శ్రీకృష్ణపై దాడిచేస్తున్న అశోక్ (ఫైల్), మంత్రి ఉష శ్రీచరణ్‌తో అశోక్ (ఫైల్)


దాడి చేస్తున్న మిద్దె ఎర్రిస్వామి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డితో మిద్దె ఎర్రిస్వామి

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం: ఎస్పీ

శ్రీకృష్ణపై దాడి అమానుషమని అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ అన్నారు. దాడి వీడియోను తాను చూశానని, 'వెరీ బ్యాడ్' అని వ్యాఖ్యానించారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ తనను కలిసి ఏపీయూడబ్ల్యూజే నేతల వద్ద ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దాడి ఘటన గురించి తనకు ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో తెలిసిందన్నారు. 'సిద్ధం' సభ రద్దీ కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయని, సమస్యను పరిష్కరించేందుకు తాను అక్కడే ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. అందువల్లే ఫొటోగ్రాఫర్‌పై దాడి ఘటన ఆలస్యంగా తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వీడియో ఆధారంగా దాడి చేసిన అందరిపైనా కేసు నమోదు చేస్తామని, అరెస్టు చేస్తామన్నారు. ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. "మీరు ప్రొఫెషనల్స్. మీ బాధ్యతలను మీరు నిర్వర్తించాల్సిందే. మీడియా మిత్రులుగా, ఫోర్త్ పిల్లర్‌గా మీ పని మీరు చేయాల్సిందే. నిష్పక్షపాతంగా, భయం లేకుండా మీ వృత్తి ధర్మాన్ని మీరు నిర్వర్తించాల్సిందే. అందుకు మేం మా మద్దతు, రక్షణ ఇస్తాం" అని తెలిపారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, పామిడిలో గతంలో జర్నలిస్టులపై దాడి చేసినవారిపై కేసులు నమోదు చేశామని గుర్తు చేశారు. ఏవిధంగా చూసినా ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానవీయమేనని స్పష్టం చేశారు. ప్రత్యేక సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామన్నారు. అంతవరకు గ్యారంటీ ఇవ్వగలనని తెలిపారు.

ప్రవీణ్‌ప్రకాశ్‌పై నివేదిక ఇవ్వండి

- ఎమ్మెల్సీ రఘువర్మ ఫిర్యాదుపై కేంద్రం ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వ్యవహారశైలి మరోసారి రచ్చకెక్కింది. పాఠశాల విద్యాశాఖలో బాధ్యతలు చేపట్టిన నాటినుంచి తరచూ జిల్లాల పర్యటనలు చేస్తూ, అధికారులు, ఉపాధ్యాయులను ఆయన హడలెత్తిస్తున్నారు. రాత్రి సమయాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్నారు. ఇది ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల కుటుంబాలకు కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన సెన్సేషన్ కోసం తాపత్రయపడుతున్నారని, ఆయన వ్యవహారశైలి అభ్యంతరకరంగా ఉందంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ నేరుగా ప్రధాన మంత్రి కార్యాలయానికి గతేడాది ఆగస్టులో ఫిర్యాదు పంపారు. దీనిపై స్పందించిన కేంద్రం.. ప్రవీణ్ ప్రకాశ్ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై సవివర నివేదిక పంపాలని పాఠశాల విద్యాశాఖను జీఏడీ ఈ నెల 14వ తేదీన ఆదేశించింది. పాఠశాల విద్యాశాఖకు ఆయనే బాస్ కావడంతో ఇప్పుడు ఎలాంటి నివేదిక పంపుతారనేది ఆసక్తికరంగా మారింది.

ఆయనది రహస్య అజెండా...

సీనియరు ఐఏఎస్ అధికారిగా ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ తరచూ సెన్సేషన్ కోసం తాపత్రయపడుతున్నారని, అందుకోసం మిగిలిన అధికారులతో పోలిస్తే అసాధారణంగా వ్యవహరిస్తున్నారని తన ఫిర్యాదులో రఘువర్మ తెలిపారు. "దీనివెనుక రహస్య అజెండా ఉందనేది బహిరంగ రహస్యం. ఆయన తనపాఠశాలల పర్యటనల్లో విద్యార్థుల ముందే టీచర్లను దూషిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటన పేరుతో నేరుగా విద్యార్థుల ఇళ్లకే వెళ్తున్నారు. రాత్రి 10 గంటల సమయంలోనూ ఇళ్లకు, కేజీబీవీలకు వెళ్లి నోట్ పుస్తకాల పరిశీలన అంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏవైనా లోపాలు గుర్తిస్తే వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయకుండా అక్కడే అధికారులు, టీచర్లను తిట్టడం, సస్పెండ్ చేయాలనే ఆదేశాలు ఇవ్వడం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోయినా దానికీ టీచర్లనే బాధ్యులను చేస్తున్నారు. రాష్ట్రంలోని 9వేల పాఠశాలల్లో ఒక్కో టీచరే ఉన్నారు. కానీ వారిపై బోధనేతర పనులు చాలా ఉన్నాయి. పిల్లల హాజరు, టాయిలెట్ల ఫొటోలు తీయడం, మధ్యాహ్న భోజనం పనులు, నాడు- నేడు పనులు లాంటి బాధ్యతలు టీచర్లపై పెట్టారు. కానీ ఇవేం పట్టించుకోకుండా రాత్రి తొమ్మిది గంటలప్పుడు ఇంటికి వెళ్లి విద్యార్థుల నోట్ పుస్తకాలు అడుగుతున్నారు. ప్రతి ఉద్యోగికీ వ్యక్తిగత జీవితం ఉంటుంది. అది లేకుండా ఉపాధ్యాయులను ప్రవీణ్ ప్రకాశ్ వేధిస్తున్నారు" అని తన ఫిర్యాదులో రఘువర్మ తెలిపారు.

ఉప లోకాయుక్తగా రజనీరెడ్డి

- అర్హతల సడలింపుతో లభించిన అవకాశం


అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్తగా పగిడి రజనీరెడ్డి నియమితులయ్యారు. సెలెక్షన్ కమిటీ సూచనల మేరకు గవర్నర్ ఆమోదంతో ఆమెను ఉప లోకాయుక్తగా నియమిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఐదేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రజనీరెడ్డి హైకోర్టులో దేవదాయ శాఖ కేసులను వాదిస్తున్నారు. లోకాయుక్త, ఉప లోకాయుక్త నియామకానికి గతంలో ఒక విధానం ఉండేది. హైకోర్టు చీఫ్ జస్టిస్ లేదా జస్టిస్‌గా పని చేసి రిటైరైన వారిని లోకాయుక్తగా, జిల్లా జడ్జిగా పనిచేసి రిటైరైన వారిని ఉప లోకాయుక్తగా నియమించే వారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సిఫారసు మేరకు... గవర్నర్ ఆమోదంతో నియామకం జరిగేది. ఈ పద్ధతిని జగన్ సర్కారు మార్చేసింది. హైకోర్టు సీజే ప్రమేయాన్ని తప్పించి... ముఖ్యమంత్రి, స్పీకర్, శాసన మండలి చైర్మన్, విపక్ష నేతతో సెలెక్షన్ కమిటీని నియమించారు. '25 ఏళ్ల అనుభవమున్న న్యాయవాదిని కూడా ఉప లోకాయుక్తగా నియమించవచ్చు' అంటూ కొత్త అర్హతలను నిర్దేశించారు. ఈ పోస్టు కోసం పలువురు రిటైర్డ్ జిల్లా జడ్జిలు, ఆ అర్హతతో ఇప్పటికే పలు హోదాల్లో పని చేసిన వారు, సీనియర్ న్యాయవాదులు అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే... సెలెక్షన్ కమిటీ పి.రజనీ రెడ్డిని ఎంపిక చేసింది. ఆలస్యంగా సమాచారం ఇవ్వడంతో ఈ కమిటీ సమావేశానికి విపక్ష నేత చంద్రబాబు హాజరు కాలేదు.

మిలాన్ సందడి మొదలు

- విశాఖలో 27 వరకు 2 దశల్లో కార్యక్రమాలు
- నేడు ఆరోగ్య నడక, ఆగ్రా పర్యటన, సబ్‌మెరైన్ రక్షణ డెమో

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బహుళ దేశాల నౌకాదళ విన్యాసాలకు విశాఖపట్నం వేదికైంది. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిలాన్-2024' సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. విశాఖలో ఈ నెల 27వ తేదీ వరకూ రెండు దశల్లో జరిగే ఈ వేడుకలో 50 దేశాలకు చెందిన నౌకాదళ సిబ్బంది, వారి యుద్ధనౌకలు, యుద్ధవిమానాలు పాల్గొంటున్నాయి. తొలిరోజైన సోమవారం మేరీటైమ్ వెల్ఫేర్ సెంటర్‌లో నేవీ అధికారులంతా కలిసి సముద్ర విన్యాసాలపై చర్చించారు. వివిధ దేశాల ప్రతినిధులు ఒకరికొకరు పరిచయం చేసుకుని, ఆయా దేశాల ప్రాధాన్యతలను వివరిం చారు. భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ... నేవీ ఇప్పటివరకూ నిర్వహించిన కార్యక్రమాల్లో ఇది (మిలాన్-24) అతి పెద్దదని పేర్కొన్నారు. మిలాన్‌లో పాల్గొనాలని 58 దేశాలకు ఆహ్వానం పంపగా 50 దేశాలు స్పందించాయన్నారు. జాతీయ అవసరాలు, సముద్ర తీర ప్రాంతాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.




విశాఖ తీరంలో నేవీ హెలికాప్టర్ల సాహస విన్యాసాలు

నేడు ఫుల్ డ్రెస్ రిహార్సల్స్

మిలాన్-2024 ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌కు సంబంధించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్ మంగళవారం ఆర్కే బీచ్ రోడ్డులో జరగనుంది. దీని కోసం భారత నౌకాదళం, వివిధ దేశాల సిబ్బంది మూడు రోజులుగా బీచ్‌లో రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. అవి సోమవారం కూడా జరిగాయి. ఇండియన్ కోస్టుగార్డు, రాష్ట్ర పోలీసులు, సీ కేడెట్లు, నేవల్ కేడెట్లతో పాటు అన్ని దేశాల నేవీల ప్రతినిధులు పాల్గొని మార్చ్ ఫాస్ట్ చేశారు. వివిధ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కొత్తగా వచ్చిన సీహాక్ హెలికాప్టర్లు, చేతక్‌లు సముద్రంలో మునిగిపోయిన వారిని రక్షించడం, మెరైన్ కమెండోలు పారాచూట్ల సాయంతో ఆకాశంలో చక్కర్లు కొడుతూ సురక్షితంగా బీచ్‌లో దిగడం, జెమిని బోట్ల సాయంతో తీరం చేరడం, అక్కడి శత్రువులపై దాడి చేయడం వంటి ప్రదర్శనలు చేశారు. కాగా, హార్బర్ ఫేజ్‌లో భాగంగా రెండో రోజైన మంగళవారం డాల్ఫిన్ కొండ నుంచి యారాడ కొండ వరకు ఆరోగ్య నడక నిర్వహిస్తారు. పర్యాటక ప్రాంతాల సందర్శనకు పలువురిని ఆగ్రాలో తాజ్‌మహల్ సందర్శనకు తీసుకువెళతారు. యంగ్ ఆఫీసర్లకు మార్గదర్శనం చేస్తారు. హిందూస్థాన్ షిప్‌యార్డులో సబ్‌మెరైన్లను ఎలా రక్షించాలి అనేఅంశంపై ప్రదర్శన ఉంటుంది. సముద్ర విన్యాసాలపై మరోసారి చర్చిస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం

● ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ధర్నాచౌక్, ఫ్రిబవరి 19: తమ పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాల్లో 99శాతం అమలు చేశామని రాప్తాడు 'సిద్ధం' సభలో సీఎం జగన్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. వీఆర్ఏలకు జీతం పెంపు, రికవరీ చేసిన డీఏ నగదును తిరిగి చెల్లించడం వంటి హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. స్థానిక ధర్నాచౌక్‌లో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు చేపట్టిన రిలే నిరహారదీక్షను 2వ రోజు సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్ఏల జీతాలు పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి. అంజి, కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష నేతగా సీఎం జగన్ మన ప్రభుత్వం వచ్చిన వారంలో వీఆర్ఏల జీతం రూ.15వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే తగిన గుణపాఠం చెప్పేందుకు వీఆర్ఏలు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రైల్వే స్థలం, ఇళ్లపట్టాల పరిస్థితి ఏంటి?

● వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ ఆసిఫ్‌కు స్థానికుల నిరసన సెగ ● సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిన వైనం

పాతరాజరాజేశ్వరి పేట, ఫ్రిబవరి 19: గత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు రైల్వే స్థలంలోని ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయించి ఇంటిపట్టాలు అందజేస్తామని హామీలిచ్చి గెలిచాక ఇంతవరకు తమకు న్యాయం జరగలేదని వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్‌ను స్థానికులు ప్రశ్నించారు. స్థానిక 56వ డివిజన్, పాతరాజరాజేశ్వరి పేటలో సోమవారం షేక్ ఆసిఫ్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తున్న ఆయనకు స్థానికులు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. కొన్నేళ్ల నాటి సమస్య అయిన రైల్వే స్థలం ఇళ్ల పట్టాల ఇంత వరకు అందించలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ యలకల చలపతిరావు ఎన్నికల్లో హామీలిచ్చి గెలిచాక మళ్లీ పట్టించుకోవడం లేదన్నారు. దాదాపు ఐదేళ్లు గడిచినా, మరో ఎన్నికలు కూడా వచ్చేస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కరించలేదని వారు నిలదీశారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. లాగే ఎర్రకట్ట వెంబడి డ్రెయిన్ సమస్య నెలల తరబడి ఉన్నా పట్టించుకునే వారు లేరని, డ్రెయిన్‌పై చప్టాలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దోమలు పెరగడం, మురుగు సమస్యలు నెలకొంటున్నాయని స్థానిక నేతలకు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మిని ప్రశ్నించారు. దీంతో సమస్యను పరిష్కరిస్తామని అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఎన్నికలు మళ్లీ రావడంతో తిరిగి తమను మోసం చేయడానికి మళ్లీ వస్తున్నారని, రైల్వే స్థలం ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరిస్తామని, డ్రెయిన్ సమస్యలను తొలగిస్తామని మళ్లీ ఇళ్ల ముందుకు వస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

స్థానిక 56వ డివిజన్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.31.27 లక్షల మున్సిపల్ సాధారణ నిధులు మంజూరయ్యాయని మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. ఈ మేరకు సోమవారం బీటీ రోడ్డు నిర్మాణ నిమిత్తం మేయర్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. పాతరాజరాజేశ్వరి పేట ర్యాంపు డౌన్ నుంచి రైల్వే గేటు వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. నేతలు షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ చలపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

స్పందన రద్దయినా దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్

వన్‌టౌన్, ఫ్రిబవరి 19: ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులకు ఎన్నికలపై శిక్షణ ఇచ్చే క్రమంలో సోమవారం స్పందనను రద్దు చేసినా విషయం తెలియని కొందరు తమ అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. వారి నుంచి కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అర్జీలు స్వీకరించారు. ఉదయాన్నే మేరీస్టెల్లా కాలేజీలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన బందర్‌రోడ్డులోని కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ సమయంలో అర్జీలు ఇచ్చేవారిని గమనించి పలకరించారు. వెంటనే అందుబాటులో ఉన్న అధికారులను పిలిపించి ఆయా శాఖల దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తమను నిరాశపరచకుండా కలెక్టర్ ఎంతో బిజీగా ఉన్నా దరఖాస్తులు స్వీకరించి సంతృప్తికరంగా వ్యవహరించారని అర్జీదారులు పేర్కొన్నారు.



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఫొటో జర్నలిస్ట్‌పై దాడి

వచ్చే ఎన్నికలకు ట్రయలా?

● ఏపీ ఐద్వా సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య

వన్‌టౌన్, ఫ్రిబవరి 19: ఫోటో జర్నలిస్ట్‌పై రాప్తాడులో వైసీపీ రౌడీ మూకలు పిడిగుద్దులు గుద్ది సొమ్మసిల్లేలా కిరాతకంగా హింసించిన వైనం రాబోయే ఎన్నికలకు ట్రయల్‌గా అనుకోవాలా అని ఏపీ ఐద్వా సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పత్రికా ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం సభ సందర్భంగా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణను సాక్షాత్తు సీఎం సభలో ఉండగానే వైసీపీ రౌడీ మూకలు దారుణంగా హింసించడం క్షంతవ్యం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా వ్యవస్థ ముఖ్యమైందని రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అరాచకాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్న మీడియాపై దాడి చేయడం హేయమన్నారు. 6 జిల్లాలకు సంబంధించిన బస్సులను సొంత పార్టీ మీటింగ్ కోసం ఏ రకంగా సీఎం ఉపయోగించుకుంటాడని ప్రశ్నించారు. రాజకీయ పార్టీ సభకు ఆరు జిల్లాల్లో ప్రయాణికులను అంతగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఆర్టీసీకి అద్దె చెల్లించలేదన్నారు. ప్రజల సంస్థని పేర్కొన్నారు. సీఎం వస్తుంటే స్కూళ్లకు సెలవులు ప్రకటించడం, వందల ఏళ్ల నాటి వృక్షాలను కొట్టేయడం, షాపులు మూయించడం, పరదాలు కట్టుకోవడం వంటివి ప్రజాస్వామ్యమా..? నియంతృత్వమా? అని ప్రశ్నించారు. ఇదంతా చూస్తుంటే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తరువాత పరిస్థితులు ఎంత భయంకరంగా ఉంటాయోనన్నది ఊహించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై

దాడి దారుణం

● వైసీపీ మూకలపై చర్యలు తీసుకోవాలి: విస్సన్నపేట ప్రెస్‌క్లబ్



విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, జనసేన, సీపీఎం నాయకులు

విస్సన్నపేట, ఫ్రిబవరి 19: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణమని, అమానుషచర్య అని విస్సన్నపేట ప్రెస్‌క్లబ్ సభ్యులు అన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యా లయంలో తహసీల్దార్ ఎం.సుజాతకు వారు వినతిపత్రం అందించారు. జనసేన, సీపీఎం నాయకులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి వారు నిరసన తెలిపారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అప్రజాస్వామికమని, పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఉందని లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ అన్నారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సం దర్భంగా ఆంధ్రజ్యోతి, ఈనాడు యాజమాన్యాలను పాదయాత్ర కవర్ చేయమని అడిగిన సంగతి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. షేక్ యాసిన్, నందమూరు వెంకటేశ్వరరావు, తోట కిషోర్, వి.నాగరాజు పాల్గొన్నారు.

జగన్ రెచ్చగొట్టడం వల్లే దాడి: జంపాల సీతారామయ్య



జి.కొండూరు: "జగన్ ఎక్కడ సభలు పెట్టినా తనకు నచ్చని మీడి యాను దూషించడం, పదేపదే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిగింది. జర్నలిస్టుపై దాడి ప్రజాస్వా మ్యంపై దాడే. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటివి పునరా వృతం కాకుండా చూడాలి." అని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి జంపాల సీతారామయ్య డిమాండ్ చేశారు.

జగన్ పాలనలో విలేకరులకు భద్రత కరువు: షేక్ కరీముల్లా



"జగన్ పాలనలో సామాన్య ప్రజల బాధలు వెలికితీసే విలేకరులకు భద్రత లేకపోవడం విడ్డూరం. రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా. జగన్ నియంతృత్వ పాలనకు విలేకర్లపై జరిగిన దాడే నిదర్శనం." అని టీడీపీ ముస్లిం, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ కరీముల్లా అన్నారు.

దారుణ ఘటన: పి.నరసింహారావు



"సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే విలేకరులపై జగన్ ప్రభుత్వం దాడులు చేయిండమంటే ఇంతకంటే దారుణం మరొకటి ఉండదు. రాష్ట్రంలో సామాన్యుల ప్రాణాలకే రక్షణ లేదనుకుంటే ఇప్పుడు విలేకరులకు కూడా రక్షణ లేకుండా పోయిందనేందుకు రాప్తాడు ఘటనే నిదర్శనం." అని టీడీపీ మైలవరం నియోజ కవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పంటాపంచల నరసింహారావు అన్నారు.

సభలో ఫొటోలు తీయడం నేరమా: కట్టా నరసింహారావు

జగ్గయ్యపేటరూరల్: జగన్ సభల్లో ఫొటోలు తీయటం నేరమా అని టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు ప్రశ్నించారు. ఒక చానల్, ఒక పత్రిక అధినేత అయి ఉండి జగన్ ఈ విధంగా వ్యవహరించటం సిగ్గుచేటు అన్నారు.

అప్రజాస్వామిక చర్య: కొత్తపల్లి ఆనంద్‌స్వరూప్

తిరువూరు: వైసీపీ ప్రభుత్వంలో పాత్రికేయులకే రక్షణ లేకుండా పోయిందని, రాప్తాడు సభ వద్ద ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ గూండాలు చేసిన దాడిని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి ఆనంద్‌స్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఇది అప్రజాస్వామ్యక చర్యఅన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలోనే పాత్రికేయుడిపై దాడి జరగడం శోచనీయం అన్నారు. దాడికి పాల్పడ్డ దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.





దుర్గామల్లేశ్వరుల శాంతి కల్యాణోత్సవం, దుర్గమ్మకు బంగారు గిన్నె, రాళ్ల నత్తును కానుకగా సమర్పిస్తున్న లూమీరైజ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం

దుర్గమ్మకు కానుకగా బంగారు గిన్నె, నవరత్నాల నత్తు

వన్‌టౌన్, ఫ్రిబవరి 19: రావులపాలెంలోని లూమీ రైజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ,యాజమాన్యం సోమవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారి ఆలయానికి విచ్చేసి 113 గ్రాముల బంగారు గిన్నె,నవరత్నాలు పొదిగిన ఆరు గ్రాముల నత్తును కానుకగా సమర్పించారు. ఈవో రామరావు ద్వారా దేవస్థానానికి కానుకలను అప్పగించారు. అమ్మవారి దర్శనం అనంతరం సంస్థ యాజమాన్యానికి శేష వస్త్రం, ఆశీస్సులు, ప్రసాదం అందచేశారు. దుర్గగుడిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి నగరంలోని మహానాడు రోడ్డుకు చెందిన వెలగలేటి వెంకట ఆదిలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన గంగా, పార్వతీ, మల్లేశ్వరుల శాంతి కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో మాడుగుల

ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణిశర్మ దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు, ట్రస్టుబోర్డు చైర్మన్ రాంబాబు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

చిట్టినగర్, ఫ్రిబవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ గుండాల దాడికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నగరంలోని చిట్టినగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభమై మరుపిళ్ల చిట్టి విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర నాయకులు యేమినేని వెంకట రమణ, ఏపీఎంపీఏ నేత పసుపులేటి చైతన్య మాట్లాడుతూ సమాజ సేవలో 4వ స్తంభం లాంటి పత్రిక స్వేచ్ఛను హరించేలా అనంతపురం జిల్లా రాప్తాడు సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై అక్కడి వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడి చేయడం శోచనీయమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి పాల్గొన్న మహాసభలో వేలాదిమంది చూస్తుండగా ఫొటోగ్రాఫర్ దాడి చేస్తుంటే ఎవరూ అడ్డుకోపోవడం అమానుషమన్నారు. పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు ఏ కార్యక్రమాన్నయినా కవర్ చేసే స్వేచ్ఛ ఉందని, అలాంటిది సీఎం సభను కవర్ చేయడానికి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఈ దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, నేతలు కోటా రాజా, జర్నలిస్టు మిత్రుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏవీవీ శ్రీనివాసరావు, స్థానిక విలేకరులు సూరగాని వీరు, వీ ఫణి కుమార్ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఏపీఎంపీఏ, జర్నలిస్టు సంఘ నేతలు



టీడీపీ శ్రేణులతో కలిసి రాజధాని ఫైల్స్ సినిమా చూసేందుకు వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

'రాజధాని ఫైల్స్' చిత్రంలో

కళ్లకు కట్టిన జగన్ విధ్వంసం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫ్రిబవరి 19: రాజధాని ఫైల్స్ చిత్రం చూసి జగన్ కళ్లు తెరవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు పలికారు. సోమవారం సాయంత్రం బెంజిసర్కిల్ సమీపంలోని ట్రెండ్ సెట్ సినిమా హాల్లో 350 మంది టీడీపీ శ్రేణులతో కలిసి గద్దె రామ్మోహన్ రాజధాని ఫైల్స్ సినిమాను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాజధాని అమరావతి మార్పుతో ఎంత తప్పు చేశాడో, రైతుల కష్టాన్ని ఎలా విస్మరించాడో రాజధాని ఫైల్స్‌లో కంటికి కనబడేటట్టు రూపొందించారని, ఈ సినిమా చూసిన తర్వాతయినా జగన్‌కు కనువిప్పు కలగాలని అభిప్రాయపడ్డారు. రాజధాని నిర్మాణం కోసం 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన అమరావతి రైతుల త్యాగానికి ప్రతిఫలం అందేలా అమరావతి నిర్మాణాలను వేగంగా చేపట్టి సచివాలయం, హైకోర్టు అసెంబ్లీ భవనాలను నిర్మించారన్నారు. చంద్రబాబు మొదలుపెట్టిన అమరావతి రాజధానితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను జగన్ నిర్వీర్యం చేశాడన్నారు. జగన్ నియంతృత్వ ధోరణితో రానున్న రోజుల్లో రాష్ట్రాభివృద్ధికి ఏ రాష్ట్రంలో భూములు కావాలన్నా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిస్థితులను బట్టి స్వచ్ఛందంగా భూములిచ్చేందుకు రైతులు భయపడే పరిస్థితులు కల్పించారన్నారు.

వీరమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పణ

ఉయ్యూరు, ఫ్రిబవరి 19: వీరమ్మ అమ్మవారికి పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ స్టేషన్ తరపున పసుపుకుంకుమ, చీర సారె సమర్పించారు. తిరునాళ్లలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పట్టణ పోలీసుల పసుపుకుంకుమ అందుకున్న తరువాత మెట్టినింటి నుంచి అమ్మవారు తిరునాళ్లకు బయలుదేరతారు. ఈ నేపథ్యంలో సోమవారం స్టేషన్‌లో ఎస్సై గణేశ్‌కుమార్ దంపతులు పూజలు చేసి బ్యాండు మేళాలు, డప్పు వాయిద్యాలతో సిబ్బంది వెంటరాగా ఊరేగింపుగా బయలుదేరి వెళ్లి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. డీఎస్పీ జయసూర్య, సీఐ హబీబ్ బాషా పర్యవేక్షించారు.

వీరమ్మ తిరునాళ్లలో పటిష్ట బందోబస్తు

వీరమ్మ తిరునాళ్లకు ఇరువురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 300 మంది పోలీసులు, హోంగార్డుతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ ఎండీ హబీబ్ బాషా తెలిపారు.



బందోబస్తుపై పోలీసులకు సూచనలిస్తున్న సీఐ

బందోబస్తుకు వివిధ స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది, హోంగార్డులకు వీరమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం పలు సూచనలు చేశారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టంగా బందోబస్తు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్, రద్దీ సమయంలో ఆలయం వద్ద తోపులాట సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

వ్యాపారులకు నోటీసులు

వన్‌టౌన్: కొత్తపేట హనుమంతరాయ మార్కెట్‌లో వ్యాపారులకు కార్పొరేషన్ అధికారులు శనివా రం నోటీసులు జారీ చేశారు. మార్కెట్లో దుకాణదారులు కార్పొరేషన్‌కు రూ.70 లక్షల మేర అద్దె బకాయిలు పడ్డారు. వారి నుంచి అద్దె వసూలు విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈనెల 4న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ ఆదేశాలతో ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ దుకాణదారు ల నుంచి రావాల్సిన అద్దె బకాయిల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు ఈసుకోని వారికి సంబందించి ఆయా షాపులకు నోటీసులు అంటించారు. బకాయి లు వారంలో చెల్లించాలనిలేని ఎడల శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

వన్‌టౌన్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు బుధవారం నగరంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసులు సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు తమ విద్యార్హత, బయోడేటా తదితర పత్రాలతో స్వయంగా హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఆక్రమణలు సహించేది లేదు: గౌస్

వన్‌టౌన్: వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలను ఏమాత్రం సహించేది లేదని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వక్ఫ్ బోర్డు అధికారులు, స్థానిక ముస్లిం పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్‌నుహా అలిషా, అధికారులు ఇనాయత్ అలీ, జానీ బాషా, షఫీతో పాటు ముస్లిం పెద్దలు ఫజలుల్ హక్, ఖాన్, కరీముల్లా, మౌలాలి, అన్వర్, సుభాని, ఇంతియాజ్ పాల్గొన్నారు.

రంగా వర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్ల నిరవధిక సమ్మె

అమరావతి, ఫ్రిబవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కాంట్రాక్ట్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగారు. వర్సిటీ ప్రధాన కార్యాలయంతో పాటు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలు, వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాల వద్ద కాంట్రాక్ట్ వర్కర్లు గత నాలుగు రోజులుగా ధర్నాలు చేస్తున్నారు. వర్సిటీ పరిధిలో 15ఏళ్లుగా పని చేస్తున్న తమ సమస్యలను ఫ్రిబవరి16 లోపు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని నోటీసు ఇచ్చినా వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగారు.

మసీదుల్లో మౌలిక వసతులు కల్పించండి

పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని మసీదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మైనార్టీల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల అమలు కమిటీ సభ్యులు అర్షద్ అయూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ లేఖపై వెంటనే స్పందించి.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మసీదుల ఆవరణలో పారిశుధ్యం, తాగు నీరు, నిరంతర నీటి సరఫరా చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఒక మెమో జారీ చేసిందన్నారు.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న వినోద్

ప్రామాణికత కోసం నాణ్యతపై అవగాహన

గుణదల, ఫ్రిబవరి 19: ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో ఉన్నవారు ఏ తరహాలో ప్రామాణికత పాటిస్తున్నారనేది యువత తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ మినిస్ట్రీ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ విజయవాడ సీనియర్ డైరెక్టర్ ఎం.ఎ.జె.వినోద్ అన్నారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్దఉన్న ది కే హోటల్‌లో బీఐఎస్ స్టాండర్డ్స్‌పై రెసిడెన్షియల్ టీచర్స్‌కి 2 రోజుల శిక్షణ సోమవారంతో ముగిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 50 మంది స్టాండర్డ్స్ క్లబ్ ఆఫ్ స్కూల్స్ కాలేజీల టీచింగ్ స్టాఫ్ హాజరయ్యారు. ప్రామాణీకరణ కోసం నాణ్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రెండ్రోజుల శిక్షణ జరిగింది. నాణ్యత, ప్రామాణీకరణ, ప్రమాణాల నిర్మాణం, బీఐఎస్ వెబ్‌సైట్ వినియోగం, పోర్టర్‌లు బీఐఎస్ కేర్ యాప్ ఇంకా పలు సాంకేతిక సెషన్‌లను వివరించారు. అదే సమయంలో టీచింగ్ స్టాఫ్ అనుభవాలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. బీఐఎస్ విజయవాడ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్, ఎమ్.సాగర్, వివేక్ వర్ధన్ పాల్గొన్నారు.

మాదిగల వ్యతిరేకి

జగన్‌కు ఓటెందుకు వేయాలి

● ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు మాదిగ

ధర్నాచౌక్, ఫ్రిబవరి 19: ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ప్రభుత్వ లాయర్ వాదనలు వినిపించకుండా కప్పదాటు వైఖరి అవలంభించి మాదిగల వ్యతిరేకిగా మారిన సీఎం జగన్‌కు రాబోయే ఎన్నికల్లో మాదిగలు ఓట్లు ఎందుకు వేయాలో సమాధానం చెప్పాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో మాదిగలు, ఉపకులాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వని పార్టీలను ఓడిస్తామని హెచ్చరించారు. పదేళ్లపాటు వర్గీకరణ చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. మాదిగల ఓట్ల కోసమే మంద కృష్ణమాదిగకు ప్యాకేజీ ఇచ్చి బీజేపీ వాడుకుంటుందని ఆరోపించారు. ఆంధ్రాలో ఆయన పెత్తనాన్ని సహించేది లేదన్నారు. మంద కృష్ణ మాదిగ మోసాలను ఎండకట్టేందుకు మాదిగ సంఘాలతో ఈ నెల 25న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐక్య వేదికగా ఏర్పడి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేద్దాం

● అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిమ్మ

పెనమలూరు, ఫ్రిబవరి 19: ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి మంగళవారం చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే రెడ్డిమ్మ పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యతను చాటేటట్టు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కానూరు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీఏ బకాయిలు, పీఆర్సీలు, ఐఆర్, జీపీఎఫ్ బిల్లులు మంజూరవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ప్రభుత్వంతో చర్చలు జరిపినా సమస్యలకు పరిష్కారం లభించడంలేదన్నారు. ఇనయతుల్లా, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, పూర్ణచంద్రరావు, అబ్రహం పాల్గొన్నారు.



కానూరు ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

అభివృద్ధి అంతా జగన్ ఫొటోల్లోనే!

» రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం: రఘురామ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు చేసిందేమిటని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు నిలదీశారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి పన్ను పత్రాలు, సరిహద్దు రాళ్లపై తన బొమ్మలు వేసుకోవడం తప్ప, అంతకుమించి ఏమైనా చేశాడా? అంటే ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'నవరత్నాలలో ముందు తండ్రి ఫొటో.. అందులో షాడోగా కొడుకు ఫొటో ఉండేది. ఆ తర్వాత కొడుకు ఫొటోషాడోలో తండ్రి ఫొటో.. ఆ తర్వాత తండ్రి ఫొటోనే లేకుండా చేశారు. అభివృద్ధి అనేది జగన్ ఫొటోలలో ఉందే తప్పితే, అంతకుమించి రాష్ట్రంలో అభివృద్ధి అన్నదే జరగలేదు. ప్రతి ఇంటికి ఎంతో చేశానని జగన్ చెబుతున్నారు. అయితే ప్రతి ఇంటికి ఆయన చేసింది చెత్త పన్ను వేయడం, విద్యుత్ చార్జీలను పెంచడమే అభినవ హరిశ్చంద్రుడైన జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే. అబద్ధాలను కూడా నిజాలు అన్నట్లుగా చెప్పడంలో ఆయన ఎక్స్‌ప్రెషన్స్, కాన్ఫిడెన్స్ చూస్తుంటే ఎదుటివారికి మతిపోవాల్సిందే. ఆయన అభినయానికి ఆస్కార్ ఇచ్చినా తక్కువే. రాష్ట్ర ప్రజలకు రాజధాని లేకుండా చేసి, అమరావతిని సంక నాకించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం హామీని గాలికొదిలేసి ప్రజల ఆరోగ్యాన్ని సంకనాకించడమే కాకుండా, మహిళల సొమ్మును జుర్రుకున్నారు' అని ఆరోపించారు. సిద్ధం సభ ప్రభుత్వ ఖర్చుతో నిర్వహించారా? లేక పార్టీ ఖర్చుతో నిర్వహించారా? అన్నది అణా పైసల లెక్కలతో సహా చెప్పాలని డిమాండ్ చేశారు. రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఫొటో జర్నలిస్ట్ పై దాడి చేయడం అమానుషమన్నారు. రాష్ట్రంలోని మహిళలను నా అక్కా చెల్లెమ్మలని చెప్పుకొనే జగన్ రెడ్డి సొంత మేనల్లుడి వివాహానికి హాజరు కాలేదని ఎద్దేవా చేశారు. న్నారు. సొంత చెల్లి కుమారుడి వివాహానికే హాజరుకాలేనివాడు మనకేమి చేస్తాడని రాష్ట్రంలోని మహిళలంతా జోకులు వేసుకుంటున్నారన్నారు.

ఏపీ ఎన్నికల బరిలో తెలంగాణ విశ్రాంత ఐపీఎస్

» విజయవాడ లేదా ఏలూరు పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీ చేసేందుకు తెలంగాణ విశ్రాంత ఐపీఎస్ పూర్ణచంద్రరావు సిద్ధమయ్యారు. బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. గురువారం, పార్టీలో చేరిన అనంతరం తదుపరి రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తారు. విజయవాడ లేదా ఏలూరులోని ఏదో ఒక పార్లమెంట్ స్థానం నుంచి ఆయన బరిలో దిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన పూర్ణచంద్ర రావు ఐపీఎస్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరులో పనిచేశారు. తెలంగాణలో పోలీస్ నియామక బోర్డు చైర్మన్, ఏసీబీ డీజీగా కొనసాగారు. ఏసీబీ డీజీ హోదాలో ఆయన పదవీ విరమణ చేశారు.

ఆరోసారీ ఈడీ విచారణకు కేజ్రీ డుమ్మా

» ఏడోసారి సమన్లు జారీ చేయనున్న ఈడీ?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వరుసగా ఆరోసారి ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారణకు గైర్హాజరయ్యారు. తాజాగా ఇటీవల ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు సోమవారం ఆయన ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉండగా, ఆయన హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఏడోసారి కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. తొలుత జారీ చేసిన నోటీసులను కేజ్రీవాల్ పట్టించుకోకపోవడంతో ఆయన తప్పు చేసినట్టు స్థానిక కోర్టు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిందని, దీంతో ఆయనకు తాజాగా నోటీసులు జారీ చేయనున్నామని ఈడీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఎన్నిసార్లు సమన్లు జారీ చేసినా విచారణకు కేజ్రీవాల్ హాజరుకాకపోవడంతో ఈనెల మొదట్లోనే ఢిల్లీలోని ఓ కోర్టును ఈడీ ఆశ్రయించింది. అయితే, తనకు వరుసగా సమన్లు జారీ చేసే బదులు కోర్టు నిర్ణయం కోసం ఎదురుచూడాలని ఈడీకి కేజ్రీవాల్ సూచించారు. ఢిల్లీ అసెంబ్లీ వద్ద కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ 'మేం చట్ట ప్రకారమే సమాధానం ఇస్తున్నాం. ఈడీ ఇప్పుడు కోర్టులో కేసు వేసింది. తాజాగా సమన్లు జారీ చేసేముందు కోర్టు నిర్ణయం వచ్చే వరకు ఈడీ ఎదురుచూడాలి' అన్నారు. కాగా, ఢిల్లీలోని తమ ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు, తమ పార్టీని అంతం చేసేందుకే కేజ్రీవాల్‌ను బీజేపీ అరెస్టు చేయాలనుకుంటోందని ఆప్ ఆరోపించింది. అయితే, కేజ్రీవాల్‌కు ఈడీ జారీ చేసిన సమన్లు చట్టబద్ధమేనని, విచారణకు ఆయన సహకరించాలని కోర్టు కూడా స్పష్టం చేసిందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు. ఈడీ సమన్లను కేజ్రీవాల్ చట్టవ్యతిరేకంగా అభివర్ణిస్తే గనుక ఆయన కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టేనన్నారు.

ఇంటిపై జై శ్రీరామ్ జెండా తొలగించిన కమల్‌నాథ్

» ఆయన బీజేపీలో చేరరు: కాంగ్రెస్ వర్గాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ ఢిల్లీలోని తన ఇంటిపై నుంచి జై శ్రీరామ్ అని రాసి ఉన్న జెండాను తొలగించారు. గతేడాది జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చవిచూసింది. దాంతో అధిష్ఠానం ఆయన్ను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ పదవి నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో కమల్‌నాథ్ ఆయన కుమారుడు బీజేపీలో చేరతారనే వార్తలు పుట్టుకొచ్చాయి. అయితే ఆ వార్తలను ఆయన ఖండించనప్పటికీ ఇంటిపై నుంచి జైశ్రీరామ్ అని రాసి ఉన్న జెండాను మాత్రం సోమవారం తొలగించారు. మరో పక్క కమల్‌నాథ్ బీజేపీలో చేరతారని వస్తున్న వార్తలను కాంగ్రెస్ పార్టీ వర్గాలు కొట్టిపడేశాయి. కమల్‌నాథ్‌ను ఇందిరాగాంధీ మూడో బిడ్డగా భావించేవారిని, గాంధీ కుటుంబంతో ఆయన బంధం ఎవరూ కదపలేనిదని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత జీతూ పట్వారీ పేర్కొన్నారు. కమల్‌నాథ్ బీజేపీలో చేరడంలేదని, ఆయన తుది వరకు కాంగ్రెస్‌తోనే కొనసాగుతారని ఆయన స్పష్టం చేశారు.

యూపీలో 17 ఎంపీ స్థానాలిస్తాం

» సరేనంటేనే రాహుల్ యాత్రకు అఖిలేశ్

» సమాజ్‌వాదీ పార్టీ షరతు.. 11 సీట్లకు తమ అభ్యర్థుల ప్రకటన

లఖ్‌నవూ, ఫిబ్రవరి 19: విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వాముల నడుమ దాగుడుమూతలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా యూపీలో కాంగ్రెస్‌తో సమాజ్‌వాదీ పార్టీ సీట్ల బేరాలు ఆడుతోంది. మొత్తం 80 ఎంపీ స్థానాలకు గాను గతంలో 11 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు ఇస్తామని ప్రతిపాదించిన ఆ పార్టీ.. ఇప్పుడా సంఖ్యను 17కి పెంచింది. ఇదే తమ తుది నిర్ణయమని.. ఇందుకు అంగీకరిస్తేనే తమ అధినేత అఖిలేశ్ యాదవ్ మంగళవారం రాయ్‌బరేలీలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీతో కలిసి 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో పాల్గొంటారని సమాజ్‌వాదీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి సోమవారమిక్కడ స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్‌కు ఏయే సీట్లు ఇవ్వనుందీ చెప్పేందుకు నిరాకరించారు. ఇదే సమయంలో 11 స్థానాలకు సమాజ్‌వాదీ తన అభ్యర్థులను ప్రకటించింది. గత నెల 30న 16 మంది అభ్యర్థులతో సమాజ్‌వాదీ తొలి జాబితా విడుదల చేసింది. అంటే ఇప్పటికి 27 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

పశ్చిమ బెంగాల్‌లో ఆధార్ కార్డుల డీయాక్టివేషన్ ప్రధానికి మమతా లేఖ



కోల్‌కతా, ఫిబ్రవరి 19: తమ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకి చెందిన వారి ఆధార్ కార్డులను కేంద్రం డీయాక్టివేట్ చేస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజలకు సంక్షేమ పథకాలు అందకూడదనే ఉద్దేశంతోనే బీజేపీ ఈ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. డీయాక్టివేషన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె ప్రధానికి లేఖ రాశారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారి ఆధార్ కార్డులు డీయాక్టివేట్ అయ్యాయని, ఎటువంటి ఎంక్వైరీ చేయకుండా, కనీసం రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా యూనీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా సదరు వ్యక్తులకు నేరుగా లేఖలు జారీ చేసిందని మమతా పేర్కొన్నారు. ఈ హఠాత్ పరిణామం పట్ల పౌరులు భయభ్రాంతులకు గురవుతున్నారని, బాధితులు పెద్ద సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకుంటున్నారని తెలిపారు. డీయాక్టివేషన్ గల కారణాలను తెలియపరచలని కోరారు. కాగా, ఆధార్ కార్డులు డీయాక్టివేట్ అయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొత్త గుర్తింపు కార్డులను జారీ చేస్తామని మమతా పేర్కొన్నట్లు సమాచారం.

అయోధ్య రాముడిని చూపిస్తూ ఓపెన్ బ్రెయిన్ సర్జరీ..!

» రోగి మెలకువగా ఉండగానే ట్యూమర్ తొలగింపు

» గుంటూరులో మరో ఆపరేషన్ విజయవంతం

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 19: పెద్ద స్థాయి శస్త్రచికిత్సల్లో సైతం రోగులకు పూర్తి మత్తు ఇవ్వకుండా, వారు మెలకువగా ఉండగానే ఓపెన్ బ్రెయిన్ సర్జరీలు చేయడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ క్రమంలో గుంటూరులో మరోసారి రోగి స్పృహలో ఉండగానే మెదడుకు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. రోగి శ్రీరాముడి భక్తుడు కావడంతో... ఆపరేషన్ థియేటర్‌లో ల్యాప్‌ట్యాప్‌లో అయోధ్య శ్రీరాముడి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. మరోవైపు కపాలం తెరిచి వైద్యులు ఆపరేషన్ చేస్తుండగా.. రోగి భక్తితో చేతులు జోడించి జై శ్రీరామ్ అంటూనే సర్జరీకి సహకరించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గొడవర్రుకు చెందిన దానబోయిన మణికంఠ (29) మెదడు ఎడమ భాగంలో ఏర్పడిన కణితి (గ్లయోమా) కారణంగా డిసెంబరు నుంచి మూర్ఛలతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం శ్రీసాయి హాస్పిటల్‌ను సంప్రదించారు. బ్రెయిన్ ట్యూమర్ తొలగించే సమయంలో కాళ్లు, చేతులు చచ్చుబడే ప్రమాదం ఉన్నట్లు గుర్తించి దీన్ని నిరోధించేందుకు రోగిని మెలకువగా ఉంచి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఫిబ్రవరి 11న ఆపరేషన్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. రోగి కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ ఆపరేషన్‌లో న్యూరో సర్జన్లు డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఆకాశ్, ఎనస్థటిస్ట్ డాక్టర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌ట్యాప్‌లో అయోధ్య రాముడిని తిలకిస్తున్న రోగి మణికంఠ



ఆపరేషన్ చేసిన వైద్య బృందంతో మణికంఠ

'హిడ్మా' గ్రామంలో జాతీయ జెండా రెపరెపలు!

» 40 ఏళ్ల తరువాత తొలిసారి

» మావోయిస్టుల కంచుకోట పూర్వి గ్రామంలోకి బలగాలు

» హిడ్మా తల్లి బిజ్జుకు వైద్య సేవలు

» బలగాల రాకతో ఆదివాసీ యువత పరారీ

» వెనక్కి రావాలని బీజాపూర్ ఎస్పీ పిలుపు



హిడ్మా గ్రామంలో జాతీయ పతాకం



హిడ్మా తల్లి బిజ్జుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

చింతూరు, ఫిబ్రవరి 19: మావోయిస్టుల కంచుకోటలో నాలుగు దశాబ్దాల తర్వాత జాతీయ పతాకం రెపరెపలాడింది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు చీఫ్, కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మాకు పెట్టని కోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూర్వి గ్రామంలోకి కేంద్ర బలగాలు అడుగుపెట్టాయి. అంతేకాదు నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారి పోలీసులు ఆ గ్రామం నడిబొడ్డున జాతీయ జెండా ఎగురవేశారు. దీంతో ఇది ఛత్తీస్‌గఢ్ పోలీసు రికార్డులో పెద్ద సాహసోపేతమైన ఘటనగా నమోదైంది. పూర్విలో అడుగు పెట్టేందుకు కేంద్ర బలగాలు చేసిన అనేక ప్రయత్నాలు ఇప్పటి వరకు విఫలమయ్యాయి. దీనికి కారణం ఈ గ్రామం హిడ్మా జన్మస్థలం కావడమే. బీజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దులో ఉన్న ఆ గ్రామానికి చేరుకోవాలంటే అంత తేలికైన పనేమీ కాదు. ఆ గ్రామం చుట్టూ మావోయిస్టుల ఐదంచెల నిఘా వ్యవస్థ చురుగ్గా పని చేస్తుంటుంది. ఎవరైనా కొత్త వ్యక్తి అడుగు పెడుతుండగానే ఆ సమాచారం మావోయిస్టు దళాలకు ఇట్టే చేరుతుంది. అక్కడ సాగేది కేవలం జనతన్ సర్కార్ పాలన మాత్రమే. చెరువులు, కూరగాయలు, ధాన్యం, తదితర పంటలు మావోయిస్టుల ఆధ్వర్యంలోనే ఉంటాయి. మావోయిస్టులు నియమించిన ఉపాధ్యాయుడే స్థానికంగా చిన్నారులకు పాఠాలు బోధిస్తారు. చివరకు వైద్యం కూడా మావోయిస్టులదే. 2010లో హిడ్మా సంచరిస్తున్నాడన్న సమాచారం అందుకున్న కేంద్ర బలగాలు.. అక్కడకు చేరుకొనే ప్రయత్నం చేస్తుండగానే మావోయిస్టులు మెరుపు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 76 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇక, 2014లో కూడా అదే తరహా దాడి జరిగి మరో 24 మంది జవాన్లు ప్రాణాలు విడిచారు. తాజాగా, జనవరి 30న కేంద్ర బలగాలు పూర్వి చేరుకొనే ప్రయత్నం చేస్తుండగా మావోయిస్టులు జరిపిన దాడిలో ఐదుగురు జవాన్లు మృతి చెందారు. మరో 14 మంది గాయపడ్డారు. కాగా పట్టు వీడని బలగాలు ఎట్టకేలకు ఆదివారం పూర్వి గ్రామం చేరుకొని అక్కడ జాతీయ జెండా ఎగురవేశారు. అయితే పోలీసులు పూర్వి లో అడుగుపెట్టడంతో ఆ గ్రామంలోని యువత అడవిలోకి పారిపోయారు. విషయం తెలుసుకున్న సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ వారందరినీ గ్రామంలోకి రావాలని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడతామని సమాచారం పంపించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల క్యాంపు

పోలీసుల స్వాధీనం

పూర్వి గ్రామంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన పాఠశాలను, విశ్రాంతి గృహాన్ని, మావోయిస్టులు సాగు చేస్తున్న కూరగాయల తోటలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న విశ్రాంతి గృహాన్ని కూడా స్వాధీనం చేసుకున్న పోలీసులు దానిని 'వార్ రూం'గా మార్చుకున్నారు. ఇప్పటివరకు మావోయిస్టుల అప్రకటిత రాజధానిగా ఉన్న పూర్వి గ్రామాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం, మావోయిస్టుల నియంత్రణ కోసం వ్యూహాత్మక ప్రధాన కేంద్రంగా మలుచుకోవడం గమనార్హం. ఇక, హిడ్మా ఇంటికి సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ చేరుకుని హిడ్మా తల్లి బిజ్జుతో మాట్లాడి యోగ క్షేమాలు తెలుసుకుని వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించారు.

హిడ్మా ఎవరు?

మావోయిస్టు అగ్ర నాయకుడు హిడ్మా. బీజాపూర్ జిల్లా జేగురుగొండ పోలీసుస్టేషను పరిధిలోని పూర్వి ఆయన స్వగ్రామం. 2001 నుంచి ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయి. చురుకైన, తెలివైన, అత్యంత ప్రమాదకరమైన మావోయిస్టుగా పోలీసులు తమ రికార్డుల్లో పేర్కొన్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు హిడ్మా 27కి పైగా దాడుల్లో పాల్గొన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. హిడ్మాకు రక్షణగా 5 కిలోమీటర్ల మేర రక్షణ వలయం ఉంటుందని అంటారు. దీంతో అనేక సందర్భాల్లో హిడ్మాను పట్టుకునేందుకు ప్రయత్నించినా.. బలగాలు విఫలమయ్యాయి.

ఫ్రాన్స్ పాస్‌పోర్టు... అత్యంత శక్తిమంతం

» వీసా లేకుండా 194 దేశాలకు ప్రయాణ అనుమతి

» 84 నుంచి 85వ స్థానానికి పడిపోయిన ఇండియా

» తన 106వ స్థానాన్ని పదిలపరుచుకున్న పాకిస్థాన్

» హెన్లీ విడుదల చేసిన తాజా ర్యాంకింగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఆయాదేశాల పాస్‌పోర్టు బలాబలాలను ఆధారం చేసుకుని హెన్లీ సంస్థ పాస్‌పోర్టు ర్యాంకులను విడుదల చేసింది. ఫ్రాన్స్ పాస్‌పోర్టు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలబడింది. భారతదేశం గత ఏడాదితో పోల్చితే ఒక స్థానం కిందకి దిగింది. ఫ్రాన్స్ పాస్‌పోర్టుతో వీసా లేకుండా 194 దేశాలకు ప్రయాణం చేయవచ్చు. గత ఏడాది ఇండియా పాస్‌పోర్టుతో వీసా లేకుండా 60 దేశాలు అనుమతించాయి. ఈ ఏడాది ఆ సంఖ్య 62కు పెరిగింది.

అయితే ఆశ్చర్యకరంగా ర్యాంకింగుల్లో మాత్రం 84 నుంచి 85వ స్థానానికి పడిపోయింది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్ తన 106వ స్థానాన్ని నిలబెట్టుకుంది. బంగ్లాదేశ్ 101వ స్థానం నుంచి 102కు పడిపోయింది. మాల్దీవుల పాస్‌పోర్టుతో 96 దేశాలకు వీసా లేకుండా ప్రయాణం చేయవచ్చు. శక్తివంతమైన పాస్‌పోర్టుల్లో ఒకటిగా నిలిచిన మాల్దీవులు 58వ స్థానంలో నిలిచింది. ఫ్రాన్స్ తరువాత శక్తిమంతమైన పాస్‌పోర్టు కలిగిన దేశాల్లో వరుస స్థానాల్లో జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ నిలిచాయి. అంతర్జాతీయ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) 19 ఏళ్ల ప్రత్యేక సమాచారాన్ని ఆధారం చేసుకుని హెన్లీ ఈ ర్యాంకులను రూపొందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 227 విమాన గమ్యస్థానాలను, 199 విభిన్న పాస్‌పోర్టుల సమాచారాన్ని ఈ సంస్థ క్రోడీకరిస్తుంది.



వేతనాలేవి జగన్ సర్?

» కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గగ్గోలు

» 20వ తారీకు వచ్చినా ఇవ్వని వేతనాలు

» రెండున్నర లక్షల మంది ఎదురు చూపులు

» చెక్‌బౌన్సులు, పెనాల్టీలతో చిరుద్యోగులు విలవిల

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం వచ్చింది మొదలు ఉద్యోగులకు 'ఒకటో తేదీ వేతనం' అనేది కలగా మారిపోయింది. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల వరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలను ఎప్పుడు ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అయితే సర్కారు చుక్కలు చూపిస్తోంది. ఆయా శాఖలవారీగా ఒక్కో ఉద్యోగికీ నెల నుంచి మూడు నెలల వరకు వేతనాలు పెండింగులో పెడుతున్నారు. దీంతో ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

నెలనెలా ఎదురుచూపులు: రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వారిలో 20 వేల మంది నేరుగా ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తుండగా, మరో 30 వేల మంది ఆయా శాఖల పరిధిలో పని చేస్తున్నారు. మరో 98 వేల మంది ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కాస్)లో నమోదు చేయించుకుని పనిచేస్తున్నారు. వీరుకాకుండా ఆయా శాఖలు, పథకాల కింద పని చేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరో లక్షమందికిపైగానే ఉన్నారు. వీరికి నెలనెలా వేతనాలు రావడం కలగా మారిపోయింది. ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ల చెల్లింపు ప్రధాన సమస్యగా మారిపోయింది. గడిచిన మూడు నెలలుగా ఏపీ వైద్యవిధాన పరిషత్ సహా పలు శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు జమ కాలేదు. తాజాగా కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఈ జాబితాలో చేరిపోయారు. ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వేతనాలు అందుకునే వీరికి ఫిబ్రవరి నెలాఖరు వస్తున్నా ఇప్పటి వరకూ జనవరి నెల వేతనాలు దక్కలేదు. ఒక్క వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకే డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు రూ.19.28 కోట్ల మేరకు వేతన బకాయిలు ఉన్నాయని తెలిసింది. అయితే, వారి వేతనాల నిధులను విడుదల చేస్తున్నట్లు ఈ నెల 16న ఏపీ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, రోజులు గడిచినా ఖాతాల్లో జీతాలు మాత్రం పడలేదు.

ఈఎంఐ, చెక్ బౌన్సులతో అగచాట్లు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో మెజారిటీ ఉద్యోగులు రూ.15,500 నుంచి రూ.18,500, రూ.20,500 వేతనాల పరిధిలోనే ఉన్నారు. ఒక్క నెల వేతనం ఆగినా ఉద్యోగుల కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటిది దాదాపు 3 నెలలుగా వారికి వేతనాలు అందడం లేదు. దీంతో నెలవారీ ఈఎంఐ చెల్లింపులు, గృహ రుణాలు, పిల్లల ఫీజులు, ఇతర అవసరాలు కూడా తీర్చుకోలేక అల్లాడిపోతున్నారు. ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవడంతో రూ.వేల పెనాల్టీలు కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు చెక్కులు బౌన్సులు అయ్యి, సిబిల్ స్కోర్లు పడిపోయి బ్యాంకు రుణాలు కూడా రాని దుస్థితికి చేరుతున్నారు. ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఆర్థిక ఇబ్బందుల మాటేమోగానీ, ఉన్న కాస్త పరువు, రుణ పరపతి కోల్పోయే పరిస్థితి దాపురించిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బెంగాల్ సీఎస్, డీజీపీలకు సుప్రీంకోర్టులో ఊరట

» లోక్‌సభ హక్కుల సంఘం నోటీసులపై స్టే

» సందేశ్‌కాలీకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని బీజేపీ ఎంపీ ఫిర్యాదు

» విచారణకు రావాలంటూ అధికారులకు ప్రివిలేజ్ కమిటీ ఆదేశాలు

» రాజకీయ కార్యక్రమాలు ఈ కమిటీ పరిధిలోకి రావని న్యాయవాదుల వాదన



న్యూఢిల్లీ, కోల్‌కతా, ఫిబ్రవరి 19: పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర అధికారులకు లోక్‌సభ హక్కుల కమిటీ జారీ చేసిన నోటీసులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. తన పట్ల దుష్ప్రవర్తనతో వ్యవహరించారంటూ బీజేపీ ఎంపీ సుకాంత్ మజుందార్ చేసిన ఫిర్యాదు మేరకు సభా హక్కుల సంఘం (ప్రివిలేజెస్ కమిటీ) నోటీసులు ఇవ్వగా, దాన్ని సవాలు చేస్తూ వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాంతో వారికి ఊరట కలిగించేలా న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఘర్షణలు జరుగుతున్న సందేశ్‌కాలీ గ్రామానికి వెళ్లడానికి గత వారంలో మజుందార్ ప్రయత్నించగా ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. దాంతో ఆయన కారు బానెట్‌పైకి ఎక్కి విలేకరులతో మాట్లాడుతుండగా అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యారు. అధికారులు తన హక్కులకు భంగం కలిగించారంటూ ఆయన ఈ నెల 15న సభాహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. అదే రోజునే సభా హక్కుల సంఘం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి భగవతి ప్రసాద్ గోపాలిక, డీజీపీ రాజీవ్ కుమార్, ఉత్తర 14 పరగణాల జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చింది. సోమవారం ఉదయం 10.30 గంటలకు విచారణ నివిఎత్తం హాజరుకావాలని ఆదేశించింది. ఈ నోటీసులపై స్టే ఇవ్వాలని కోరుతూ వారు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం స్వీకరించింది. కేసును అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సంఘ్వీలు కోరగా అందుకు అంగీకరించిన ధర్మాసనం మొదటి కేసుగా చేపట్టింది. కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ ఒక శాసనకర్తగా విధులకు ఆటంకం కలిగినప్పుడు మాత్రమే సభా హక్కుల సంఘాన్ని ఆశ్రయించే అవకాశం ఉందే తప్ప రాజకీయ కార్యకలాపాల సందర్భంలో కాదని చెప్పారు. అమల్లో ఉన్న 144వ సెక్షన్‌ను ఎంపీతో పాటు, బీజేపీ కార్యకర్తలు ఉల్లంఘించారని తెలిపారు. పోలీసులు ఆయనపై దాడి చేశారనడం అబద్ధమని, వీడియోను పరిశీలించినప్పుడు బీజేపీ కార్యకర్తలే పోలీసులపై దాడి చేసినట్టు ఉందని చెప్పారు. పైగా నోటీసు అందుకున్న అధికారులు ఎవరూ సంఘటన స్థలంలో లేరని తెలిపారు. ఇలాంటివాటికి సభా హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తే ఏ ఎంపీని అరెస్టు చేసే అవకాశమే ఉండదని చెప్పారు. లోక్‌సభ సెక్రటేరియట్ తరఫున సీనియర్ న్యాయవాది దేవాశీష్ భరుఖా వాదనలు వినిపిస్తూ విచారణ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, తొలి సమావేశానికే స్టే కోరడం తగదని చెప్పారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం స్టే ఇవ్వడంతో పాటు, విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

రాష్ట్రపతి పాలన విధించాలి: మహిళా కమిషన్

సందేశ్‌కాలీలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ పర్యటించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండు చేశారు. ప్రభుత్వానికి సమర్పించే నివేదికలో ఇదే విషయాన్ని పేర్కొంటామని చెప్పారు. లైంగిక వేధింపులకు గురయ్యామంటూ మహిళలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెడుతోందని ఆరోపించారు.

అంతా రాజకీయ ప్రేరేపితం: తృణమూల్ విమర్శ

మహిళా కమిషన్ పర్యటనను తృణమూల్ కాంగ్రెస్ తప్పుపట్టింది. అంతా రాజకీయ ప్రేరేపితమని రాష్ట్ర సీనియర్ మంత్రి శశి పంజా విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని మోర్నియాలో గర్భిణిపై సామూహిక అత్యాచారం చేసి సజీవ దహనం చేసినప్పుడు, మహిళా రెజర్లను బీజేపీ ఎంపీ లైంగికంగా వేధించినప్పుడు, మణిపూర్‌లో మహిళలపై దారుణాలు జరిగినప్పుడు ఎందుకు పర్యటించలేదని ఆమె ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా ప్రస్తుతం అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు.

అలెక్సీ నావల్నీ తల, ఛాతిపై గాయాలు!

» ఓ వైద్య నిపుణుడిని ఉటంకిస్తూ వార్తా కథనం



మాస్కో, ఫిబ్రవరి 19: రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ (47) హఠాన్మరణంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో తాజాగా ఓ వార్తా పత్రికలో వచ్చిన కథనం చర్చనీయాంశంగా మారింది. మార్చురీకి వచ్చేసరికి నావల్నీ తల, ఛాతిపై గాయాలున్నట్లుగా ఓ వైద్య నిపుణుడిని ఉటంకిస్తూ ఆ దేశ పత్రిక కథనం వెలువడటంతో ఆయన మరణించిన పరిస్థితులపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై విమర్శలు గుప్పించిన నావల్నీ.. ఇటీవల ఆ దేశ జైలులో మరణించిన విషయం తెలిసిందే. నడక అనంతరం ఆయన అపస్మారక స్థితికి చేరుకుని మరణించినట్టుగా జైలు అధికారులు గత శుక్రవారం వెల్లడించారు. ఆయన మృతి తర్వాత మృతదేహాన్ని తొలుత సమీప నగరమైన లబిట్నంగికి తర్వాత సలేఖార్డ్‌లోని జిల్లా క్లినికల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. సాధారణంగా జైల్లో చనిపోయిన వారి మృతదేహాలను నేరుగా గ్లాజ్కోవా వీధిలోని బ్యూరో ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్‌కు తీసువెళ్తారని, అయితే నవల్నీ విషయంలో మాత్రం ఏదో కారణంతో క్లినికల్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లినట్టు వైద్య నిపుణుడిని ఉటంకిస్తూ కథనంలో పేర్కొన్నారు. "వారు మృతదేహాన్ని మార్చురీలోకి తీసుకువెళ్లారు. ఆపై ఇద్దరు పోలీసులను ద్వారం ముందు కాపలా ఉంచారు. ఏం జరిగిందో అంతా తెలుసుకోవాలనుకుంటున్నారు. గోప్యత అంతా దేనికి, తీవ్రమైన విషయాన్ని ఏమైనా దాచడానికి ప్రయత్నిస్తున్నారా" అని ఆ వైద్యుడు అడిగినట్టుగా కథనంలో తెలిపారు. నావల్నీని హింసించి, కొట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నా భర్తను పుతిన్ చంపేశారు!: అలెక్సీ నావల్నీ భార్య

మూడు రోజుల క్రితం తన భర్తను దేశ అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ చంపేశారని అలెక్సీ నావల్నీ భార్య యులియా నావల్నయా సోమవారం ఆరోపించారు. రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ ఈనెల 16న జైలులో హఠాన్మరణం పాలయిన సంగతి తెలిసిందే. నావల్నీ పనులను తాను కొనసాగిస్తానని, మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం కొనసాగిస్తానని సోమవారం ఓ వీడియోలో యులియా నావల్నయా వెల్లడించారు. తనకు మద్దతుగా నిలవాలని నావల్నీ మద్దతుదారులను ఆమె కోరారు.

పరువు హత్యకేసులో నలుగురికి రెండు యావజ్జీవకారాగార శిక్షలు

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు జిల్లా ఆదివరాహనత్తంలో పదేళ్ల క్రితం జరిగిన పరువు హత్య కేసులో నలుగురికి రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2014లో ఆదివరాహనత్తం ప్రాంతంలో వేర్వేరు కులాలకు చెందిన సీత, శరవణన్ అనే యువతీ యువకులు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత శరవణన్ కుటుంబీకులు యువతి కుటుంబీకులతో తరచూ తగాదాలు పడుతుండేవారు. శరవణన్ కులానికి చెందినవారు ఈ ప్రేమవివాహం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆ నేపథ్యంలో సీతను దారుణంగా హతమార్చి రహస్యంగా మృతదేహాన్ని కాల్చివేశారు. పోలీసులు విచారణ జరిపి ఆ హత్యకేసుకు సంబంధించి సీత భర్త శరవణన్‌ను, అతడి తల్లి, చెల్లెలు, బావను అరెస్టు చేశారు. ఈ కేసుపై కడలూరు ప్రత్యేక కోర్టులో విచారణ సుదీర్ఘ కాలం సాగింది. సోమవారం ఉదయం నిందితులు నలుగురికి రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది.



పరువు హత్యకేసులో అరెస్టయిన యువతి భర్త శరవణన్, అతడి కుటుంబీకులు

టీఎస్ - ఐపాస్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 20 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

పారిశ్రామిక ప్రాజెక్టులకు త్వరితగతిన అన్నిరకాల ఆమోదం తెలపడానికి (టిఎస్-ఐపాస్ - తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రోవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్)ను తెలంగాణ రాష్ట్రప్రభుత్వం 2014లో అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఇందులోని అన్ని ప్రాజెక్టులకు 30 రోజుల వ్యవధిలో అన్నిరకాల అనుమతులు ఇవ్వాలి.

టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలు


2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 జనవరి వరకు టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనల వివరాలు కిందివిధంగా ఉన్నాయి.

సంవత్సరం	ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనలు
2014-15	174
2015-16	1531
2016-17	1705
2017-18	2803
2018-19	2796
2019-20	3036
2020-21	3431
2021-22	4116
2022-23 జనవరి వరకు	2518

పై పట్టిక ప్రకారం టిఎస్ ఐపాస్ అమలులోకి వచ్చిన 2014-15 నుంచి ఆమోదం పొందిన పారిశ్రామిక ప్రతిపాదనల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2017-18, 2018-19లలో ఆ సంఖ్య కొద్దిగా తగ్గింది. మరలా పుంజుకొని 2021-22లో గరిష్ఠంగా 4166కి చేరింది. మొత్తమ్మీద 2014-15 నుంచి 2023 జనవరి వరకు 22110 ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. ఆమోదించిన మొత్తం ప్రతిపాదనల పెట్టుబడి విలువ రూ.2,53,575 కోట్లు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 17.26 లక్షలమందికి ఉపాధి లభించింది.

పరిశ్రమల పరిమాణం ఆధారంగా చూస్తే మొత్తం ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 65.4 శాతం సూక్ష్మ సంస్థలు, 27.9 శాతం చిన్న సంస్థలు, 2.7 శాతం మధ్యతరహా సంస్థలు, 3 శాతం భారీ పారిశ్రామిక సంస్థలు, ఒక శాతం మెగా పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి.

మొత్తం వచ్చిన పెట్టుబడిలో 59.3 శాతం మెగా పారిశ్రామిక సంస్థలకు, 19.9 శాతం పెద్దతరహా సంస్థలకు, 7.3 శాతం మధ్యతరహా సంస్థలకు, 10.4 శాతం చిన్న సంస్థలకు, 3.2 శాతం సూక్ష్మ సంస్థలకు వచ్చింది. ఈ ప్రతిపాదనల ద్వారా కల్పించిన మొత్తం ఉద్యోగితలో 41.8 శాతం మెగా పారిశ్రామిక సంస్థల ద్వారా, 21.0 శాతం చిన్నసంస్థల ద్వారా, 17.4 శాతం, సూక్ష్మ సంస్థల ద్వారా 11.2 శాతం పెద్దసంస్థల ద్వారా, 8.5 శాతం మధ్యతరహా సంస్థల ద్వారా కల్పించారు.



పారిశ్రామిక ప్రతిపాదనలు ఆమోదం పొందిన జిల్లాలను చూస్తే మేడ్చల్-మల్కాజిగిరి(21.20 శాతం), సంగారెడ్డి(8.01 శాతం), రంగారెడ్డి(7.5 శాతం)లు యూనిట్ల సంఖ్య ఆధారంగా మొదటి మూడు స్థానాలు ఆక్రమించాయి.

పెట్టుబడుల పరంగా రంగారెడ్డి(32.15 శాతం), నల్లగొండ(11.17 శాతం), భద్రాద్రి కొత్తగూడెం (9.05 శాతం)లు మొదటి మూడుస్థానాలు ఆక్రమించాయి. ఈ ప్రతిపాదనల ద్వారా లభించిన ఉపాధిలో రంగారెడ్డి(56.66 శాతం), వరంగల్(11.12 శాతం), సంగారెడ్డి(8.04 శాతం)లు మొదటి మూడు స్థానాలు పొందాయి.

టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలను రంగాల వారీగా చూసినప్పుడు 2015-16, 2022-23 మధ్యకాలంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్య పరిశ్రమల సంఖ్యలో

ఎకానమీ

నిర్దిష్టమైన పెరుగుదల ఉంది. సిమెంట్, సిమెంట్ ఉత్పత్తులు 2015-16 నుంచి 2022-23 వరకు మొత్తం పెట్టుబడిలో వాటాను గణనీయంగా పెంచుకున్నాయి. అయితే 2022-23లో ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు ఎక్కువ పెట్టుబడిని ఆకర్షించాయి. 2016-17 నుంచి 2020-21 మధ్యకాలంలో కల్పించిన మొత్తం ఉపాధిలో 50 శాతం కంటే ఎక్కువ ఐ.టి.రంగం కల్పించింది.



అయితే మొత్తం కల్పించిన నూతన ఉపాధిలో 2021-22లో 36.9 శాతం, 2022-23(జనవరి 23)లో 15.1 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం.

2015 నుంచి 2023 జనవరి వరకు టిఎస్ ఐపాస్ కింద ఆమోదం పొందిన ప్రతిపాదనలను వివిధ రంగాల వారీగా పట్టిక-2లో చూడవచ్చు.

సంవత్సరం	ఇంజనీరింగ్	ఫుడ్ ప్రాసెసింగ్	వ్యవసాయాధారిత (శీతలీకరణ కేంద్రాలు సహా)	సిమెంట్, సిమెంట్-కాంక్రీట్ ఉత్పత్తులు ఫ్లైయాష్ బ్రిక్స్	గ్రానైట్స్, రాళ్లు కొట్టే పరిశ్రమలు	ఇతరాలు
2015-16	219	233	182	95	136	666
2016-17	376	235	152	139	165	638
2017-18	632	401	290	236	257	987
2018-19	639	469	291	269	198	930
2019-20	576	466	449	284	236	1025
2020-21	565	651	573	490	235	917
2021-22	682	1032	467	298	232	1405
2022-23	488	639	87	182	172	950

పట్టిక-2ను పరిశీలిస్తే 2015 నుంచి 2023 జనవరి మధ్య ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలకు ఎక్కువ ఆమోదం లభించింది. ఆ తరవాత స్థానాలను వ్యవసాయాధారిత, సిమెంట్, గ్రానైట్ పరిశ్రమలు పొందాయి. ఇంజనీరింగ్ సంస్థలు 2015-16లో 219 ఆమోదం పొందగా 2021-22లో 682 సంస్థలు ఆమోదం పొందాయి. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలు 2015-16లో 233 ఆమోదం పొందగా 2021-22లో 1032 ఆమోదాన్ని పొందాయి. శీతలీకరణ కేంద్రాలు సహా వ్యవసాయాధారిత పరిశ్రమల యూనిట్లు 2015-16లో 182 ఆమోదం పొందగా 2020-21లో గరిష్ఠంగా 573 ఆమోదం పొందాయి. సిమెంట్, సిమెంట్-కాంక్రీట్ పరిశ్రమలు 2015-16లో 95 ఆమోదం పొందగా 2020-21లో గరిష్ఠంగా 490 ఆమోదం పొందాయి. గ్రానైట్, రాళ్లను కొట్టే పరిశ్రమల యూనిట్లు 2015-16లో 136 ఆమోదం పొందగా 2020-21లో 235 ఆమోదం పొందాయి.

మొత్తమ్మీద 2015 నుంచి అన్ని రంగాల పరిశ్రమల యూనిట్లకు ఆమోదాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. అయితే కొన్నిరకాల పరిశ్రమల యూనిట్లు 2015 నుంచి 2020-21 వరకు పెరిగి, ఆ తరవాత తగ్గాయి.

వివిధ రంగాలు ప్రతి సంవత్సరం అదనంగా కల్పించిన ఉద్యోగితపరంగా చూస్తే రియల్ ఎస్టేట్, పారిశ్రామిక పార్కులు, ఐటి నిర్మాణం పరిశ్రమలు 2015-16లో అదనంగా 22,150 ఉద్యోగాలు కల్పించగా, 2018-19లో గరిష్ఠంగా 3,31,795 ఉద్యోగాలను కల్పించాయి. టెక్స్‌టైల్ రంగం 2015-16లో 631 ఉద్యోగాలు కల్పించగా 2018-19లో గరిష్ఠంగా 1,89,594 మందికి ఉపాధి కల్పించాయి. ఫార్మాస్యూటికల్, రసాయన పరిశ్రమలు 2015-16లో 18,881 ఉద్యోగితను కల్పించగా 2021-22లో గరిష్ఠంగా 37,403 మందికి ఉపాధి కల్పించాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2015-16లో గరిష్ఠంగా 12,947 మందికి ఉపాధిని కల్పించింది. ఇంజనీరింగ్ పరిశ్రమ 2015-16లో 4,618 మందికి ఉపాధిని కల్పించగా 2017-18లో గరిష్ఠంగా 12,452 మందికి ఉపాధి కల్పించింది.




డా.ఎం.ఎ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి

(నిన్నటి తరువాయి)

ఎకానమీ: పరిశీలించినప్పుడు 2014లో 10, 2013లో 19 ప్రశ్నలు వచ్చాయి. ఎకానమీలో మౌలిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. బడ్జెట్, ఎకనామిక్ సర్వే నుంచి కూడా అధికంగా ప్రశ్నలు వస్తాయి. ఇటీవలి కాలంలో ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ నగదు రహిత ఆర్థిక వ్యవస్థ, ఆర్బీఐ ద్రవ్య పరపతి విధానం, క్రిప్టోకరెన్సీ, స్టార్టప్ - యూనికార్న్ స్టార్టప్ వంటి అంశాలు వినిపిస్తున్నాయి. ఎంఎస్పీ(కనీస మద్దతు ధర) అంటే ఏమిటి? ఎవరు ఇస్తారు? ఏయే పంటలకు ఇస్తారు వంటివి చదవాలి. జీఎస్టీ ఆర్థిక సంఘం, భారత దేశ వృద్ధి అంచనాలు, యూపీఐకి సంబంధించి వివరంగా చదవాలి. బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు, ఆర్థిక సమీక్ష కచ్చితంగా, లోతుగా చదవాలి.



ఎకానమీకి సంబంధించి ఎన్సీఈఆర్టీ 9-12 పుస్తకాలు చదివితే మౌలిక అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. బడ్జెట్ 2023-24, ఎకనామిక్ సర్వే 2022-23 బాగా చదవాలి. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదవాలి.

జనరల్ సైన్స్: శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ: సంబంధించి 6-10వ తరగతి వరకు ఎన్సీఈఆర్టీ పుస్తకాలు చదవాలి. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీలో వర్తమాన అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ప్రాథమిక అంశాలు మొదట చదవాలి. కరెంట్ అఫైర్స్‌తోపాటు, వివిధ మంత్రిత్వశాఖల ఇయర్ ఎండ్ రివ్యూతోపాటు అప్డేట్స్ చదవాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ప్రాథమిక అంశాలకు రవి అగ్రహరి సైన్స్ అండ్ టెక్నాలజీ బుక్ చదివితే మంచిది.

పర్యావరణం: 2020లో 10 ప్రశ్నలు, 2014, 2016లో 18 ప్రశ్నలు వచ్చాయి. పర్యావరణంలో జీవవైవిధ్యం, జీవవైవిధ్య సంరక్షణ, పర్యావరణ చట్టాలు, పర్యావరణ సంస్థలు, కమిటీలు, సమావేశాల గురించి ప్రశ్నలు వస్తాయి. వీటితో పాటు పర్యావరణ కాలుష్యానికి సంబంధించి భూ, జల, గాలి కాలుష్యం, రేడియోధార్మికత కాలుష్యం, కాలుష్య నివారణ చట్టాలు, నివారణ చర్యలు, ఓజోన్ పొర క్షీణత, గ్లోబల్ వార్మింగ్‌పై ప్రశ్నలు వస్తాయి. కాప్-27 సదస్సు గురించి చదువుతూ గతంలో జరిగిన సదస్సులు, వాటి తీర్మానాలను చదవాలి. ఏ సదస్సు ఏ అంశాన్ని ప్రధానాంశంగా తీసుకున్నదో చదవాలి. గత సంవత్సర కాలంలో రెడ్ లిస్టుకి సంబంధించి అంతరిస్తున్న జీవజాతులు, వృక్ష జాతులను చదవాలి. ఆ జాతులకి సంబంధించిన జంతువు, వృక్షాన్ని బాగా చదవాలి. అందులో భాగంగానే దాన్ని భారతదేశంలో చట్టానికి అన్వయించుకోవాలి.

పర్యావరణంపై ఎన్సీఈఆర్టీ ఎన్విరాన్‌మెంట్ తోపాటు శంకర్ అకాడమీ 'అవర్ ఎన్విరాన్‌మెంట్ గాని లేదా రవి అగ్రహరి 'ఎన్విరాన్‌మెంట్' గాని లేదా 'పిఎంఎఫ్ ఐఏఎస్ ఎన్విరాన్‌మెంట్' బుక్ చదవాలి. ఎన్సీఈఆర్టీ 8వ తరగతి పుస్తకంతోపాటు బయాలజీ 11లోని 13-16 చాప్టర్స్ (ఎన్విరాన్‌మెంట్ బయాలజీ) చదవాలి.

వర్తమాన అంశాలు: గడచిన సంవత్సర కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ అంశాలు చదవాలి. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు విడుదలచేసే నివేదికలు, సూచికలు కచ్చితంగా చదవాలి. ఇటీవలి కాలంలో క్రీడలకు ప్రాధాన్యం పెరిగింది. వీటికి సంబంధించి పిఐబి వెబ్‌సైట్, ద హిందూ పేపర్ చదువాలి. అలాగే ఏదైనా ఒక ప్రముఖ సంస్థకి చెందిన కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చదవాలి.

వీటితోపాటు ముఖ్యంగా జనరల్ స్టడీస్‌కి సంబంధించిన ప్రాక్టీస్ పేపర్లు రాయాలి. సుమారు 50-60 ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేస్తే అభ్యర్థికి నమ్మకం ఏర్పడుతుంది. ముఖ్యంగా గడిచిన 20 సంవత్సరాల్లో జరిగిన సివిల్స్ ప్రిలిమినరీ ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ కోర్సు



కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ఐ)- 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ షుగర్ రిఫైనరీ ఆపరేషన్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి మూడు నెలలు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారాన్ని ఈ-మెయిల్ ద్వారా అప్‌లోడ్ చేసి హార్డ్ కాపీని కింది చిరునామాకు పంపాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు షుగర్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ హౌస్‌లో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి. సంస్థ అందిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ పూర్తిచేసి కనీసం రెండు సీజన్ల అనుభవం లేదా సంస్థ నుంచి షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు మూడు సీజన్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్ల మించకూడదు. విదేశీ అభ్యర్థులను 38 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

రిటెన్ టెస్ట్: పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి 35 ప్రశ్నలు; రెండో సెక్షన్‌లో షుగర్ ప్రాసెస్‌కు సంబంధించి 15 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. పరీక్ష సమయం మూడు గంటలు. క్యాలిక్యులేటర్లను అనుమతించరు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.12,000(విదేశీ అభ్యర్థులకు రూ.48,000)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 25
- **ఈ మెయిల్ ద్వారా అడ్మిట్ కార్డ్‌ల జారీ:** మార్చి 28 నుంచి
- **రిటెన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 14
- **పరీక్ష కేంద్రం:** ఎన్ఎస్ఐ, కాన్పూర్
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **ఈ-మెయిల్:** nsikanpureducation@gmail.com
- **వెబ్‌సైట్:** http://nsi.gov.in

ఏపీ జర్నలిజం కాలేజీలో అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం- పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులను రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో అందిస్తున్నారు. ఆన్‌లైన్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. అభ్యర్థులు తెలుగు లేదా ఇంగ్లీష్ మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

కోర్సులు

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం:** కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం:** కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.

ముఖ్య సమాచారం

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** మార్చి 5
- **మొబైల్ నెం:** 9848512767; 7286013388
- **ల్యాండ్ లైన్ నెంబర్:** 040-79610940
- **వెబ్‌సైట్:** www.apcj.in





సరైన న్యాయం

ఒక ఊరిలో సోమయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టేవాడు. ప్రతిరోజూ అదే పని చేసేవాడు. ఆ పని ఇరవై ఏళ్లుగా చేస్తున్నాడు. ఆ కట్టెలు మోసుకు వచ్చి బొగ్గులు కాల్చి అమ్ముకునేవాడు. డబ్బులు అవసరం అనిపిస్తే ఆరోజే తన ఊరికి దగ్గరలో ఉండే చిన్న టౌనులో కట్టెలు అమ్ముకునేవాడు. అదే అతని జీవన ఉపాధి. అతనికి తెలిసొచ్చిన విద్య కూడా అదే. ఏ చీకూ చింతా లేకుండా అడవికి వెళ్లేవాడు. ఎవరినీ పట్టించుకునేవాడు కాదు. అతడికి ముగ్గురు పిల్లలు. వారి ఆలనా పాలన చూసుకోవటానికి ఎన్నో కష్టాలు పడేవాడు.

సోమయ్య కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేది కాదు. తన తోబుట్టువుల పెళ్లిళ్లు, కార్యాలకు డబ్బును ఖర్చుపెట్టేవాడు. దీనికోసం దొరల దగ్గర అప్పు చేసేవాడు. ఆ అప్పు తీర్చలేక కష్టమే దిక్కు అనుకునేవాడు. తన జీవితం ఇంతేనేమో అనుకునేవాడు. అయినా పని చేయకుంటే జీవితం గడవదని అనుకునేవాడు. అందుకే విధిగా పని చేసేవాడు.

ఒకరోజు కట్టెలు కొట్టి.. వీపు మీద వేసుకుని అడవినుంచి టౌనుకు బయలు దేరాడు. పట్టణంలో ఎక్కడ చూసినా జనాలు. ఏదో తిరునాళ. తీయండి బాబు అడ్డం తీయండి.. తల మీద బరువుంది. ఈ జాస్తి బరువుతో నడవలేకున్నా అని గట్టిగా అరిచాడు. ఆ వీధిలోనే దొర దగ్గర పనిచేస్తే బంట్రోతు వెళ్తున్నాడు. దొర దగ్గర డబ్బుల వ్యవహారం చూసుకునేవాడు. దర్జాగా దారిలో వెళ్తున్నాడు. తీయండి.. అని అరిచినా పక్కకు పోలేదు. కట్టె అతనికి తగిలింది. ఇంత పనికిమాలిన పని చేస్తావా? వెధవ..అంటూ కసురుకున్నాడు. పక్కన ఉండే యువకులను పిలిచి 'వీడిని న్యాయాధికారి దగ్గరకు ఈడ్చుకు రండి' అని అన్నాడు. సోమయ్యను లాక్కెళ్లారు.

న్యాయాధికారి సోమయ్య వైపు చూశాడు. కోపంగా చూశాడు. సోమయ్య పట్టించుకోలేదు. అతనికి తెలియనట్లే ఉన్నాడు. మాట్లాడు అని హుంకరించినా మాట్లాడలేదు. 'చూడు వీడు బెల్లం కొట్టిన రాయిలా ఉన్నాడు. మాటలు రావు. నాలుగు తగిలిస్తే సరి' అన్నాడు బంట్రోతు. అయినా సోమయ్య మౌనం దాల్చాడు. అప్పుడు బంట్రోతు కోపంతో ఊగిపోయాడు. 'తీయండి.. తల మీద బరువు ఉంది. జాస్తి బరువును మోయటం కష్టం అని గట్టిగ అరిచావు. ఇపుడేమో గమ్మున ఉన్నావు' అంటూ చెర్నకోలా తీసుకున్నాడు. అప్పుడు న్యాయాధికారి ఇలా అన్నాడు.. 'మీరే తప్పు చేశారు. ఏమీ తెలియని సోమయ్య తప్పేలేదు. అరిచినా మీరు అడ్డం తీయలేదంటే.. తప్పెవరిదీ? ఈ చర్నకోలాతో మిమ్మల్నే కొట్టాలి. కాస్త పొగరు తగ్గించుకోండి' అంటూ న్యాయాధికారి చివాట్లు పెట్టాడు. బంట్రోతు మౌనం దాల్చాడు.

6 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



ఎంత మంది ఉన్నారు..?



డైలీ సుడోకు - 234

	8				2	5	6	
9				4				
			3				4	7
	4			2		6		
		7				3		
		3		8			5	
5	2				4			
				3				4
	3	1	8				9	

సుడోకు - 233 సమాధానం

2	6	9	4	5	1	8	7	3
4	3	8	7	9	6	2	1	5
7	1	5	2	3	8	9	4	6
3	9	1	5	2	7	6	8	4
5	7	6	8	4	3	1	2	9
8	4	2	6	1	9	3	5	7
9	8	3	1	7	5	4	6	2
1	5	4	9	6	2	7	3	8
6	2	7	3	8	4	5	9	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.